సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 261

గురువారం 12-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'



**చితగ్గొట్టి... సిరీస్ పట్టి...**

మూడో టి20లో విండీస్‌పై గెలుపుతో సిరీస్ టీమిండియా సొంతం -స్పోర్ట్స్‌లో



**సమాజం మారాలి.. సర్**

ఐడబ్ల్యూఎస్ఏ సదస్సులో పద్మశ్రీ ఎం.రోహిణి గోడ్‌బోలే – ఫ్యామిలీలో



పౌరసత్వ సవరణ బిల్లుపై బుధవారం రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్ షా. చిత్రంలో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు

# 'పౌరసత్వ' బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**త్వరలో రాష్ట్రపతి ఆమోదంతో చట్టరూపం**

**125-99 ఓట్లతో పెద్దల సభలో గట్టెక్కిన బిల్లు**

"ఇతర దేశాల నుంచి వచ్చి భారత పౌరసత్వం పొందాలనుకునే ముస్లింలు ప్రస్తుత చట్టాల ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశముంది. పాక్, బంగ్లా, అఫ్గాన్‌ల్లో మత వివక్షను ఎదుర్కొన్న మైనారిటీలకు భారతీయ పౌరసత్వం కల్పించడమే ఈ బిల్లు లక్ష్యం. ఇది పౌరసత్వం కల్పించేదే కానీ.. పౌరసత్వాన్ని లాక్కొనేది కాదు. ఈ విషయంలో ముస్లింలు భయాందోళలకు గురి కావాల్సిన అవసరం లేదు.

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

"ఈ బిల్లు భారత రాజ్యాంగ మౌలిక భావనలకు వ్యతిరేకం. ఇది వివక్షాపూరితంగా, విభేదాలు సృష్టించేలా ఉంది. హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకు వెళ్లేందుకే ఈ బిల్లును తీసుకు వచ్చారు. అదృష్టవశాత్తూ మీరు రాజ్యాంగ సవరణ చేయడం లేదు. చట్టాన్ని చేస్తున్నారంతే. ఇది న్యాయసమీక్షకు నిలవబోదు అనే విషయం మాకు స్పష్టంగా తెలుసు. దీన్ని కోర్టు కచ్చితంగా కొట్టేస్తుంది.

**కాంగ్రెస్**

5 లో

# ఆరోగ్య ప్రొఫైల్.. గజ్వేల్ నుంచే..

- ప్రజలందరి ఆరోగ్య రికార్డులు తయారు చేయాలి
- గజ్వేల్ పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్
- గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలే కథానాయకులు
- జనవరి చివరిలోగా సిద్దిపేట జిల్లాకు గోదావరి జలాలు
- మంత్రులూ.. గజ్వేల్‌పై దృష్టి పెట్టండంటూ చమత్కరింపు

"మనం ఎన్ని కోట్లు సంపాదించి పిల్లలకు ఇచ్చామనేది ముఖ్యం కాదు. ఎంత ఆహ్లాదకరమైన వాతావరణం అందించామన్నదే కీలకం. కోట్లు సంపాదించి పెట్టి వాతావరణ కాలుష్యం ఇస్తే ఏం ప్రయోజనం? ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. హరితహారం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి. పిల్లలను పెంచినట్లు మొక్కలు పెంచాలి.

– ముఖ్యమంత్రి కేసీఆర్

2 లో



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో సీఎం కేసీఆర్‌కు ఆప్యాయంగా శాలువా అందజేస్తున్న అడివమ్మ

# 15వేల కోట్ల రుణాలకు ఓకే

**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి వినియోగించనున్న ప్రభుత్వం**

- నాబార్డ్, పీఎఫ్‌సీ నుంచి సమీకరించాలని కేబినెట్ నిర్ణయం
- దుమ్ముగూడెం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పచ్చజెండా
- బ్యారేజీకి అనుబంధంగా జల విద్యుదుత్పత్తి కేంద్రం
- మిడ్‌మానేరుకు అదనపు టీఎంసీ తరలించే పనులకు అనుమతి
- ఎల్లంపల్లి నుంచి 1.1 టీఎంసీ నీటిని తరలించేలా ఏర్పాట్లు
- లోకాయుక్త చట్ట సవరణకు ఆర్డినెన్స్
- రాష్ట్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

**ఖర్చులు తగ్గిద్దాం...**

- స్వీయ నియంత్రణ పాటించాలి
- నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి : కేసీఆర్

2 లో

సాక్షి, హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కొత్తగా మరో రూ.15,575.11 కోట్ల రుణాలు సమీకరించాలన్న ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాళేశ్వరం నీటిపారుదల పథకం కార్పొరేషన్ పేరుతో నాబార్డు నుంచి రూ.1,500 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.10 వేల కోట్లు, పీఎఫ్‌సీ నుంచే మరో రూ.4,075.11 కోట్ల రుణాలు తీసుకోవాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9.30 గంటల పాటు కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది.

- గోదావరిపై దుమ్ముగూడెం బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. రూ.3,481.9 కోట్ల అంచనా వ్యయంతో దుమ్ముగూడెం బ్యారేజీ నిర్మాణానికి అనుమతిచ్చింది. ఈ బ్యారేజీకి అనుబంధంగా 320 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మించాలని నిర్ణయించింది. ఈ బ్యారేజీకి అయ్యే ఖర్చును రెండేళ్ల పాటు బడ్జెట్లలో కేటాయించాలని నిర్ణయించింది. దుమ్ముగూడెం వద్ద నీటి లభ్యత పుష్కలంగా ఉండే ఐదారు నెలల పాటు తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. 37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 63 మీటర్ల ఎత్తులో, భూసేకరణ అవసరం లేకుండా నదిలోనే నీళ్ల నిల్వ ఉండేలా బ్యారేజీ నిర్మాణం చేపట్టొచ్చని అధికారులు తెలిపారు. ఈ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది.
- కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మిడ్‌మానేరు వరకు 3 టీఎంసీల నీటిని తరలించేందుకు అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం నిర్మించిన ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసే వీలుంది. మేడిగడ్డ వద్ద గోదావరిలో పుష్కలమైన నీటి లభ్యత ఉన్నందున రోజుకు 3 టీఎంసీలను ఎత్తిపోసుకోవచ్చని అధికారులు ప్రతిపాదించారు. మిడ్‌మానేరు వరకు

మిగతా 2వ పేజీలో ▶





- విజయవంతంగా పీఎస్ఎల్‌వీ సీ–48ను ప్రయోగించిన ఇస్రో
- పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో అర్ధ సెంచరీ
- షార్ నుంచి 75 రాకెట్ ప్రయోగాలతో ప్లాటినం జూబ్లీ రికార్డు
- 21.19 నిమిషాలకు కక్ష్యలోకి చేరిన 10 ఉపగ్రహాలు

4 లో

# ఎన్‌కౌంటర్‌పై రెండు నివేదికలు

- 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై ముగిసిన ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణ
- సీల్డ్‌కవర్‌లో ప్రాథమిక నివేదిక.. త్వరలోనే తుదినివేదిక!
- బాధితులు, సాక్షులతో కలిపి 30 మంది వాంగ్మూలం నమోదు



## 'సుప్రీం' రిటైర్డ్ జడ్జితో విచారణ

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు ప్రతిపాదన

- వివరాలు 3లో







# 1000 బస్సులు ఔట్



**హైదరాబాద్‌లో తగ్గిపోనున్న సిటీ బస్సులు**


**మూడు రోజుల్లో తొలగించాలని ఆదేశాలు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సిటీ బస్సుల సంఖ్యను అధికారులు మూడు రోజుల్లో తగ్గించనున్నారు. గురువారం నుంచే కొద్దికొద్దిగా తగ్గిస్తూ శనివారం నాటికి వెయ్యి బస్సులు తొలగించాలని డిపోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వెయ్యి బస్సులు తొలగించాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. డిపోల వారీగా తగ్గించే బస్సుల సంఖ్యతో జాబితా సిద్ధం చేశారు. హైదరాబాద్ రీజియన్‌లో 550 బస్సులు, సికింద్రాబాద్ రీజియన్‌లో 450 బస్సులను ఇందులో చేర్చారు. కానీ దీనిపై దాదాపు అన్ని డిపోల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చార్జీల పెంపుతో ఆదాయం పెరుగుతున్నందున, అన్ని బస్సులు సరిగ్గా నడిపితే నష్టాలు చాలా వరకు తగ్గించొచ్చని, ఇప్పుడు ఒకేసారి వెయ్యి బస్సులను ఆపేస్తే ఆదాయం పడిపోతుందని, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయని డిపో మేనేజర్లు పేర్కొంటున్నారు. బస్సులను తగ్గించినా సిబ్బందిని తొలగించే పరిస్థితి లేనందున వేతనాల రూపంలో ఖర్చు అలాగే ఉంటుందని చెబుతున్నారు. అందుకే ఈ నిర్ణయంపై పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**సరుకు రవాణాకు మళ్లింపు..**

రద్దు చేయబోయే బస్సులను త్వరలో ప్రారంభించబోయే సరుకు రవాణా విభాగానికి బదిలీ చేయనున్నట్లు సమాచారం. ప్రయాణికులపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమే అయినా.. దాన్ని కొనసాగించాలనే అధికారులు నిర్ణయానికి వచ్చారు. సీఎం సమావేశంలో తీసుకున్న నిర్ణయం కాబట్టి.. అమలు విషయంలో చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, బస్సుల రద్దుతో ఆర్టీసీలో కొత్త గందరగోళం నెలకొననుంది. వెయ్యి బస్సులు రద్దు చేస్తే దాదాపు 4 వేల మంది సిబ్బంది అదనంగా ఉంటారు. ప్రస్తుతం ఆర్టీసీలో సగటు వేతనం 40 వేలు మించి ఉంది. ఈ 4 వేల మందికి పనిలేక పోగా వారికి ఊరికే వేతనం చెల్లించాల్సి వస్తుంది. ఇదో పెద్ద సమస్యగా పరిణమించనుంది. ఈ నేపథ్యంలో అదనంగా మారే సిబ్బందిని ఇతర విభాగాలకు తరలించేందుకు ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు శాఖలో డ్రైవర్లకు కొరత ఉంది. దీంతో బస్సుల రద్దుతో అదనంగా మారే 2 వేల మందికి పైగా డ్రైవర్లను పోలీసు విభాగం, అగ్నిమాపక విభాగం.. ఇలా కొరత ఉన్న విభాగాలకు బదిలీ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఇక కండక్టర్లను ఏం చేయాలన్న విషయంలో స్పష్టత రాలేదు. అయితే ఆర్టీసీ ఆధ్వర్యంలో కొత్తగా ప్రారంభించే సరుకు రవాణా విభాగంలో కొందరిని, ఆర్టీసీ పెట్రోల్ బంకుల్లో కొంత మందిని వినియోగించుకోవాలని చూస్తున్నారు.

# అత్యాచారానికి ఉరే





**21 రోజుల్లోనే తీర్పు**

- వారం రోజుల్లో దర్యాప్తు.. 14 రోజుల్లో విచారణ పూర్తి
- మహిళలు, బాలికల భద్రత కోసం 'ఏపీ దిశ యాక్ట్'
- ముసాయిదా బిల్లుకు ఏపీ మంత్రివర్గం ఆమోదం
- ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టరూపం

సాక్షి, అమరావతి

మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా.. నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చరిత్రాత్మక ముసాయిదా బిల్లుకు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. మహిళలు, బాలికలపై క్రూరమైన నేరాలకు పాల్పడే వారికి ఇక జీవితం ఉండదనే రీతిలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చేలా ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా (సవరణ) చట్టం–2019 (ఆంధ్రప్రదేశ్ దిశ యాక్ట్)ను తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ చట్టంలో భాగంగా మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలకు పాల్పడాలంటే హడలెత్తేలా కొత్త చట్టం తీసుకొస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీకి అనుగుణంగా 'ఏపీ దిశ' చట్టాన్ని రూపొందించారు. ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని

మిగతా 2వ పేజీలో ▶



# నాటి మోదీ ప్రభుత్వానికి క్లీన్‌చిట్

- 2002 నాటి గుజరాత్ అల్లర్ల విషయంలో అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తప్పేమీ లేదని జస్టిస్ నానావతి కమిషన్ స్పష్టం చేసింది. గుజరాత్ హోం శాఖ మంత్రి ప్రదీప్ సిన్హ్ జడేజా బుధవారం నానావతి కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

- వివరాలు 5లో






## క్లుప్తంగా...

### వచ్చే మూడ్రోజులు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు వీస్తుండటంతో రానున్న 3 రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్తంత ఎక్కువగా నమోదవుతున్నాయి. భద్రాచలంలో సాధారణం కంటే 5.8 డిగ్రీలు అధికంగా 22 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్‌లో సాధారణం కంటే 3.6 డిగ్రీలు ఎక్కువగా 17.5 డిగ్రీలు, రామగుండంలో 3.1 డిగ్రీలు అధికంగా 17.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్‌లో మాత్రమే అత్యంత తక్కువగా 13.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

### కాళేశ్వరంపై ఎన్జీటీ విచారణ జనవరికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుకు మంజూరైన అనుమతులను సవాల్ చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలైన కేసు విచారణ జనవరి 20వ తేదీకి వాయిదా పడింది. ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించలేదని పిటిషనర్ హాయాతుద్దీన్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ బుధవారం విచారణ సందర్భంగా వాదించారు. ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చి సామర్థ్యాన్ని పెంచేశారని, పెంచిన సామర్థ్యానికి అనుగుణంగా కొత్త అనుమతుల అవరసం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం దాన్ని విస్మరించిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌ను ఆదేశించిన జస్టిస్ రఘువేంద్ర రాథోర్ బెంచ్ తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

### ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని పరిశీలించిన పౌర హక్కుల నేతలు

హైదరాబాద్: దిశ కేసులో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన ప్రదేశాన్ని, నిందితులు దిశను దహనం చేసిన చటాన్‌పల్లి బ్రిడ్జి కింది ప్రదేశాన్ని బుధవారం పౌర హక్కుల సంఘం నాయకులు పరిశీలించారు. ఎన్‌కౌంటర్ ఎలా జరిగింది, హంతకులను పోలీసులు ఎక్కడ ఎన్‌కౌంటర్ చేశారన్న విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం సమీపానికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు వారిని చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దనే అడ్డుకున్నారు. దీంతో వారు జాతీయ రహదారిపై నుంచే ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని చూశారు.

### అవినీతి కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

సాక్షి, హైదరాబాద్: అవినీతి కేసులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో పనిచేసే షేక్ యూనస్ 2008 సెప్టెంబర్‌లో ఓ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిల్‌ను విడుదల చేయడానికి రూ. 6 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని మహమ్మద్ దాదా ఖలిందర్ అనే మరో కానిస్టేబుల్ చేత వసూలు చేయించాడు. బాధితుల ఫిర్యాదుతో అప్పటికే వల వేసిన ఏసీబీ ఈ కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో మహమ్మద్ యూనస్‌ను విధుల నుంచి తొలగించాలని, ఖలిందర్ పింఛన్, గ్రాట్యుటీలను నిలిపివేయాలని ఏసీబీ కోర్టు తీర్పునిచ్చింది. వీరికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 1,000 జరిమానా విధించింది. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ పూర్ణచంద్రరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

### టీఆర్‌ఎస్ ఎంపీల ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని టీఆర్‌ఎస్ ఎంపీలు ఆరోపించారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను కూడా విడుదల చేయడం లేదంటూ బుధవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. నిధులను విడుదల చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ధర్నాలో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె. కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు లక్ష్మీకాంతరావు, సంతోష్‌కుమార్, పసునూరి దయాకర్, బీబీ పాటిల్, మాలోతు కవిత, వెంకటేష్ నేత, రంజిత్‌రెడ్డి, బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

### మందుల సేకరణ విధానంలో సవరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ) మందుల సేకరణ విధానంలో సవరణలు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటిదాకా టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ పరిధిలోని నాలుగు విభాగాల అధిపతుల ఆధ్వర్యంలో ఉండే ఆస్పత్రులకు మందుల బడ్జెట్ కేటాయింపులుండేవి. వాటిలో కొంచెం మార్పు చేస్తూ తాజాగా జీవో జారీ చేశారు. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) ఆస్పత్రులకు 40 నుంచి 39 శాతానికి, ప్రజారోగ్య విభాగం పరిధిలోని ఆస్పత్రులకు 40 నుంచి 38 శాతానికి, ఐపీఎంకు 2 నుంచి ఒక శాతానికి తగ్గించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు 18 నుంచి 22 శాతానికి మందుల బడ్జెట్ పెంచారు. ప్రజారోగ్య విభాగం పరిధిలోని చాలా ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్‌లోకి మార్చడం, అలాగే వాటి ఓపీ, ఐపీ ఎక్కువగా ఉండటంతో మందుల బడ్జెట్ కేటాయింపులు పెంచారు. ఇక సర్జికల్, క్లాత్ ఐటెమ్‌లకు సంబంధించిన కేటాయింపుల్లో ప్రజారోగ్య విభాగంలోని ఆస్పత్రులకు 15 నుంచి 14 శాతానికి, డీఎంఈలో 60 నుంచి 56 శాతానికి తగ్గించగా, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 25 నుంచి 29 శాతానికి పెంచారు.



బుధవారం గజ్వేల్ పట్టణంలో సీఎం కేసీఆర్ ప్రయాణిస్తున్న వాహనంపై పూల వర్షం కురిపిస్తున్న మహిళలు

# ఆరోగ్య ప్రొఫైల్‌కు గజ్వేల్ నుంచే నాంది



## ప్రజలందరి ఆరోగ్య రికార్డులు తయారు చేయాలి
## గజ్వేల్ పర్యటనలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి.. అందుకు ప్రజల ఆరోగ్య రికార్డును తయారు చేయాలి.. దీనికి గజ్వేల్ నియోజకవర్గమే నాంది కావాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగులో నిర్మించిన ఫారెస్టు కళాశాల, పరిశోధనా కేంద్రం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనం, మహతి ఆడిటోరియాలను ప్రారంభించి.. వంద పడకల మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు.

### ఆరోగ్య రికార్డు తయారు చేయాలి

అభివృద్ధి చెందిన దేశాల్లో అందరి ఆరోగ్య రికార్డు ఉంటుంది. ఇలాగే మన రాష్ట్రంలోనూ తయారు చేయాలని కేసీఆర్ అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు బ్లెడ్ గ్రూప్, ఇతర వివరాలు తెలిస్తే వెంటనే చికిత్స అందుతుందన్నారు. ముందుగా గజ్వేల్ నియోజకవర్గం ఎక్స్‌రే పేరుతో ప్రతి ఒక్కరినీ పరీక్షించి రికార్డు సిద్ధం చేయాలని చెప్పారు. తర్వాత ఇదే రాష్ట్రమంతా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీ, ఇతర నాయకులు తోడ్పాటు అందించాలన్నారు.

### ప్రతీ నియోజకవర్గంలో మహతి ఆడిటోరియం..

గజ్వేల్‌లో నిర్మించిన ఆడిటోరియం పేరు 'మహతి'అని.. ఈ పేరు తానే పెట్టానని కేసీఆర్ చెప్పారు. ప్రపంచంలోనే గొప్ప సంగీత విద్వాంసులు నారద, తుంబురులని, నారద మహాముని వద్ద ఉన్న వీణ పేరు 'మహతి'అని చెప్పారు. ఈ ఆడిటోరియంలో నిర్వహించే కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణ సాహితీ సౌరభాన్ని మరింత పెంచాలన్నారు. ఇలాంటి ఆడిటోరియం ప్రతీ నియోజకవర్గంలో నిర్మించాలని ఆలోచిస్తున్నామని చెప్పారు.

### సంకల్ప బలం ఉంటే...

ఏ పని చేయాలన్నా సంకల్ప బలం ముఖ్యమని, ఏడాదిలో తమాషా చేసి చూపించవచ్చని సీఎం కేసీఆర్ చెప్పారు. అన్నా హజారే, మోహన్ దాలియా, ప్రొఫెసర్ బండార్కర్ వంటి మహనీయులు సమాజం కోసం పనిచేశారని చెప్పారు. బండార్కర్ ఒక్కరే చేసిన పనికి మహారాష్ట్రలోని కొంగల్ ప్రాంతంలో రూ.10 వేల కోట్ల విలువచేసే ద్రాక్ష పండుతోందన్నారు. అలా మన ప్రాంతాలు కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. అక్కడే సంపద సృష్టించాలని అందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కథానాయకులు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

### సిద్దిపేట జిల్లాకు గోదావరి జలాలు..

కరువును పారదోలడమే ధ్యేయంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకున్నామని.. జనవరి చివరి నాటికి గోదావరి జలాలు సిద్దిపేట జిల్లాలో ప్రవహిస్తాయని కేసీఆర్ చెప్పారు. ముందుగా చెరువులు, కుంటలు నింపుకోవాలన్నారు. కాల్వలకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు రైతులు సహకరించాలని, లక్షల మందికి ఉపయోగపడే కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు. కరెంట్ కష్టాలు లేవని, చెరువులు ఎండేది లేదని.. దీంతో పంటలు సంవృద్ధిగా పండుతాయన్నారు. ఇప్పుడు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి చేపలను దిగుమతి చేసుకుంటున్నామని, ఇక ముందు మనకు కావాల్సిన చేపలు ఇక్కడే పెంచుకుంటామన్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

### భావితరాలకు ఆహ్లాదకరమైన గాలి...

మనం ఎన్ని కోట్లు సంపాదించి పిల్లలు ఇచ్చామనేది ముఖ్యం కాదని, ఎంత ఆహ్లాదకరమైన వాతావరణం అందించామన్నదే కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. కోట్లు సంపాదించి పెట్టి వాతావరణ కాలుష్యం ఇస్తే ఏం ప్రయోజనం అన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. హరితహారం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, పిల్లలను పెంచినట్లు మొక్కలు పెంచాలని అన్నారు. తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా పచ్చని చెట్లతో కన్పించాలని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలతో కొండపోచమ్మ సాగర్ ప్రాంతం అంతా అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని కేసీఆర్ అన్నారు. కొండపాక మండలం గిరాయిపల్లి, తిర్మాయిపల్లి గుట్టలు 7,500 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఔషధ, సుగంధ మొక్కలు నాటాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. గతంలో 'వికారాబాద్ హవా.. లాకోమ రీదోంకా ధవా..'(వికారాబాద్ ప్రాంతంలోని ఔషధ మొక్కల గాలి లక్షల రోగాల ఉపయోగపడే ఔషధం) అనే నానుడి ఉండేదని కేసీఆర్ అన్నారు.



ములుగు అటవీ కళాశాలలో సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజ చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, ఈటల, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

అటువంటి వాతావరణం కొండపాక ప్రాంతంలో తీసుకురావాలన్నారు.

### ప్రియాంకా వర్గీస్ స్ఫూర్తితోనే ఫారెస్టు కళాశాల...

గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగులో నిర్మించిన అటవీశాఖ కళాశాల, పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు తన కార్యాలయంలో పనిచేసే ఐఎఫ్‌ఎస్ అధికారిని ప్రియాంకా వర్గీస్ స్ఫూర్తి అని కేసీఆర్ చెప్పారు. కేరళ రాష్ట్రానికి చెందిన వర్గీస్ తమిళనాడులోని కోయంబత్తురు సమీపంలో ఉన్న మెట్టుపాలెం కళాశాలలో చదివారన్నారు. ఈ కళాశాలలో చదివిన వారిలో 120 మంది ఐఎఫ్‌ఎస్ అధికారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఈటెల రాజేందర్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, హౌసింగ్ కార్పొషన్ చైర్మన్ దామోదర్ గుప్త, ఎమ్మెల్సీలు బోడకుంట్ల వెంకటేశ్వర్‌రావు, కూర రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రసమయి బాలకిషన్, ఒడితెల సతీష్‌కుమార్, పీసీసీఆర్ ఆర్ శోభ, డీన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జర గజ్వేల్‌పై దృష్టి పెట్టండి..

తాను వివిధ పనుల నిమిత్తం బిజీగా ఉండి నియోజకవర్గంపై ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నానని.. మంత్రులు మీరే గజ్వేల్‌పై జర కన్నేసి నిధులు మంజూరు చేయాలని కేసీఆర్ చమత్కరించారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే ఇతర ప్రాంతాలకు వెళ్లి చెప్పవచ్చని, లేకపోతే విమర్శలు వస్తాయన్నారు. ఇక్కడి కలెక్టర్ వెంకట్రామిరెడ్డినే ఎమ్మెల్యేగా భావించి పనులు చేసిపెట్టాలన్నారు. తాను కూడా అవసరమైనప్పుడు సాయం చేస్తానని సీఎం ఛలోక్తి విసిరారు.

### మోడల్ సీఎం కేసీఆర్: హరీశ్‌రావు



నియోజకవర్గం ఎలా ఉండాలో చేసి చూపించిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని, గజ్వేల్ నియోజకవర్గం రాష్ట్రానికే కాదు.. దేశానికే ఆదర్శమని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఏడాదిలో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తానని చెప్పిన కేసీఆర్, ఏడాది తిరగక ముందే హామీ నెరవేర్చారన్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ములుగులో అటవీ కళాశాల, పరిశోధనా కేంద్రం, ఉద్యానవన విశ్వవిద్యాలయం, సమీకృత మార్కెట్, సమీకృత ప్రభుత్వ కార్యాలయం, మహతి ఆడిటోరియం అన్నీ ఒకే రోజు ప్రారంభమయ్యాయని.. ఇది గజ్వేల్ చరిత్రలో శుభదినం అన్నారు. ఈ రోజును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గరోజు అని అన్నారు. ఒక్క గజ్వేల్ లోనే కాకుండా రాష్ట్రంలోని ప్రతీ పల్లెకు, ప్రతీ ఇంటికి తాగునీరు అందించిన ఘనత తెలంగాణదని, ఆ క్రెడిట్ అంతా ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.

## ఏమ్మా.. కిలో టమాటా ఎంత?
### కూరగాయల వ్యాపారితో సీఎం కేసీఆర్ మాటామంతి

రాయపోలు(దుబ్బాక): గజ్వేల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్ అక్కడి వ్యాపారులతో మాట్లాడారు. గజ్వేల్‌కు చెందిన కూరగాయల వ్యాపారి అడవమ్మను పలకరించారు. ఏమ్మా వ్యాపారం ఎలా ఉంది.. టమాటా కిలో ఎంత అంటూ ప్రశ్నించారు. బాగుంది సారూ.. అని ఆమె చెప్పగానే 'మరి నాకు కూరగాయలు ఏమైనా ఇస్తావా'.. అంటూ అడిగారు. దీనికి ఆమె సంతోషంగా నవ్వులు కురిపిస్తూ.. 'అయ్యో ఎంతమాట సారూ.. ఏం కావాలంటే అది ఇస్తాను..'అంటూ నాలుగైదు రకాల కూరగాయలను కేసీఆర్‌కు ఇవ్వబోయింది. అందుకు బోణీ అయిందా అంటూ.. ఆయన తన జేబులోంచి రూ.2 వేల నోటును తీసి అడివమ్మకు ఇచ్చారు. దీంతో ఎంతో సంబరపడిన అడివమ్మ.. కేసీఆర్‌కు రెండు చేతులు జోడించి దండం పెట్టింది. ఈ సందర్భంగా వ్యాపారులు సీఎం కేసీఆర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. మాంసం వ్యాపారులు, చేపల వ్యాపారులతో మాట్లాడారు. మల్లన్నసాగర్ పూర్తయితే అన్ని చెరువులు నీటితో నిండుతాయని, అప్పుడు మన చేపలే అమ్ముకుందామని వ్యాపారులతో అన్నారు.

# అత్యాచారానికి ఉరే

▶ మొదటి పేజీ తరువాయి

ఆడపిల్ల ఎదురు చూస్తోందని.. అందుకే ఈ కొత్త చట్టం తీసుకొస్తున్నామని ఇటీవల అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏపీ దిశ చట్టంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఇండియన్ పీనల్ కోడ్‌లో అదనంగా 354(ఇ), 354 (ఎఫ్) సెక్షన్లను చేర్చే ముసాయిదా బిల్లులకు కూడా కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

**ఏపీ దిశ యాక్ట్–2019 ప్రకారం..**

- మహిళలపై అత్యాచారం లాంటి క్రూరమైన నేరాలకు పాల్పడితే ఉరిశిక్ష
- నిర్ధారించే ఆధారాలున్నప్పుడు (కన్‌క్లూజివ్ ఎవిడెన్స్) 21 రోజుల్లోనే తీర్పు
- వారం రోజుల్లో దర్యాప్తు.. 14 రోజుల్లో విచారణ పూర్తి
- ప్రస్తుతం ఉన్న 4 నెలల విచారణ సమయాన్ని 21 రోజులకు కుదింపు
- మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాకు ప్రత్యేక కోర్టులు
- అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు, సోషల్‌మీడియా ద్వారా మహిళలపై వేధింపులు, చిన్నారులపై లైంగిక దాడులు తదితర నేరాల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు

**ఇండియన్ పీనల్ కోడ్ 354(ఇ) ముసాయిదా బిల్లు**

- మెయిల్స్, సోషల్‌మీడియా, డిజిటల్ మీడియాల్లో మహిళల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే ఈ సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు.
- మొదటిసారి తప్పు చేస్తే రెండేళ్ల జైలు, రెండోసారి తప్పుచేస్తే నాలుగేళ్ల జైలుశిక్ష

**ఇండియన్ పీనల్ కోడ్ 354 (ఎఫ్) ముసాయిదా బిల్లు**

- పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడితే పదేళ్ల నుంచి నుంచి 14 ఏళ్ల వరకూ శిక్ష..
- నేరం తీవ్రతను బట్టి 14 ఏళ్ల నుంచి జీవిత ఖైదు
- పోక్సో చట్టం కింద ఇంతవరకూ 3 నుంచి 5 ఏళ్ల వరకూ జైలుశిక్ష

### దిశ చట్టం తీసుకురానుండటం శుభ పరిణామం
**దిశ తండ్రి శ్రీధర్‌రెడ్డి**

శంషాబాద్: ఏపీ ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకురానుండటం మంచి పరిణామమని దిశ తండ్రి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. తన బిడ్డకు జరిగిన అన్యాయం మరో ఆడబిడ్డకు జరగకుండా చట్టాన్ని చేయడం చాలా మంచిదని పేర్కొన్నారు. స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలకు సత్వర న్యాయం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించి బిల్లులు తీసుకురావడం శుభపరిణామమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కఠినమైన చట్టాలు అనివార్యమని చెప్పారు.

# 15వేల కోట్ల రుణాలకు ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

3వ టీఎంసీని ఎత్తిపోసే పనులను చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. రూ.11,806 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ పనులకు సంబంధించిన ఖర్చులను రెండేళ్ల పాటు బడ్జెట్‌లో కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకు 1.1 టీఎంసీని తరలించనున్నారు. లోకాయుక్త చైర్మన్, వైస్ చైర్మన్ల నియామకానికి సంబంధించిన అర్హతలను మార్చేందుకు తెలంగాణ లోకాయుక్త చట్టా న్ని అత్యవసరంగా సవరిస్తూ ఆర్డినెన్స్ తేవాలన్న ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. లోకాయుక్త చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జీని నియమించాలన్న నిబంధన స్థానంలో జిల్లా జడ్జిగా పనిచేసి రిటైరైన వారికి కూడా అవకాశం కల్పించేలా సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**పల్లె ప్రగతిలో విఫలమయ్యారు..: సీఎం**

30 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమమైన 'పల్లె ప్రగతి'పురోగతిపై సమావేశంలో చర్చకు వచ్చింది. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిన ఈ కార్యక్రమం స్ఫూర్తిని కొనసాగించడంలో అధికారులు విఫలమయ్యారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెప్రగతి కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శిని సీఎం ప్రశ్నించారు. ఎలాంటి అలసత్వం లేకుండా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశించారు. గతంలో 30 రోజుల కార్యక్రమం నిర్వహించినట్లుగా వచ్చే నెలలో 10 రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

# ఖర్చులు తగ్గిద్దాం..

- అన్ని శాఖలు స్వీయ నియంత్రణ పాటించాలి
- రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- కేబినెట్ భేటీలో ఆర్థిక స్థితిపై సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం నేపథ్యంలో శాఖల వారీగా ఖర్చులు తగ్గించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయానికి వచ్చింది. బుధవారం ప్రగతిభవన్‌లో సుమారు నాలుగున్నర గంటల పాటు కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు లోతుగా చర్చించినట్లు సమాచారం. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర ముఖ్య అధికారులతో జరిపిన భేటీలో చర్చించిన ఆర్థిక అంశాలను మరోసారి ఈ భేటీలో సీఎం ప్రస్తావించినట్లు తెలిసింది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.1.84 లక్షల కోట్లతో తొలుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి, ఆ తర్వాత రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రూ.1.46 లక్షల కోట్లకు కుదించిన విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. కేంద్ర పన్నుల వాటాతో పాటు ఇతరత్రా ఆదాయం తగ్గడం.. ప్రభుత్వ పథకాల అమలుపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 4 నెలల్లో ముగియనుండటంతో అత్యవసర పనులకు మినహా, ఇతరత్రా కేటాయింపులు చేయొద్దని సీఎం అధికారులకు సూచించారు. ఆర్థిక పరిస్థితి అనిశ్చిత స్థితిలో ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలకు నిధులు తగ్గించడంతో పాటు, శాఖల పరిధిలో ఖర్చు విషయంలో స్వీయ నియంత్రణ పాటించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం.

**కేంద్ర పన్నుల వాటాలో కోతతో ఇబ్బందులు**

'కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.19,719 కోట్లు రావాలి. గతేడాది రూ.18,560 కోట్లు వచ్చాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన 8 నెలల కాలంలో కేంద్రం నుంచి పన్నుల వాటా ద్వారా రూ.10,304 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రం వైఖరి చూస్తే పన్నుల వాటాలో రాబోయే రోజుల్లో మరింత కోత పడే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధులకు సంబంధించి రాష్ట్రం తరపున ఇప్పటికే పరిస్థితిని వివరించడంతో పాటు కేంద్రానికి లేఖ కూడా రాశాం. తాజాగా పార్లమెంటు వేదికగా టీఆర్‌ఎస్ ఎంపీలు జీఎస్టీ పన్నుల వాటా విడుదల చేయాలంటూ నిరసన కూడా తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించడంతో పాటు, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఒత్తిడి చేద్దాం. కేంద్రం నుంచి జీఎస్టీ నష్ట పరిహారం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.1,719 కోట్ల బకాయిలతో పాటు, ఐజీఎస్టీ ద్వారా తెలంగాణకు రూ.2,812 కోట్లు రావాల్సి ఉందని'సీఎం వెల్లడించినట్లు సమాచారం.

# ఎన్‌కౌంటర్‌పై రెండు నివేదికలు

- ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ముగిసిన ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణ
- సీల్డ్‌కవర్‌లో ప్రాథమిక నివేదిక.. త్వరలోనే తుదినివేదిక!
- బాధితులు, సాక్షులతో కలిపి 30 మంది వాంగ్మూలం నమోదు

**సాక్షి, హైదరాబాద్:** సంచలనం రేపిన ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ప్రాథమిక దర్యాప్తు పూర్తయింది. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం సభ్యులు ప్రాథమిక దర్యాప్తు నివేదిక కూడా సిద్ధం చేశారని సమాచారం. డిసెంబర్ 7న హైదరాబాద్ వచ్చిన ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు ఎన్‌కౌంటర్ జరిగిన చటాన్‌పల్లి బ్రిడ్జి పరిసరాలను సందర్శించారు. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో భద్రపరిచిన నిందితుల మృతదేహాలను, పోస్టుమార్టం రిపోర్టులనూ పరిశీలించారు. తిరుగుప్రయాణంలో తొండుపల్లి గేట్ వద్ద ఆగి.. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ (టీఎస్‌పీఏ)లో ఎన్‌కౌంటర్ మృతులు మహమ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు కుటుంబ సభ్యులను, దిశ తండ్రి, సోదరి నుంచి వివరాలు సేకరించారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులు, ప్రత్యక్ష సాక్షులతో పాటు, ఫోరెన్సిక్ నిపుణులు, రెవెన్యూ అధికారులు, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను ప్రశ్నించారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సై, కానిస్టేబుల్‌నూ విచారించారు. అందరి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. బుధవారం ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం చికిత్స పొందుతున్న ఇద్దరు పోలీసులను మరోసారి ప్రశ్నించింది.

**త్వరలోనే సమగ్ర నివేదిక!**

దిశ, నలుగురు నిందితుల కుటుంబ సభ్యులు, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 10 మంది పోలీసులు, పంచనామా చేసిన నలుగురు రెవెన్యూ అధికారులు, ఆర్డీవో, నలుగురు ఫోరెన్సిక్ సిబ్బంది సహా దాదాపు 30 మంది స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్లు సమాచారం. దీంతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారుల వద్ద నుంచి వివరాలు సేకరించారని తెలిసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన విచారణతో ప్రాథమిక నివేదికను సీల్డ్ కవర్‌లో ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్సీకి సమర్పిస్తారు. పూర్తి వివరాలతో త్వరలోనే సమగ్ర నివేదిక అందజేస్తారని సమాచారం. సుప్రీం కోర్టులోనూ ఈ ఘటనపై నివేదిక ప్రతిని సమర్పించే అవకాశాలున్నాయి. డీఎస్‌పీఏకు సంబంధించిన అందాల్సిన ఓ రిపోర్టును సైబరాబాద్ పోలీసులే ఎన్‌హెచ్‌ఆర్సీకి పంపుతారని సమాచారం. సాయంత్రం ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు ఢిల్లీకి వెళ్లిపోయారని పోలీసులు తెలిపారు.

**నేడు మృతదేహాల అప్పగింతపై స్పష్టత**

ఇక ‘దిశ’హత్యాచారం ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలు తమ కుమారుల మృతదేహాలు ఇవ్వాలని అధికారులను కోరుతున్నాయి. కోర్టు కేసుల నేపథ్యంలో మృతదేహాలను వారికి ఇంకా అప్పగించలేదు. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో భద్రపరిచిన మృతదేహాలను సోమవారం రాత్రి గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించిన విషయం తెలిసిందే. అయితే గురువారం హైకోర్టులో ఈ కేసులు విచారణకు రానున్న నేపథ్యంలో మృతదేహాల అప్పగింతపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

## ‘సమత’ హత్యాచార కేసులో ప్రత్యేక కోర్టు

**సాక్షి, హైదరాబాద్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో హత్యాచారానికి గురైన ‘సమత’కేసు విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తూ న్యాయ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి ఎ.సంతోష్‌రెడ్డి పేరిట జీవో జారీ అయింది. ఐదవ అదనపు సెషన్స్, ఆదిలాబాద్ జిల్లా న్యాయస్థానాన్ని ప్రత్యేక కోర్టుగా ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమత కేసులో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని ఈ నెల 9న ప్రభుత్వం హైకోర్టును కోరిన విషయం తెలిసిందే. ఈ అభ్యర్థనకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ ఆమోదం తెలిపారు. దీంతో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుంచి ఆమోద లేఖ అందిన వెంటనే ప్రత్యేక కోర్టు ఏర్పాటుపై న్యాయ శాఖ జీవో జారీ చేసింది. సమత కేసు విషయంలో ప్రత్యేక కోర్టు రోజువారీగా విచారణ జరిపి సత్వరమే తీర్పు చెప్పనుంది. కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పీఎస్ లింగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సమత అనే ఆదివాసీ యువతిని షేక్‌బాబు, షేక్ షాబుద్దీన్, షేక్ మక్లూ హత్యాచారం చేశారని కేసు నమోదైంది. దిశ హత్యాచార ఘటనపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది. అయితే ఆ నలుగురు నిందితులు చటాన్‌పల్లిలో ఎన్‌కౌంటర్ కావడంతో మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక కోర్టు ఏర్పాటు జరగలేదు. ఈ పరిస్థితుల్లో సమత ఘటనపై కూడా విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి రావడంతో స్పందించిన ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసింది.

**త్వరగా శిక్ష పడేలా చర్యలు: ఇంద్రకరణ్**

సమత కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కావడంతో రోజువారీ పద్ధతిలో విచారణ జరిపి నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని అటవీ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. దిశ ఘటన తర్వాత ప్రభుత్వం వేగంగా స్పందించిందని, సమత కేసులో కూ డా సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసిందని వెల్లడించారు.

## టీఆర్‌ఎస్సే ప్రధాన రాజకీయ శత్రువు

### బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో తమ ప్రధాన రాజకీయ శత్రువు టీఆర్‌ఎస్ పార్టీనేనని, టీఆర్‌ఎస్‌తో యుద్ధం నడుస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా చిట్‌చాట్ చేశారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోతోందని, కమ్యూనిస్టు పార్టీలు లేకుండా పోయాయని, బీజేపీ మాత్రమే ఎదుగుతోందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీ ఇంకా తగ్గిపోయిందన్నారు.రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఇక కోలుకునే పరిస్థితి లేదని, ఆ స్థానాన్ని బీజేపీ భర్తీ చేస్తుందన్నారు. దక్షిణాదిలో పాత రాజకీయాలు పోయి కొత్త రాజకీయాలు రాబోతున్నాయన్నారు. అందుకే సినీనటుడు రజనీకాంత్ కూడా రాజకీయాల్లో వస్తానని అంటున్నారన్నారు. కర్ణాటక , తెలంగాణల్లో బీజేపీ పని తీరులో తేడాలు ఉన్నాయన్నారు. వాటిని అవసరానుగుణంగా సరిదిద్దుకోవచ్చన్నారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం కావడానికి బీజేపీకి కావాల్సినవన్నీ ఉన్నాయన్నారు.

## ‘మద్యపాన నిషేధం కోరుతూ పోరాటం’



**సాక్షి, హైదరాబాద్ :** మహిళలపై అత్యాచారాలు, హత్యలకు ఉసిగొలుపుతున్న ప్రధాన కారణాల్లో ఒకటైన మద్యపానంపై నిషేధం కోసం తాము ముందడుగు వేస్తున్నట్లు మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డీకే అరుణ అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద బీజేపీ మహిళా సంకల్ప దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఒక్క రోజులోనే ఏదీ సాధ్యం కాదన్న విషయం తమకు తెలుసుననీ, పోరాటం చేస్తూ పోతే ఏదో ఒక రోజు పాలకుల్లో మార్పు వస్తుందన్నారు.తమ పోరాటం దశలవారీగా ఉంటుందన్నారు.బుధవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో ముచ్చటించారు. ఆంధ్రప్రదేశ్‌లో మద్యపాన నియంత్రణ కోసం అడుగులు పడ్డాయన్నారు. ప్రజలకు మంచి జరిగే పనులు ఎక్కడ చేసినా మంచిదేనన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచార, హత్య సంఘటనల్లో ప్రధానంగా మద్యపానం ఒక కీలకాంశమని,అది యువతను వ్యసనపరులుగా మార్చుతోందన్నారు. గురువారం ఉదయం దీక్ష ప్రారంభమై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పూర్తవుతుందన్నారు. ఇందులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఇతర నేతలు పాల్గొంటారన్నారు.

## వీఐటీలో అమెరికా వీసాలపై అవగాహన

**సాక్షి, హైదరాబాద్:** అమరావతిలోని వీఐటీలో బుధవారం యూఎస్ కాన్సులేట్ ఆధ్వర్యంలో వీసాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూఎస్ కాన్సులేట్ ఫ్రాడ్ ప్రివెన్షన్ మేనేజర్ డేవిడ్ జోసర్ మాట్లాడుతూ వీసా కోసం ప్రయత్నిస్తున్నప్పుడు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించవద్దన్నారు. విద్యార్థులు వీసాకు దరఖాస్తు చేసుకునే విధానం, ప్రొఫైల్ క్రియేషన్, పూర్తి ఆన్‌లైన్ అప్లికేషన్, ఫీజు చెల్లింపులు, షెడ్యూల్ అపాయింట్‌మెంట్ ఎలా పొందుపరుచుకోవాలనే వాటి గురించి వివరించారు. ఇంటర్వ్యూ పూర్తిచేసిన విద్యార్థులకు 60 రోజుల్లోపు అడ్మినిస్ట్రేటివ్ ప్రాసెస్ పూర్తి అవుతుందన్నారు. అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కన్సల్టెన్సీల మీద ఆధారపడకుండా యూఎస్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ను సంప్రదించాలని యూఎస్ కాన్సులేట్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ అసిస్టెంట్ సునీత సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీఎల్‌వీ శివకుమార్, పీఎస్ రమా శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యులందరికీ కేన్సర్‌పై శిక్షణ

### టాటా మెమోరియల్–అమ్నికృారిస్‌తో ఒప్పందం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కేన్సర్ మహమ్మారి విస్తరిస్తోంది. కానీ ఆ మేరకు కేన్సర్ నిర్ధారణ, చికిత్స చేసేందుకు అవసరమైన వైద్య సిబ్బంది రాష్ట్రంలో లేనేలేరు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి కేన్సర్ సోకుతుంటే, ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో కేవలం 100 మంది వరకు మాత్రమే ఆంకాలజిస్టులు ఉన్నారు. అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేవలం 20 మందిలోపే ఉంటారు. దీంతో కేన్సర్ గుర్తింపు, చికిత్స చేసే నాథుడే లేకుండా పోయారు. రాష్ట్రంలో ఎవరికైనా కేన్సర్ వస్తే హైదరాబాద్‌కు తరలిరావాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) మొదలు ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బోధనాస్పత్రుల వరకు అన్నిచోట్లా పనిచేసే ప్రభుత్వ వైద్యులకు కేన్సర్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు టాటా మెమోరియల్ ట్రస్టు, అమ్నికృారిస్ సంస్థలతో సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అమ్నికృారిస్ జాతీయస్థాయి ఇన్‌చార్జి డాక్టర్ గురుప్రసాద్ తిమ్మయ్య ఆధ్వర్యంలోని బృందం బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయింది. దీనిలో భాగంగా ప్రభుత్వ వైద్యులకు ఎలా శిక్షణ ఇవ్వాలన్న దానిపై ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావుతో వారు చర్చించారు. ఇప్పటికే 8 రాష్ట్రాల్లో ఆయా సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు.

## 38 కుటుంబాలకు కారుణ్య నియామక లబ్ధి

**సాక్షి, హైదరాబాద్:** సమ్మె కాలంలో చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు అమలు చేయటంలో అధికారులు రికార్డు సృష్టించారు. నిర్ణయం తీసుకున్న వారంలోనే అన్ని కుటుంబాలకు ఆ లబ్ధి కలిగించారు. సమ్మె కాలంలో 38 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయినట్టు అధికారులు గుర్తించారు. వారి ఇళ్లల్లో విద్యార్హత ఆధారంగా ఒకరికి సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దాన్ని కేవలం వారంలోనే అమలు చేయాలని పేర్కొన్నారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని వారంలో పూర్తి చేశారు.



## ఇంట్లో వేప.. పొలంలో చింత!

### ప్రతి మొక్కకు నేమ్ బోర్డు.. రిజిస్టర్

- 85 శాతం మొక్కలు బతక్కపోతే కార్యదర్శులపై వేటు
- సర్పంచ్‌లపైనా చర్యలు తప్పవు
- ఇంటి ముందు మొక్క ఎండితే యజమానికి జరిమానా
- మొక్కల పెంపకంపై పంచాయతీరాజ్‌శాఖ తాజా మార్గదర్శకాలు

**సాక్షి, హైదరాబాద్:** ప్రతి ఇంట్లో వేప.. ప్రతి పొలంలో చింత చెట్లను ఇకపై తప్పనిసరి చేస్తూ పంచాయతీరాజ్ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. మొక్కలు నాటడమే కాకుండా.. అవి ఎండిపోతే బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. గ్రామంలో నాటిన మొక్కల్లో 85 శాతం బతికేలా చూడటం పంచాయతీ కార్యదర్శి, మండల పంచాయతీ అధికారుల (ఎంపీవో) ప్రధాన విధి. ఈ విధి నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించినా.. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించింది. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో ఈ మేరకు నిబంధనలు పొందుపరిచిన ప్రభుత్వం.. తాజాగా అమలుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ పరిధిలో పచ్చదనంలో ఏ మాత్రం లోటు కనిపించినా.. పంచాయతీ పాలకవర్గంపై వేటు పడనుంది. సర్పంచ్, అధికారులకే పరిమితం చేయకుండా.. మొక్కల పెంపకంలో ప్రజలనూ భాగస్వామ్యం చేసింది. ఇందులో భాగంగా ఇంటిముందు నాటే మొక్క సంరక్షణ బాధ్యత ఆ ఇంటి యజమానిదే. ఒకవేళ మొక్క ఎండిపోతే సదరు యజమానికి జరిమానా విధించనుంది. ప్రతి మొక్కకు నేమ్ బోర్డు, పంచాయతీ స్థాయిలో ప్లాంటేషన్ రిజిస్టర్ నిర్వహించాలని స్పష్టం చేసింది. గ్రామ హరితహారానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం.. గ్రామాల్లో నర్సరీల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసింది. నర్సరీ మొదలు మొక్కల సంరక్షణ వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవచ్చని పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేసింది.

**మొక్కలు ఇక్కడ నాటాలి**

గ్రామాల్లో జీవవైవిధ్యాన్ని పెంపొందించాలని భావిస్తున్న ప్రభుత్వం.. విరివిగా మొక్కలను పెంచాలని నిర్ణయించింది. ఇంటి పరిసరాలు, గ్రామ ఆవాస రోడ్లు, గ్రామ మార్గాలు, బ్లాక్ ప్లాంటేషన్, రైతుల పొలం గట్లు, రైతుల పొలాలు, సంస్థలు, చెరువు శిఖం భూముల్లో మొక్కలు నాటాలని స్పష్టం చేసింది. ఇందుకు వివిధ వృక్ష జాతులను అభివృద్ధి చేస్తోంది. మునగ, ఉసిరి, చింత, వేప, జామ, బొప్పాయి, కానుగ, మామిడి, నల్ల తుమ్మ, తెల్లమద్ది, టేకు, బాదం, దానిమ్మ, రావి, నేరేడు, మేడి, యూకలిప్టస్, దేవ కాంచనం, సపోటా, కరివేపాకు, పారిజాతం తదితర మొక్కలను పంపిణీ చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తోంది.



## ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

**సాక్షి, హైదరాబాద్:** ఓపెన్ స్కూల్ సొసైటీ దూర విద్యా విధానంలో నిర్వహించే ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లో బుధవారం ఈ ఫలితాలను విద్యా శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. గత నెల 4 నుంచి 16వ తేదీ వరకు జరిగిన ఎస్సెస్సీ పరీక్షలకు 20,608 హాజరవ్వగా, 5,535 మంది (26.86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 14,729 మంది హాజరు కాగా 5,194 మంది (35.26 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, జవాబు పత్రాల జిరాక్స్ కాపీ కోసం ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఓపెన్ స్కూల్ సొసైటీ వెల్లడించింది. ఒక్కో పేపరు రీకౌంటింగ్‌కు రూ.100, ఒక్కో పేపరు రీవెరిఫికేషన్‌కు రూ.1000ని మీసేవ, ఏపీ ఆన్‌లైన్, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలంది.

## సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ

### దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం ప్రతిపాదన

**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ హత్యాచారం ఘటనలో నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్ ఎ.బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ప్రతిపాదించింది. బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఘటనపై దర్యాప్తు జరిపేలా ఆదేశించాలని, ఇదివరకే ఈ కోర్టు జారీచేసిన 16 మార్గదర్శకాలు అమలయ్యేలా చూడాలని న్యాయవాదులు జి.ఎస్.మణి, ప్రదీప్‌కుమార్ యాదవ్‌లు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం, ముకేశ్‌కుమార్ శర్మ దాఖలు చేసిన మరో ప్రజాహిత వ్యాజ్యం బుధవారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద విచారించాల్సిన కేసుల జాబితాలో నమోదయ్యాయి. అయితే మధ్యాహ్న భోజన సమయంలో ఈ పిటిషన్లను సంబంధిత న్యాయవాదులు ప్రస్తావించగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్ ఎ.బాబ్డే తొలుత స్పందిస్తూ.. ‘ఎన్‌కౌంటర్‌పై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు విచారణ జరుపుతున్న విషయం మాకు తెలుసు. ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించేందుకు ఈ పిటిషన్‌ను అనుమతిస్తున్నాం. రిటైర్డ్ న్యాయమూర్తి ఇక్కడి (ఢిల్లీ) నుంచే దర్యాప్తు ప్రక్రియ చేపడతారు. రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీవీ రెడ్డిని ఈ విషయమై సంప్రదించాం. అయితే ఆయన సుముఖత చూపలేదు. ఈ విధి నిర్వహణకు మరో రిటైర్డ్ న్యాయమూర్తిని సంప్రదిస్తాం...’ అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించే ప్రయత్నం చేశారు. ‘పీయూసీఎల్ కేసులో 2014లో ఈ కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉత్తర్వులు జారీ చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినాలి..’అని నివేదించారు. సలహాలు, సూచనలుంటే చెప్పొచ్చన్న ధర్మాసనం విచారణను గురువారానికి వాయిదావేసింది.



## ఆ పోలీసులపై 302 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్

### హైకోర్టులో పిల్ దాఖలు.. నేడు విచారణ

**సాక్షి, హైదరాబాద్:** ఆటవికంగా ‘దిశ’నిందితులు నలుగురిని ఎన్‌కౌంటర్ పేర హతమార్చారని, ఇందుకు బాధ్యులైన పోలీసులపై ఐపీసీలోని 302 సెక్షన్ కింద హత్యానేరం కేసులు నమోదు చేయాలని హైకోర్టులో మరో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. పీయూసీఎల్–మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోలీసులపై 302 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాలతో సంబంధం లేని ఇతర రాష్ట్రాల పోలీసులపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ రామశంకరనారాయణ మేల్కొటె, రిటైర్డు లెక్చరర్ ఎస్.జీవన్‌కుమార్ సంయుక్తంగా పిల్ దాఖలు చేశారు. దిశ ఘటన తర్వాత ఏర్పడిన భావోద్వేగాల నేపథ్యంలో తక్షణ న్యాయం పేరుతో పోలీసులు నలుగురు నిందితులను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో పోలీసులు వినియోగించిన ఆయుధాలపై బాలిస్టిక్ నిపుణులతో పరీక్షలు చేయించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, ఫోరెన్సిక్, పోస్టుమార్టం రిపోర్టులను భద్రం చేసేలా పోలీసులకు ఆదేశాలివ్వాలని, ఆ నివేదికల ప్రతులు తమకు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిల్‌లో కోరారు. అయితే ఇదే తరహాలో ఇప్పటికే దాఖలైన రెండు వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ ప్రారంభించింది. మంగళవారం మరో మూడు వ్యాజ్యాలు దాఖలు కావడంతో మొత్తం ఐదు వ్యాజ్యాలను గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది.




## హెల్త్ హబ్‌గా హైదరాబాద్..

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల



**లక్డీకాపూల్:** నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని అందించడంలో హైదరాబాద్ ముందంజలో ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు చెందిన రోగులు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని పొందేందుకు నగరానికి వస్తున్నారని చెప్పారు. బుధవారం సోమాజిగూడలో నిమ్స్ సర్జికల్ ఆంకాలజీ విభాగం మాజీ అధిపతి డా.జి.సూర్యనారాయణ రాజు ఏర్పాటు చేసిన అశ్విని స్పెషాలిటీ హాస్పటల్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ దేశంలోనే హెల్త్ హబ్‌గా విరాజిల్లుతోందన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నిమ్స్ ఆస్పత్రి హైదరాబాద్‌లో ఉండటం గర్వకారణమన్నారు. నిమ్స్ ద్వారా లక్షలాది మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అలాంటి ఆస్పత్రిలో సేవలందించిన డాక్టర్ జీఎస్‌ఎన్ రాజు కేన్సర్ రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్న గొప్ప ఆశయంతో అశ్విని స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు.



# ‘యంగ్వాన్’తో టెక్స్‌టైల్‌కు మహర్దశ

- కాకతీయ మెగా పార్కులో భారీగా పెట్టుబడులు
- కొరియా కంపెనీతో రాష్ట్రం రూ.900 కోట్ల ఒప్పందం
- 290 ఎకరాల భూ కేటాయింపు, 12 వేల మందికి ఉపాధి
- మంత్రి కేటీఆర్ సమక్షంలో యంగ్వాన్ తుది ఒప్పందం


యంగ్వాన్ కార్పొరేషన్ చైర్మన్ కిసాక్ సుంగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న టెక్స్‌టైల్ రంగంలో మరిన్ని పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా వరంగల్‌లో ఏర్పాటు చేసిన మెగా టెక్స్‌టైల్ పార్కులో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో టెక్స్‌టైల్ పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. దక్షిణ కొరియాకు చెందిన టెక్స్‌టైల్ దిగ్గజ కంపెనీ యంగ్వాన్ కార్పొరేషన్ రూ.900 కోట్లతో మెగా టెక్స్‌టైల్ పార్కులో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు బుధవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో తుది ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ‘గుజరాత్‌లో 2017లో జరిగిన టెక్స్‌టైల్ సమ్మిట్‌లో యంగ్వాన్ కార్పొరేషన్ చైర్మన్ కిసాక్ సుంగ్‌తో సమావేశమై, తెలంగాణ పారిశ్రామిక విధానాలు, టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించాం. రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు చైర్మన్ సుంగ్ సానుకూలత వ్యక్తం చేశారు. యంగ్వాన్ పెట్టుబడులతో వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ముఖ చిత్రం మారిపోవడంతో పాటు, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు దోహదం చేస్తుంది’అని అన్నారు. దేశంలో మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీపై కసరత్తు చేస్తోందని, ఈ పాలసీ అమల్లోకి వస్తే వరంగల్ టెక్స్‌టైల్ పార్కు దేశంలోనే అతిపెద్ద మెగా టెక్స్‌టైల్ పార్కుగా అవతరించడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వస్తాయని కేటీఆర్ వెల్లడించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీలకు స్థానికంగా పూర్తిస్థాయిలో సహకరిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

### 13 దేశాల్లో యంగ్వాన్ కార్యకలాపాలు

టెక్స్‌టైల్ రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థల్లో యంగ్వాన్ కార్పొరేషన్ ఒకటని, ప్రస్తుతం బంగ్లాదేశ్, వియత్నాం, ఇథియోపియా వంటి 13దేశాల్లో తమ యూనిట్ల ద్వారా కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సంస్థ చైర్మన్ కిసాక్ సుంగ్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థ ద్వారా 90వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటులో తమ పాత్ర కేవలం ఒక శాతం కాగా, తెలంగాణ ప్రభుత్వం 99 శాతం కృషి చేసిందన్నారు. ఏడాదిలోగా తమ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభించి, భవిష్యత్తులో యూనిట్‌ను విస్తరిస్తామన్నారు. కాగా రూ.900 కోట్ల పెట్టుబడికి సంబంధించి బుధవారం మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, భారత్, కొరియా రాయబారుల సమక్షంలో ఒప్పందం కుదరగా, 290 ఎకరాల భూ కేటాయింపు పత్రాలను యంగ్వాన్ కార్పొరేషన్ ప్రతినిధులు అందుకున్నారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు యంగ్వాన్ యూనిట్ మూల స్తంభంగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. స్థానికంగా లభించే నాణ్యమైన పత్తిని ఉపయోగించుకుని ఎగుమతులు లక్ష్యంగా వివిధ రకాల టెక్స్‌టైల్ ఉత్పత్తులను యంగ్వాన్ యూనిట్ తయారు చేస్తుంది. ఈ యూనిట్ ద్వారా సుమారు 12వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. బుధవారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, కొరియాలో భారత రాయబారి సుప్రియ రంగనాథ్, గౌరవ కాన్సుల్ జనరల్ ఆఫ్ కొరియా ఇన్ హైదరాబాద్ సురేష్ చుక్కపల్లి, టెక్స్‌టైల్ శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులపై కొరియా బృందం ఆరా

**సాక్షి, వరంగల్ రూరల్:** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని బుధవారం దక్షిణ కొరియా కంపెనీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన ఏడుగురు ప్రతినిధుల బృందం.. తమ కంపెనీకి కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనుల గురించి టీఎస్ఐఐసీ అధికారులను అడిగి తెలుసుకుంది. గతంలో పార్కును సందర్శించిన యంగ్వాన్ కార్పొరేషన్ చైర్మన్ కిసాక్‌సుంగ్‌తో పాటు కొరియాలో భారత రాయబారి సుప్రియ రంగనాథ్, కంపెనీ ప్రతినిధులు పీటర్‌హూర్, జెమ్స్ బే, టాంగ్రీయంగ్ చియో, జియోన్‌లీ, ఎండీ శాహ జహాన్, దిలీప్‌కుమార్ పార్కు ప్రదేశాన్ని సందర్శించారు. వస్త్ర పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన నీటి లభ్యత, మౌలిక వసతుల కల్పన విషయంలో అధికారులతో చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఏడాది పొడవునా లభ్యం అవుతాయని, నీటి విషయంలో ఇబ్బందులు లేవని కొరియా బృందానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ హరిత వివరించారు. అధికారులు ఇచ్చిన వివరణపై కొరియా బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

## క్లుప్తంగా...

### ముస్లింలైతే పౌరసత్వం ఇవ్వకపోవడం సరికాదు

**పౌరసత్వ సవరణ బిల్లుపై కేకే**



**సాక్షి, న్యూఢిల్లీ:** వేధింపులకు గురై బాధితులుగా వచ్చిన శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడం సముచితమేనని, అయితే శరణార్థులు ముస్లింలైతే పౌరసత్వం నిరాకరించడం అన్యాయమని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం రాజ్యసభలో పౌరసత్వ (సవరణ) బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ‘శరణార్థులకు స్వాగతం పలకండి. సాయం చేయండి. దీనిపై ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మతం ప్రాతిపదికన వారిని విభజించడం సరికాదు. పాకిస్తాన్‌లో అహ్మదీయులు ఉన్నారు. మయన్మార్‌లో రోహింగ్యాలు ఉన్నారు. శ్రీలంకలో తమిళులు ఉన్నారు. ఇలాంటప్పుడు మత ప్రాతిపదిక సరికాదు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలి’అని పేర్కొన్నారు.

### రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు

**పార్లమెంటులో టీఆర్ఎస్ ధర్నాపై బీజేపీ ఎంపీల ధ్వజం**

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసిన పరిస్థితికి తీసుకొచ్చిన టీఆర్ఎస్ ఇప్పుడు కొత్తగా కేంద్రం నిధులివ్వడం లేదంటూ ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తోందని బీజేపీ ఎంపీలు విమర్శించారు. కేంద్రం నిధులు విడుదల చేయాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు బుధవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద చేసిన ధర్నాను ఉద్దేశించి బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్, సోయం బాపూరావు ఒక ప్రకటన విడుదల చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ నిర్వహణలో అవకతవకలు, భారీ అవినీతి, దుబారా ఖర్చులు, ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళానికి ప్రధాన కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెల్లించాల్సినవి సున్నా బకాయిలని, తెలంగాణకు చెందిన ప్రతి రూపాయిని కేంద్రం నిర్ణీత ప్రక్రియలో షెడ్యూల్ ప్రకారం బదిలీ చేస్తోందన్నారు. ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై నీతి ఆయోగ్ నిర్ణయం తీసుకోదని, అది ఇచ్చే అనధికారిక సిఫార్సులతో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు జరగవన్నారు. గత ఆరేళ్లలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, వాటి ఖర్చులపై సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

### 13న పల్లా బాధ్యతల స్వీకరణ




**సాక్షి, హైదరాబాద్:** రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ నెల 13న బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రశాసన్ నగర్‌లోని రైతు సమన్వయ సమితి కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. బాధ్యతల స్వీకరణ అనంతరం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులతో ఆయన భేటీ అవుతారు. రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నియమితులైన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కేబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

### పార్టీ కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు

**సాక్షి, హైదరాబాద్:** వివిధ ప్రమాదాల్లో మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గురువారం బీమా పరిహారం చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు తెలంగాణ భవన్‌లో బీమా పరిహారం చెక్కులు అందజేసిన తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కూడా ప్రారంభిస్తారు. ఈ ఏడాది నవంబర్‌లో 77 మంది పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున కేటీఆర్ బీమా పరిహారం అందజేయగా, ఇప్పటి వరకు పార్టీ పరంగా 1,581 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.31.62 కోట్ల బీమా పరిహారం చెల్లించినట్లు పార్టీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

### జీఎస్టీ బకాయిలు విడుదల చేయాలి: మాజీ ఎంపీ కవిత



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు, వెనుకబడిన జిల్లాలకు అభివృద్ధి నిధులు, కేంద్రం నుంచి రావాల్సిన ఇతరత్రా నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసిన టీఆర్ఎస్ ఎంపీలకు మద్దతుగా ఆమె ట్విట్టర్‌లో స్పందించారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య జరగాల్సిన సాధారణ లావాదేవీలపై పార్లమెంటులో ఎంపీలు నిరసన వ్యక్తం చేయాల్సి రావడం విచారకరమని వ్యాఖ్యానించారు. సహకార సమాఖ్యవాదం కేవలం నినాదంగా ఉండకూడదని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, జీఎస్టీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

## 14న ఏఐపీఎస్‌వో మహాసభలు

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 14న ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో) ద్వితీయ మహాసభలు జరగనున్నాయి. ఈ సభల్లో ప్రపంచ శాంతి, పర్యావరణం, మానవ హక్కులు, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ తదితర అంశాలపై చర్చించనున్నట్టు సంఘం నేతలు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, జి.రఘుపాల్, తిప్పర్తి యాదయ్య, ఒబేదుల్లా కొత్వాల్, రామచంద్రారెడ్డి, కేవీఎల్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సభలను సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లబ్‌సేన్ గుప్తా ప్రారంభిస్తారని, జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి, సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న, అరుణోదయ విమలక్క తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## ఆర్టీసీ గల్లాపెట్టె గలగల

**చార్జీల పెంపుతో వారం రోజుల్లో రూ.12 కోట్ల ఆదాయం**

**సాక్షి, హైదరాబాద్:** చార్జీల పెంపు ఆర్టీసీకి బాగానే కలిసి వస్తోంది. కిలోమీటరుకు 20 పైసలు చొప్పున పెంచుతూ కొత్త చార్జీలను అమలులోకి తెచ్చిన వారం రోజుల్లోనే దాదాపు రూ.12 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరింది. మంగళవారానికి కొత్త చార్జీలు అమలులోకి వచ్చి వారమైంది. వాస్తవానికి ఈ మొత్తం ఇంకా ఎక్కువగా ఉండాల్సి ఉంది. కానీ, చార్జీల పెంపు జరిగిన ప్రతిసారీ ప్రయాణికుల సంఖ్య కొంత పడిపోవటం సహజం. సమ్మె కాలంలో ప్రత్యామ్నాయ రవాణాపై దృష్టి సారించిన ప్రయాణికులు.. నెల రోజుల్లో మళ్లీ ఆర్టీసీ వైపు తిరిగిరావడం సహజంగా జరుగుతుందనేది అధికారుల మాట. నెల రోజులు గడిస్తే ఈ పెరుగుదల మరింత మెరుగ్గా ఉంటుందని పేర్కొంటున్నారు. నగరంలో మాత్రం పెంపు ఫలితం అనూహ్యంగా ఉంది. 22 శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేయగా,అది 25 శాతాన్ని మించుతోంది. రాష్ట్రం మొత్తంగా చూస్తే అది 15 శాతంగా నమోదవుతోంది. నెల తర్వాత సగటు 22 శాతానికి పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో ప్రధాన డిపోలకు మాత్రం రోజువారీ అదనపు ఆదాయం ఏకంగా రూ.4 లక్షల వరకు సమకూరుతోంది. చిన్న డిపోల్లో అది రూ.2 లక్షలుగా ఉంది. ఆర్టీసీ సగటు రోజువారి ఆదాయం రూ.10.20 కోట్లుగా ఉంటుంది. గత వారం రోజుల సగటు రూ.11.70 కోట్లుగా నమోదైంది. దీనిపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చార్జీల పెంపు వల్ల అదనంగా నమోదయ్యే వాస్తవ ఆదాయం లెక్క తేలాలంటే నెలరోజులు వేచి చూడాల్సిందే.

## సీఎం పర్యవేక్షణలో ఆర్టీసీ..

- క్రమం తప్పకుండా సమీక్షలకు సిద్ధం
- ఆత్మీయ సమావేశ హామీలపై ఇప్పటికే ఓ దఫా భేటీ
- నాలుగైదు రోజుల్లో మళ్లీ సమావేశం



**సాక్షి, హైదరాబాద్:** సమ్మె నేపథ్యంలో తీవ్ర గందరగోళంలో పడి చివరకు మనుగడ దిశగా అడుగులేస్తున్న ఆర్టీసీ ఇక స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యవేక్షణలోనే ముందుకు సాగబోతోంది. ఇక నుంచి క్రమం తప్పకుండా సీఎం ఆర్టీసీని సమీక్షించబోతున్నారు. ఇటీవల ప్రగతి భవన్‌లో కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఆర్టీసీపై వరాల జల్లు కురిపించిన విషయం తెలిసిందే. ఆర్టీసీ మనుగడే వీటితో ముడిపడి ఉండటంతో సీఎం హామీల అమలు ప్రధానంగా మారింది. వీటి అమలుపై ముఖ్యమంత్రి ఇప్పటికే ఓ పర్యాయం అధికారులతో సమావేశమై వాకబు చేశారు. మరో వారం, పది రోజుల్లో మరోసారి సమీక్షిస్తానని వారితో పేర్కొన్నారు. వాటి అమలుతో సరిపెట్టకుండా ఆర్టీసీ పురోగతికి సంబంధించి క్రమం తప్పకుండా సమీక్షించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.

**టికెట్ చార్జీల పెంపుతో..**

కిలోమీటరుకు 20 పైసలు చొప్పున ఆర్టీసీ టికెట్ చార్జీలను పెంచడంతో సంస్థ ఆదాయం గణనీయంగా పెరగబోతోంది. దీని ద్వారా దాదాపు 22 శాతం మేర ఆదాయం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు సరుకు రవాణాను కూడా ప్రారంభిస్తున్నందున ఆ రూపంలో కూడా ఆదాయం భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఆర్టీసీ నష్టాలు తగ్గి పరిస్థితి మెరుగుపడాల్సి ఉంది. ఇవన్నీ సరిగ్గా జరగాలంటే పర్యవేక్షణ చాలా అవసరమని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రతినెలా ఓ పర్యాయం ఆర్టీసీ అధికారులతో సమీక్ష జరపాలని ఆయన భావిస్తున్నారు. ఆ తర్వాత దాన్ని రెండు మూడు నెలలకోమారుకు మార్చనున్నారు. దీంతో అధికారులు సీఎం ఆదేశాలను పాటిస్తూ వాటి అమలుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

**డిపోల స్థాయిలో సంక్షేమ మండళ్లు..**

డిపోకు ఇద్దరు చొప్పున ఉద్యోగులతో (కార్మికులు) సంక్షేమ మండళ్లను ఏర్పాటు చేయాలని సీఎం ఆత్మీయ సమావేశంలో ఆదేశించిన నేపథ్యంలో వాటిని అధికారులు సిద్ధం చేశారు. ఐదారు రోజుల క్రితమే డిపోల వారీగా సభ్యుల వివరాలను డీఎంలు అందజేశారు. అన్ని డిపోలు, వర్క్‌షాపులు కలిపి దాదాపు 200 మంది పేర్లను అధికారులకు పంపారు. వీటిల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ.. ఇలా అన్ని వర్గాల వారి ప్రాతినిధ్యం ఉండేలా చూస్తున్నారు. ఏ వర్గం సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నా జత చేసేందుకు వీలుగా ప్రత్యామ్నాయ పేర్లను కూడా అందుబాటులో ఉంచారు. వీటి అమలుకు సంబంధించి ఆర్టీసీ ఉత్తర్వు జారీ చేసిన వెంటనే ఇవి అమల్లోకి రానున్నాయి. అలాగే కండక్టర్ల ఉద్యోగ భద్రకు సంబంధించి కూడా కొత్తగా చర్యలు అమలు ప్రారంభించారు. ప్రయాణికులు టికెట్ తీసుకోకుంటే కండక్టర్లను బాధ్యులను చేసి శాఖాపరమైన చర్యలు తీసుకునే తీరును మార్చనున్నారు. ఇందులో ప్రయాణికుల పెనాల్టీలు పెంచడం ద్వారా ప్రయాణికుల్లో భయం కలిగించి వారిలో మార్పు తేవాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**చెర్రీ రంగు కాకుండా..**

మహిళా కండక్టర్ల యూనిఫామ్ విషయంలో త్వరలో తుది నిర్ణయం తీసుకోబోతున్నారు. ఇప్పటికే తమకు చెర్రీ పండు ఎరుపు రంగులో ఆప్రాన్ కావాలని కండక్టర్లు కోరారు. ఆ రంగు బెదురుగా ఉండటంతోపాటు మిగతా రంగులతో పోలిస్తే ఆ రంగు వస్త్రం కావాల్సిన సమయంలో విస్తృతంగా లభించదన్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ రంగును అధికారులు సూచిస్తున్నారు. మాపునకు కూడా ఆ రంగు ఆగదని అధికారులు చెబుతున్నారు. మరో రెండు రోజుల్లో ఖరారు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తుండటంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.

## గ‘ఘన’ విజయ వీచిక

### విజయవంతంగా పీఎస్‌ఎల్‌వీ సీ–48ను ప్రయోగించిన ఇస్రో

**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తన విజయ విహారాన్ని కొనసాగిస్తూ శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి 75 ప్రయోగాలను పూర్తి చేసింది. బుధవారం ప్రయోగించిన పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ) సీ–48 ప్రయోగంతో ప్లాటినం జూబ్లీ రికార్డుని నమోదు చేయగా.. మరోవైపు పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో అర్ధ సెంచరీని పూర్తి చేసింది. బుధవారం సాయంత్రం 3.25 గంటలకు ఇస్రో తన కదనాశ్వం పీఎస్‌ఎల్‌వీ సీ–48 రాకెట్ ద్వారా 628 కిలోల రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ (రీశాట్–2బీఆర్1) శాటిలైట్‌తోపాటు అమెరికాకు చెందిన మరో 6 ఉపగ్రహాలు, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్‌కు చెందిన మూడు ఉపగ్రహాలను 21.19 నిమిషాల్లో భూమికి 576 కిలో మీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది.

**ప్రయోగం సాగిందిలా..**

- పీఎస్‌ఎల్‌వీ సీ–48 రాకెట్ ప్రయోగాన్ని 4 దశల్లో 21.19 నిమిషాల్లో పూర్తి చేశారు.
- సాయంత్రం 3.25 గంటలకు 44.4 మీటర్ల పొడవు గల పీఎస్‌ఎల్‌వీ–సీ48 ఉపగ్రహ వాహక నౌక 628 కిలోల బరువైన 10 ఉపగ్రహాలను విజయవంతంగా రోదసీలోకి మోసుకెళ్లింది.
- 44.4 మీటర్ల ఎత్తున్న పీఎస్‌ఎల్‌వీ సీ–48 రాకెట్‌ను నాలుగు స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో నాలుగు దశల్లో ప్రయోగించారు.
- ప్రయోగ సమయంలో 291 టన్నుల బరువును మోసుకుంటూ రాకెట్ భూమి నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగికి పయనమైంది.
- మొదటి దశలోని నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో 48 టన్నుల ఘన ఇంధనంతోపాటు కోర్ అలోన్ దశలో మరో 139 టన్నుల ఘన ఇందనాన్ని మండించుకుంటూ రాకెట్ భూమి నుంచి నింగి వైపు దూసుకెళ్లింది.
- రెండో దశలో 41 టన్నుల ద్రవ ఇందనం, మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనం, నాలుగో దశలో 1.6 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి ఈ ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- ప్రయోగం ప్రారంభమైన 111 సెకన్లకు మొదటి దశను విజయవంతంగా పూర్తి చేశారు.
- ఆ తరువాత 263 సెకన్లకు 2వ దశ, 599 సెకన్లకు 3వ దశ, 924 సెకన్లకు నాలుగో దశను కటాఫ్ చేశారు. 16.26 నిమిషాలకు నాలుగో దశ నుంచి రీశాట్–2బీఆర్1 ఉపగ్రహాన్ని భూమికి 576 కిలోమీటర్ల ఎత్తులోని వృత్తాకార సూర్యానువర్తన ధ్రువ కక్ష్య (సన్ సింక్రనస్ ఆర్బిట్)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- ఒక నిమిషం తరువాత 17.26 నిమిషాలకు అమెరికాకు చెందిన ఆరు ఉపగ్రహాలు, 1,278 సెకన్లకు జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్‌కు చెందిన మూడు ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- జపాన్‌కు చెందిన క్యూపీఎస్–సార్, ఇటలీకి చెందిన టైవాక్–0092, ఇజ్రాయెల్‌కు చెందిన డచీఫాట్–3 అనే మూడు ఉపగ్రహాలను వాహక నౌక బయలుదేరిన 21.19 నిమిషాల్లో విజయవంతంగా ప్రవేశపెట్టి 75వ సారి విజయం సాధించారు.

### ప్రత్యేకతలివీ..

- దేశీయ అవసరాలకు అవసరమైన అన్ని పరిశోధనలు చేసేందుకు రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం (రీశాట్) దోహదపడుతుంది.
- సరిహద్దులో జరిగే చొరబాట్లును పసిగడుతుంది.
- ఇప్పటికే రెండు ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో తాజాగా మూడో ఉపగ్రహమైన రీశాట్–2బీఆర్1 ఉపగ్రహాన్ని రక్షణ రంగ అమ్ముల పొదిలో చేర్చింది.
- వీటిలో అమర్చిన పేలోడ్స్ భూమి మీద 20 నుంచి 30 సెంటీమీటర్ల వ్యాసార్థంలో ఉండే ఏ వస్తువునైనా ఫొటోలు తీసేవి. తాజా ఉపగ్రహంలో అమర్చిన ఎక్స్‌బాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ భూమి మీద జరిగే మార్పులను పసిగడుతుంది.
- భూమి మీద 10 సెంటీమీటర్ల వ్యాసార్థంలో ఉండే ఎలాంటి చిన్న వస్తువునైనా సరే రాత్రి, పగలు అనే తేడా లేకుండా అత్యంత నాణ్యమైన చిత్రాలు తీసి పంపించే సామర్థ్యం కలిగి ఉంది.
- ముఖ్యంగా దేశ సరిహద్దులో అక్రమ చొరబాట్లు, పంటల విస్తీర్ణం, సాగు విస్తీర్ణం, అడవులను పరిశోధించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయాల్లోనూ అత్యంత నాణ్యమైన ఫొటోలు తీసి పంపిస్తుంది.

### ఎందరో మహానుభావుల కృషి ఫలితమిది

**ఇస్రో చైర్మన్ శివన్**

పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో వరుస విజయాలకు నాటి శాస్త్రవేత్తలు వేసిన బీజాలే కారణమని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ అన్నారు. పీఎస్‌ఎల్‌వీ సీ–48 ప్రయోగం సూపర్ సక్సెస్ కావడంతో ఆయన మిషన్ కంట్రోల్ రూమ్ నుంచి మాట్లాడారు. ఎందరో మహాను భావుల కృషికి ఫలితమిది అని వ్యాఖ్యానిం చారు. తొలుత విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో ముద్రించిన ‘గోల్డెన్ జూబ్లీ అఫ్ పీఎస్‌ఎల్‌వీ’ పుస్తకాన్ని శివన్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బుధవారం నాటి ప్రయోగంతో షార్ కేంద్రంగా 75 ప్రయోగాలు చేసి ప్లాటినమ్ గోల్డెన్ జూబ్లీ ఇయర్‌గా, 50 పీఎస్‌ఎల్‌వీ ప్రయోగాలు పూర్తి కావడంతో గోల్డెన జూబ్లీ ఇయర్‌గా 2019 ఇస్రో చరిత్రలో నిలిచిపోయిం దన్నారు. 27 ఏళ్ల సుదీర్ఘ కాలంలో 50 ప్రయోగాలు చేశామని, రాబోయే ఐదేళ్లలో 50 ప్రయోగాలు చేయనున్నామని చెప్పారు.

**ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
దిగువ తెలిపిన పనుల కోసం ది ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ A.P. లిమిటెడ్ ఆన్‌లైన్ బిడ్లు కోరుతోంది: క్ర.సం.:1, స్పెసిఫికేషన్ నం. APT-e-23/2019, పనిపేరు: సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. టర్న్‌కీ ప్రాతిపదికపై పశ్చిమ గోదావరి జిల్లా 132 KV సబ్‌స్టేషన్ టీ నరసాపురం స్థాపన. ఇప్పటికే ఉన్న 220/132 KV కామవరపుకోట–అశ్వారావుపేట (15KM) లైన్ మరియు 132KV కామవరపుకోట–అశ్వారావుపేట (16KM) లైన్‌ను 132 KV టి నరసాపురం వరకు పొడిగించి స్థాపన మరియు 132/33 KV టీ నరసాపురం పని ప్రారంభ దినము నుండి రెండు సంవత్సరములు పనిచేయించుట. ఇ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు లభించు తేది మరియు సమయం: 11.12.2019న సా. 5.00 గం. గమనిక: i) టెండర్లు కోరే అధికారి పేరు మరియు చిరునామా–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/కన్‌స్ట్రక్షన్. ii) కాంట్రాక్టర్లు/సంస్థలను PDF ఫార్మాట్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. iii) తదుపరి వివరాలను @ http://www.apeprocurement.gov.in లో చూడవచ్చును. ఫోన్/ఫ్యాక్స్ నం.: 0866-2429231.
R.O.No. 38/19 సం/– ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కన్‌స్ట్రక్షన్

**తెలంగాణ ప్రభుత్వం**
**జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా**
**ప్రకటన**
Rc.No.201/E1/DMHO/2019 తేది:10.12.2019
రంగారెడ్డి జిల్లాలో NHM ప్రోగ్రామ్ క్రింద RBSK మొబైల్ హెల్త్ టీమ్స్ క్రింద మెడికల్ ఆఫీసర్స్ ఉద్యోగాలు 12.12.2019 నుండి 18.12.2019 వరకు RBSK మొబైల్ టీమ్స్, హోదా మెడికల్ ఆఫీసర్స్ (MBBS) ఉద్యోగాలు (8) (పురుషులు–4, స్త్రీలు–4) (1) సంవత్సర కాలానికి పనిచేయుటకు కన్సాలిడేటెడ్ పేతో కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరబడుచున్నవి మరియు వారి సంతృప్తికరమైన సేవలకు లోబడి అవి పొడిగించబడవచ్చును. రెమ్యూనరేషన్: రూ.40,000/–. అర్హత గల అభ్యర్థులందరు తమ దరఖాస్తులను బయోడేటా మరియు స్వయం ధ్రువీకృత జిరాక్స్ కాపీలతో సహా స్వయంగా లేదా పోస్ట్ ద్వారా దిగువ సంతకందారుకు 18.12.2019న లేదా ఆలోగా సా.5.00 గం. వరకు దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు. గడువు తేది తరువాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు. ప్రకటనతో సహా దరఖాస్తు ఫారం మరియు నియమ నిబంధనల వివరాలను వెబ్‌సైట్ www.rangareddy.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. సం/– జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, రంగారెడ్డి జిల్లా
DIPR RO No. 1937-DP/CL/Advt/1/2019-20, Dt:11-12-19

**THE TELANGANA STATE DAIRY DEVELOPMENT COOPERATIVE FEDERATION LIMITED**
Lalapet, Hyderabad - 500017
Website: tsdairy.telangana.gov.in
Tender Notice No.27,28,33&34/EE©/TSDDCFL/2019 Date:11-12-2019
The tenders are invited for the following works, 1. Construction of transformer yard at Luxettipet in Mancherial District for estimate value of Rs.2,12,411.00 (2nd Call) schedule closed on 23-12-2019 by 5.00PM 2. S,I,T,C of equipment of ETP at Nirmal District schedule closed on 23-12-2019 by 5.00PM 3. Renovation of 4th floor Head Office, Hyderabad for the tender value of Rs.732775.00 schedule closed on 27-12-2019 by 5.00PM. 4. Renovation of works for CIP section in MPF, Hyderabad for the tender value of Rs.830134.00 schedule closed on 27-12-2019 by 5.00PM. Further detail visit https://tender.telangana.gov.in and further enquiry contact EE© in HO Ph: 9391841211 during the office hours.
Sd/- EXECUTIVE ENGINEER (CIVIL)

**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
(A Government Company)
Regd. Office: Kothagudem Collieries - 507 101
**e-Procurement TENDER NOTICE**
Tender has been published for the following work through e-procurement platform. For details, please visit
https://tender.telangana.gov.in - or - http://www.scclmines.com/civil.asp
Tender Notice No. - Name of the work - ECV - Last date & time for Submission of bid(s)
YLD/CVL/e - T - 36/2019-20 - Dismantling & erection of 60 T Lorry Weigh Bridge (excluding transportation) and providing foundation pedestals, Weigh Cabin & CC approaches at CHP, Old area, Yellandu - Rs.25,50,653/- up to 4.30 PM on 18.12.2019.
PR/2019-20/CVL/LWA/90 GM, YLD

ప్రాంతీయ కార్యాలయం: తెలంగాణ
కార్మిక రాజ్య బీమా సంస్థ
హిల్ ఫోర్ట్ రోడ్, ఆదర్శ నగర్, హైదరాబాద్ -500063
సర్టిఫైడ్ ఆఫీస్
ఫోన్: 040-23232356,7,8 ఫ్యాక్స్:040-23235048
**అద్దెపై వసతి కావలెను**
ప్రాంతీయ కార్యాలయం, ESI కార్పొరేషన్, తెలంగాణ వారు తెలంగాణ లోని దిగువ తెలిపిన టౌన్స్/ ప్రదేశంలో **“డిస్పెన్సరీ కమ్ బ్రాంచ్ ఆఫీస్”** ఏర్పాటు చేయుట కోసం ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో సుమారుగా 2500 చ.అ. (కార్పెట్ ఏరియా) విస్తీర్ణం గల ప్రెమిసెస్‌ను అద్దెకు తీసుకొనుటకు ఆసక్తి కలిగి ఉన్నారు.
1) భద్రాచలం టౌన్ 2) నిర్మల్ టౌన్ 3) కల్లకల్ టౌన్ 4) తాండూర్ టౌన్ 5) ఖమ్మం టౌన్ 6) నాగర్ కర్నూల్ టౌన్ 7) జహీరాబాద్ టౌన్ 8) బాలానగర్, హైదరాబాద్. (బ్రాంచ్ ఆఫీస్ కోసం 1500 చ.అ.)
అవసరమైన ప్రెమిసెస్ వివరాలు మరియు టెక్నికల్ మరియు ఫైనాన్షియల్ బిడ్ కోసం ఫార్మెట్స్‌ను వెబ్‌సైట్ www.esic.nic.in నుండి “టెండర్స్” లింక్ క్రింద డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
ఆసక్తిగల పార్టీలు తమ బిడ్లను రెండు విడి ఎన్వలప్‌లలో కవరుపై “టెక్నికల్ బిడ్” అండ్ “ ఫైనాన్షియల్ బిడ్” అని తగు విధంగా వ్రాసి దాఖలు చేయవలెను. ఈ రెండు బిడ్లనూ సింగిల్ కవరులో ఉంచి, కవర్‌పైన “ఆఫర్ ఆఫ్ ప్రెమిసెస్ ఫర్ డిస్పెన్సరీ కమ్ బ్రాంచ్ ఆఫీస్ ఎట్ ___________ ” (నేమ్ ఆఫ్ ది టౌన్) వ్రాయాలి. సీల్డ్ కవరును “ది రీజినల్ డైరెక్టర్, జనరల్ బ్రాంచ్, ESI కార్పొరేషన్, 5–9–23, హిల్ ఫోర్ట్ రోడ్, ఆదర్శనగర్–హైదరాబాద్–500063 వారికి **27.12.2019న లేదా ఆలోగా మ.3.00 వరకు** పంపవలెను.
**అడిషనల్ కమిషనర్ & రీజినల్ డైరెక్టర్**

# పౌరసత్వ బిల్లుకు పార్లమెంట్ ఓకే

## రాజ్యసభలో 125-99 ఓట్లతో గట్టెక్కిన బిల్లు

- త్వరలో రాష్ట్రపతి ఆమోదంతో చట్టరూపం
- ముస్లింలకు వ్యతిరేకం కాదన్న అమిత్ షా
- ఇది న్యాయ సమీక్షకు నిలవదన్న కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** మరో వివాదాస్పద బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం, ఆ స్థాయిలో విమర్శలు, నిరసనలు ఎదుర్కొన్న పౌరసత్వ (సవరణ) బిల్లు బుధవారం రాజ్యసభ అడ్డంకిని విజయవంతంగా అధిగమించింది. సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 125, వ్యతిరేకంగా 99 ఓట్లు వచ్చినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. ఈ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని భారత్‌కు శరణార్థులుగా వచ్చిన హిందూ, క్రిస్టియన్, పార్శీ, జైన్, బౌద్ధ, సిఖ్ మతస్తులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లుపై రాజ్యసభలో దాదాపు ఆరున్నర గంటల పాటు వాడి వేడి చర్చ జరిగింది. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమని విపక్షాలు తూర్పారబట్టాయి. బిల్లును ప్రవేశపెడ్తూ, ఆ తరువాత చర్చకు సమాధానమిస్తూ హోంమంత్రి అమిత్ షా బిల్లుపై నెలకొన్న భయాందోళనలను, అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. ఈ బిల్లు గురించి భారతీయ ముస్లింలు భయపడాల్సిన అవసరం లేదని, వారు భారతీయ పౌరులుగా కొనసాగుతారని, ఈ బిల్లుతో వారికి ఏ సంబంధమూ లేదని వివరణ ఇచ్చారు.

**సునాయాసంగానే:** రాజ్యసభలో బీజేపీకి మెజారిటీ లేని పరిస్థితుల్లో.. ఈ బిల్లు ఆమోదం పొందడంపై కొంత ఉత్కంఠ నెలకొంది. మిత్రపక్షాలు జేడీయూ, శిరోమణి అకాలీదళ్‌తో పాటు అన్నాడీఎంకే, బీజేడీ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ బిల్లుకు మద్దతివ్వడంతో మెజారిటీ ఓట్లు సాధించింది. అంతకుముందు, బిల్లును సమగ్ర అధ్యయనం కోసం సెలెక్ట్ కమిటీకి పంపించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దీనిపై ఓటింగ్ జరగ్గా, ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా 124 ఓట్లు, అనుకూలంగా 99 ఓట్లు వచ్చాయి. విపక్ష సభ్యులు ప్రతిపాదించిన పలు ఇతర సవరణలను సభ మూజువాణి ఓటుతో తిరస్కరించింది. ఓటింగ్‌కు కొద్దిసేపు ముందు, శివసేనకు చెందిన ముగ్గురు సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు. ఎస్పీ, ఎన్సీపీలకు చెందిన ఇద్దరు చొప్పున ఎంపీలు, ఒక టీఎంసీ సభ్యుడు గైర్హాజరయ్యారు. ఉభయసభల ఆమోదం అనంతరం, బిల్లును రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తరువాత అది చట్టరూపం దాలుస్తుంది.

**ముస్లింలకు వ్యతిరేకం కాదు:** బిల్లులో ముస్లింలను మినహాయించడంపై పలువురు సభ్యులు విమర్శలు చేశారు. దానిపై స్పందిస్తూ.. ఇతర దేశాల నుంచి వచ్చి భారత పౌరసత్వం పొందాలనుకునే ముస్లింలు ప్రస్తుతమున్న చట్టాల ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశముందని షా చెప్పారు. 566 మంది ముస్లింలు అలా పౌరసత్వం పొందారన్నారు. పాక్, బంగ్లా, అఫ్గాన్‌ల్లో మత వివక్షను ఎదుర్కొన్న మైనారిటీలకు భారతీయ పౌరసత్వం కల్పించడమే ఈ బిల్లు లక్ష్యం కాబట్టి, ఆ దేశాల్లో మెజారిటీలైన ముస్లింలను బిల్లులో చేర్చలేదని వివరణ ఇచ్చారు. శ్రీలంక నుంచి వచ్చిన తమిళులకు పౌరసత్వం కల్పించడం గతంలో జరిగిందని, ఈ బిల్లు ప్రత్యేక సమస్య పరిష్కారం కోసం రూపొందించిందని వివరించారు.

**ఆర్టికల్ 14కి ఉల్లంఘన కాదు**

కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్ నాయకుల్లా మాట్లాడుతున్నారని అమిత్ షా విమర్శించారు. 'ఈ బిల్లు కానీ, గతంలో సభ ఆమోదం పొందిన ట్రిపుల్ తలాఖ్, ఆర్టికల్ 370 రద్దు బిల్లులు కానీ.. ముస్లింలకు వ్యతిరేకం కాదు. ఈ బిల్లు పౌరసత్వం కల్పించేదే కానీ.. పౌరసత్వాన్ని లాక్కొనేది కాదు. ఈ విషయంలో ముస్లింలు ఎలాంటి భయాందోళలకు గురి కావాల్సిన అవసరం లేదు' అని స్పష్టం చేశారు. '1947లో మత ప్రాతిపదికన దేశ విభజన జరిగింది. ఆ తప్పును సరిదిద్దేందుకే ఈ బిల్లును తీసుకురావాల్సి వచ్చింది' అన్నారు. కాంగ్రెస్ ఈ విషయంలో రెండు నాలుకలతో మాట్లాడుతోందన్నారు. 'గతంలో ఇదే కాంగ్రెస్ తమ పాలనలో వేరే ఇతర మతాల గురించి పట్టించుకోకుండా పాకిస్తాన్ నుంచి వచ్చిన 13 వేల హిందువులు, సిక్కులకు పౌరసత్వం ఇచ్చింది' అని విమర్శించారు. సమానత్వ హక్కును ప్రసాదించే రాజ్యాంగ అధికరణ 14కి కూడా ఈ బిల్లు ఉల్లంఘన కాదని అమిత్ షా స్పష్టం చేశారు. సహేతుక కారణాలతో పార్లమెంట్ చట్టాలు చేయడాన్ని ఆర్టికల్ 14 నిరోధించదన్నారు.

**మా మేనిఫెస్టోలోనే చెప్పాం**

అంతకుముందు, బిల్లును సభలో ప్రవేశపెడ్తూ అమిత్ షా.. ఈ బిల్లు విషయంలో భారతీయ ముస్లింలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వారు భారతీయులుగానే కొనసాగుతారన్నారు. అనవసరంగా ముస్లింలకు తప్పుడు సమాచారం పంపిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. పౌరసత్వ బిల్లు 2014, 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ మేనిఫెస్టోలోనే ఉందని, దానికి అనుకూలంగానే బీజేపీకి ప్రజలు ఘనవిజయం అందించారన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాలకు పాల్పడలేదని, ఎన్నికలకు ముందే ఈ విషయమై హామీ ఇచ్చామని తెలిపారు. ఈ బిల్లు కేవలం మూడు పొరుగుదేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వివక్షకు, వేధింపులకు గురైన హిందూ, పార్శీ, జైన్, సిఖ్, క్రిస్టియన్, బౌద్ధ మతస్తులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించినదేనని వివరించారు. పొరుగుదేశాల్లో దారుణమైన వివక్ష ఎదుర్కొని, భారత్‌కు వచ్చిన ఆ ఆరు మతాలకు చెందిన లక్షలాది శరణార్థులకు భారత్‌లో విద్య, ఉద్యోగం, జీవనోపాధి కల్పించే సదుద్దేశంలో ఈ చరిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామన్నారు. వారు భారత్‌లో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రతిపాదన బిల్లులో ఉందన్నారు. 'పాక్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల నుంచి వచ్చిన ముస్లింలకు పౌరసత్వ కల్పించాలని కోరుకుంటున్నారా? ఇది ఎలా సాధ్యం?' అని విపక్షాలను ప్రశ్నించారు.

**ప్రసారాల నిలిపివేత**

విపక్ష పార్టీలకు చెందిన పలువురు సభ్యులు ఈ బిల్లును సమగ్రంగా అధ్యయనం చేసేందుకు సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. అమిత్ షా ప్రసంగాన్ని అడ్డుకునేందుకు విపక్ష సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో కొద్దిసేపు సభ ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేశారు.



బిల్లుకు వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల కాగడాల ప్రదర్శన

### చరిత్రలో మైలురాయి: మోదీ

పౌరసత్వ సవరణ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే, మైలురాయి లాంటిరోజని అభివర్ణించారు. బిల్లుకు అనుకూలంగా ఓటేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు. కాగా, బిల్లు పార్లమెంటు ఆమోదం పొందిన ఈ రోజు భారత రాజ్యాంగ చరిత్రలో చీకటి రోజని బుధవారం కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అభివర్ణించారు. ఇది విభజన శక్తుల, సంకుచిత మనస్తత్వం ఉన్నవారి విజయం అన్నారు. మరోవైపు, ఈ బిల్లుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు సంకేతాలిచ్చారు. పార్టీ తరపున కోర్టుకెళ్తామని సీనియర్ నేత కపిల్ సిబల్ వెల్లడించారు. బిల్లు రాజ్యాంగబద్ధతపై పలు అనుమానాలున్నాయని, అందువల్ల కోర్టులో సవాలు చేసే అవకాశముందని అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు.

### కోర్టు కొట్టివేస్తుంది

ఈ బిల్లును కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు తీవ్రంగా నిరసించాయి. మత ప్రాతిపదికన రూపొందిన ఈ బిల్లు న్యాయ సమీక్షకు నిలవబోదని హెచ్చరించాయి. 'ఈ బిల్లు భారత రాజ్యాంగ మౌలిక భావనలకు వ్యతిరేకం. ఇది విద్వేషపూరితంగా, విభేదాలు సృష్టించేలా ఉంది' అని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ విమర్శించారు. 'హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లేందుకే ఈ బిల్లును తీసుకువచ్చారు. అదృష్టవశాత్తూ మీరు రాజ్యాంగ సవరణ చేయడం లేదు. చట్టాన్ని చేస్తున్నారంతే. ఇది న్యాయసమీక్షకు నిలవబోదు అనే విషయం నాకు స్పష్టంగా తెలుసు. దీన్ని కోర్టు కచ్చితంగా కొట్టేస్తుంది' అని కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు పి.చిదంబరం పేర్కొన్నారు. ఈ బిల్లు బీజేపీ హిందూత్వ ఎజెండాలో భాగంగా, నాజీ కాఫీ బుక్ నుంచి స్ఫూర్తి పొందినట్లుగా ఉందని టీఎంసీ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ వ్యాఖ్యానించారు.

### తినే గొరిల్లా..



బుధవారం బెంగళూరులో 45వ 'వార్షిక కేక్ ప్రదర్శన'లో గొరిల్లా ఆకారంలో తయారు చేసిన భారీ కేక్ ముందు సెల్ఫీ దిగుతున్న యువతి. ఈనెల 13 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ షో ఉంటుంది.

# అట్టుడుకుతున్న ఈశాన్యం

## గువాహటిలో కర్ఫ్యూ, దిస్పూర్‌లో నిరసనకారులపై కాల్పులు

**గువాహటి:** పౌరసత్వ సవరణ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలు అట్టుడుకుతున్నాయి. అస్సాం, త్రిపురల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అస్సాంలో భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పౌర నిరసనలకు కేంద్రంగా మారిన అస్సాం రాజధాని గువాహటిలో బుధవారం నిరవధిక కర్ఫ్యూ విధించారు. కర్ఫ్యూని ధిక్కరిస్తూ నిరసనకారులు వీధుల్లో నిరసనలు కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల పోలీసులు ఆందోళనకారులపై లాఠీచార్జ్ చేశారు. గువాహటి, దిస్పూర్, డిబ్రూగఢ్, జోర్హాత్, త్రిపుర రాజధాని అగర్తల తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు, నిరసనకారులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అస్సాం రాజధాని దిస్పూర్‌లో నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. సెక్రటేరియట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులపై కాల్పులు జరిపారు. ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని షింజో అబేలు దిస్పూర్‌లో ఆదివారం భేటీ కానున్న వేదికను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఆందోళనల కారణంగా తేజ్‌పూర్ నుంచి వచ్చిన అస్సాం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ కొద్దిసేపు గువాహటి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. పలు రైళ్లను రద్దు చేశారు. త్రిపుర, అస్సాంలలో ఆర్మీని మోహరించారు. అస్సాంలోని 10 జిల్లాల్లో బుధవారం సాయంత్రం నుంచి ఇంటర్నెట్‌ను నిలిపేశారు. త్రిపురలో మంగళవారం నుంచే ఇంటర్నెట్‌తో పాటు ఎస్ఎంఎస్ సదుపాయాన్ని కూడా నిలిపేశారు.



బిల్లును వ్యతిరేకిస్తూ గువాహటిలో ఆందోళనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ

### ఆందోళన ఎందుకు?

ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి భారీ సంఖ్యలో హిందువులు కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా ఈశాన్య రాష్ట్రాల్లోకి ప్రవేశించారు. ఇప్పుడు వారందరికీ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా పౌరసత్వం వస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని జనాభా స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ బిల్లు ముస్లిం శరణార్థులకు వర్తించదు. ఇప్పటికే అస్సాం పౌర రిజిస్టర్ ద్వారా ఎందరో దేశ పౌరసత్వాన్ని కోల్పోయారు. దశాబ్దాల తరబడి ఇక్కడ ఉంటున్న మైనారిటీల భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన కొందరిలో నెలకొంది.

## క్లుప్తంగా...

### మనోళ్లు గూగుల్‌ను ఏమడిగారో తెలుసా?

**న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370 అంటే ఏమిటి ?, అయోధ్య కేసు ఏమిటి ?, జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్సీ) అంటే ఏమిటి ? ఇవీ గూగుల్‌ను భారతీయులు ఎక్కువగా అడిగిన ప్రశ్నలు. 2019ఏడాదికిగాను వీటి గురించే అత్యధికంగా వెదికారని గూగుల్ 2019 నివేదిక తెలిపింది. ఎగ్జిట్ పోల్స్, బ్లాక్‌హోల్, హౌడీ–మోడీలను శోధించారు. క్రికెట్ వరల్డ్ కప్‌తోపాటు లోక్‌సభ ఎన్నికల గురించి అత్యధిక మంది సెర్చ్ చేశారు. ఓటేయడం ఎలా ? ఓటరు లిస్టులో పేరును ఎలా చూసుకోవాలి వంటి ప్రశ్నలను గూగుల్‌ను అడిగారు. చంద్రయాన్–2, నీట్ ఫలితాలు, పీఎం కిసాన్ యోజన, కబీర్ సింగ్, అవెంజర్స్ ఎండ్ గేమ్, కెప్టెన్ మార్వెల్ గురించీ వెదికారు. వ్యక్తుల గురించి చేసిన శోధనలో.. 'ఐఎఫ్ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్' తొలిర్యాంక్ సాధించారు. తర్వాత లతా మంగేష్కర్, యువరాజ్ సింగ్, 'సూపర్ 30' ఆనంద్ వంటివారు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగాచూస్తే గేమ్ ఆఫ్ థ్రోన్స్ టీవీ షో గురించి వెదికారు.

### అమెరికాలో కాల్పులు

**ఆరుగురు మృతి**

**జెర్సీ సిటీ:** అమెరికా న్యూజెర్సీ నగరంలో తుపాకీ విష సంస్కృతి మరోసారి చెలరేగింది. మంగళవారం రాత్రి నగర వీధుల్లో జరిగిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందారు. వీరిలో ముగ్గురు సాధారణ పౌరులు కాగా, ఒక పోలీసు అధికారి, కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగులు ఉన్నారు. దుండగులు యూదులకు చెందిన కొషర్ సూపర్ మార్కెట్‌ని లక్ష్యంగా చేసుకున్నట్టు నగర మేయర్ స్టీవెన్ చెప్పారు. ఇది ఉగ్రవాదుల దాడి కాదని, కేవలం యూదుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులకు దిగారని, పోలీసులు వారిని హతం చేశారని ట్వీట్ చేశారు.

### ఉగ్ర సయీద్ దోషే

**నిర్ధారించిన పాకిస్తాన్ కోర్టు**

**లాహోర్:** ముంబై ఉగ్రదాడుల వ్యూహకర్త, నిషేధిత ఉగ్రవాద సంస్థ జమాత్ ఉద్ దావా అధ్యక్షుడు హఫీజ్ సయీద్‌ను పాకిస్తాన్ కోర్టు ఒకటి దోషిగా ప్రకటించింది. పంజాబ్ ప్రాంతంలోని పలు నగరాల్లో సయీద్ ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందించారని స్పష్టం చేస్తూ యాంటీ టెర్రరిజమ్ కోర్టు జడ్జి మాలిక్ అర్షద్ భుట్టా తీర్పునిచ్చారు. పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ఉగ్రవాద వ్యతిరేక విభాగం ఈ ఏడాది జూలైలో సయీద్, అతడి అనుచరులపై ఈ కేసు దాఖలు చేసింది. హఫీజ్ సయీద్‌ను అరెస్ట్ చేసి కోట్ లఖ్‌పత్ జైల్లో ఉంచింది. పంజాబ్‌తోపాటు లాహోర్, గుజ్రన్‌వాలా, ముల్తాన్ నగరాల్లో ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందించే లక్ష్యంతో సయీద్, అతడి అనుచరులు నిధులు సేకరించారని పోలీసులు ఆరోపిస్తున్నారు.

# ఇకపై జీఎస్టీ వడ్డన!

## 18న జీఎస్టీ మండలి కీలక భేటీలో తుది నిర్ణయం

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక పరిస్థితి అంతకంతకూ దిగజారుతోంది. వస్తు సేవల పన్ను(జీఎస్టీ ) ద్వారా ఆశించినంత వసూళ్లు జరగకపోవడంతో పలు వస్తువుల జీఎస్‌టీని సవరించాలని, పన్ను శ్లాబుల్ని పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 18న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ మండలి భేటీ కానుంది. ఆ మండలి సమావేశంలో జీఎస్టీ పెంపుపై తుది నిర్ణయం తీసుకుంటారు. కేంద్రం, రాష్ట్రాలకు చెందిన ఆర్థిక శాఖ అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణ, జీఎస్టీలో పన్నుల శాతం పెంపుపై కొన్ని సిఫార్సులు చేశారు. ప్రస్తుతం జీఎస్టీలో 5%, 12%, 18%; 28% శ్లాబులు ఉన్నాయి. 28శాతం కంటే తక్కువ ఉన్న శ్లాబుల్లో కూడా అదనంగా సెస్ వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ కేంద్ర ఖజానాకి ఆశించినంత ఆదాయం రావడం లేదు. 5 శాతం పన్నుని 8శాతానికి , 12 నుంచి 15 శాతానికి పెంచే అవకాశాల్ని కూడా పరిశీలించినట్టు ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ధరల్ని స్థిరీకరిస్తూనే ఖజానా ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించారు. కొన్ని వస్తువులపై భారీగా సెస్ విధించాలని కూడా జీఎస్టీ మండలి యోచిస్తోంది. అంతే కాకుండా ప్రస్తుతమున్న పన్ను రేటు శ్లాబుల్ని మూడుకి కుదించాలని భావిస్తోంది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్–నవంబర్ మధ్య జీఎస్టీ పన్ను వసూళ్లు బడ్జెట్ అంచనాలకంటే 40శాతానికి తగ్గినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి.

# నాటి మోదీ ప్రభుత్వానికి క్లీన్‌చిట్

- 2002 గుజరాత్ అల్లర్లపై నానావతి కమిషన్ నివేదిక
- గుజరాత్ అసెంబ్లీకి సమర్పణ



గుజరాత్‌లో అల్లర్ల దృశ్యం (ఫైల్)

**గాంధీనగర్:** 2002 నాటి గుజరాత్ అల్లర్ల విషయంలో అప్పటి ఆరాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తప్పేమీ లేదని జస్టిస్ నానావతి కమిషన్ స్పష్టం చేసింది. గుజరాత్ హోం శాఖ మంత్రి ప్రదీప్ సిన్హ్ జడేజా బుధవారం నానావతి కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కమిషన్ ఈ నివేదికను ఐదేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించింది . 2002 అల్లర్ల సమయంలో కొన్ని చోట్ల తగినంత సిబ్బంది లేక పోలీసులు మూకలను నియంత్రించడంలో విఫలమయ్యారని, సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ నానావతి, గుజరాత్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ అక్షయ్ మెహతాల కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రుల స్ఫూర్తితోగానీ, రెచ్చగొట్టడం వల్లకానీ, ప్రోత్సహించడం వల్లగానీ 2002లో ఒక వర్గంపై దాడులు జరిగాయనేందుకు ఆధారాలు లేవని పేర్కొంది. అందుబాటులో ఉన్న సమాచారం మొత్తాన్ని పరిశీలించాక... గోద్రా సంఘటన తరువాత చెలరేగిన మతఘర్షణలు ఆ ఘటన తాలూకా ప్రతిస్పందనగా మాత్రమే జరిగాయని భావిస్తున్నట్లు కమిషన్ తెలిపింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌లకు చెందిన స్థానిక సభ్యులు వారి నివాసప్రాంతాల్లో జరిగిన గొడవల్లో పాల్గొన్నారని వివరించింది. అహ్మదాబాద్ నగరంలో జరిగిన మత ఘర్షణలను ప్రస్తావిస్తూ.. ఆ సమయంలో అత్యవసరమైన చొరవ, సామర్థ్యాన్ని పోలీసులు చూపలేదని అభిప్రాయపడింది. తప్పు చేసిన పోలీసు అధికారులపై విచారణ, చర్యలపై విధించిన స్టేను కమిషన్ ఎత్తివేయడం గమనార్హం. 2002లో మత ఘర్షణల తరువాత ఏర్పాటైన నానావతి కమిషన్ తన తొలి నివేదికను 2009 సెప్టెంబరులో సమర్పించగా తుది నివేదిక 2014 నవంబరు 18న ప్రభుత్వానికి అందించింది.

# ఈ ఫోన్లలో వాట్సాప్ బంద్!

- 2020 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి
- ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి అన్ని విండోస్ ఫోన్లలో కూడా..

**ఈ ఫోన్లలో పనిచేయదు..**

- ✦ ఆండ్రాయిడ్ 2.3.7 ఆపరేటింగ్ సిస్టం
- ✦ ఐవోఎస్ 8 ఆపరేటింగ్ సిస్టం ఐఫోన్లు..

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి పలు పాత స్మార్ట్‌ఫోన్లలో ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్ పనిచేయదు. ఈ విషయాన్ని తన ఎఫ్ఏక్యూ సెక్షన్‌లో వాట్సాప్ పేర్కొంది. ఆండ్రాయిడ్ 2.3.7, అంతకు ముందు ఉన్న పాత వర్షన్‌లపై నడిచే ఫోన్లు, ఐవోఎస్ 8, దానికి ముందరి ఓఎస్‌లపై నడిచే ఐఫోన్లలో వచ్చే ఏడాది నుంచి వాట్సాప్ పని చేయదు. ఈ పాత ఫోన్లలో ఫిబ్రవరి 1 తర్వాత వాట్సాప్ ఖాతాను క్రియేట్ చేసుకోవడం కానీ, ఉన్న ఖాతాను పునరుద్ధరించుకోవడం కానీ కుదరదు. అన్ని రకాల విండోస్ ఫోన్లకు కూడా 2019 డిసెంబర్ 31 నుంచి తమ సేవలు ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది. అదే నెలలో మైక్రోసాఫ్ట్ కంపెనీ కూడా విండోస్ 10 మొబైల్ ఓఎస్ సేవలు కూడా నిలిపేయనుంది. ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో నడుస్తున్న వాట్సాప్ ఎప్పటికప్పుడు తన యాప్‌ను అప్‌డేట్ చేస్తూ ఉంది. ఫోన్ బ్యాటరీ వాడకం తగ్గేలా 'డార్క్ మోడ్'ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

# సెలెక్ట్ కమిటీకి 'డేటా' బిల్లు

**న్యూఢిల్లీ:** ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో.. పౌరుల సమాచార భద్రతకు ఉద్దేశించిన 'వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లు'పై (పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు) కేంద్రప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఈ బిల్లును జాయింట్ సెలెక్ట్ ప్యానెల్ పరిశీలనకు పంపిస్తున్నట్లు ఐటీ మంత్రి రవి శంకర్ చెప్పారు. ఈ కమిటీ బిల్లుకు సంబంధించిన నివేదికను బడ్జెట్ సమావేశాల్లోపు అందించనున్నట్లు తెలుస్తోంది. కాగా, సమాచార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతరాలు లేవనెత్తడం తెల్సిందే. ఈ బిల్లును స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాలని కోరారు. ఆందోళనల నేపథ్యంలో బిల్లును కమిటీ పరిశీలనకు పంపారు. కమిటీలో ఎంపీలు మిథున్‌రెడ్డి, మీనాక్షి లేఖి తదితరులు ఉన్నారు.

# ఫిన్‌ల్యాండ్ కేబినెట్‌లో 12 మంది మహిళలు

**పార్లమెంటు విశ్వాసం పొందిన ప్రధాని మారిన్**



ప్రధాని సన్నా మారిన్

**హెల్సింకి:** ప్రపంచ దేశాల్లో అత్యంత పిన్న వయస్కురాలైన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించిన ఫిన్‌ల్యాండ్ ప్రధాని సన్నా మారిన్ తన కేబినెట్‌లోనూ మహిళలకే అత్యధికంగా చోటు కల్పించారు. కొత్త కేబినెట్‌లో 12 మంది మహిళలకి అవకాశం లభించింది. ఈ మంత్రుల్లో ఒక్కరు మినహాయించి మిగిలిన వారంతా 30–35 ఏళ్ల మధ్య వయసున్నవారే. ఆమె కేబినెట్‌లో ఏడుగురు పురుషులు కూడా ఉన్నారు. ఆర్థికం, విద్య, అంతర్గత వ్యవహారాలు వంటి ముఖ్యశాఖలన్నీ మహిళలకే అప్పగించారు. 34 ఏళ్ల వయసున్న సన్నా మారిన్ మంగళవారం ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటులో విశ్వాస పరీక్ష ఎదుర్కొని నెగ్గారు. మారిన్‌కు అనుకూలంగా 99 ఓట్లు, వ్యతిరేకంగా 70 ఓట్లు వచ్చాయి. ఫిన్‌ల్యాండ్‌లో అధికారంలో ఉన్న సెంటర్ లెఫ్ట్ సంకీర్ణ సర్కార్‌ను నడపడం ఆమె ముందున్న అతి పెద్ద సవాల్. ''మర్యాద మన్ననల మధ్య ప్రతీ చిన్నారి ఎదుగుదల ఉండాలి. ఎవరైనా ఏదైనా సాధించేలా సమాజాన్ని నిర్మించడమే నా ధ్యేయం'' అని మారిన్ ట్వీట్ చేశారు. దేశంలో పోస్టల్ సమ్మెను ఎదుర్కోవడంలో విఫలమైనందుకు గత వారంలో అంటి రిన్నె ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో మారిన్ పగ్గాలు తీసుకున్నారు. సెంటర్ పార్టీకి చెందిన కత్రి కులుమణి (32)కి ఆర్థిక శాఖ, గ్రీన్ పార్టీ నాయకురాలు మారియా ఒహిశాలో (34)కు అంతర్గత వ్యవహారాలు, లెఫ్ట్ కూటమి చైర్‌వుమెన్ లీ అండర్సన్ (32)కు విద్యాశాఖ అప్పగించారు. కార్మికుల అసంతృప్తి జ్వాలలు, ఎటు చూసినా సమ్మెలు నడుస్తున్న వేళ ప్రధానిగా మారిన్ తన ఎదుట ఉన్న సవాళ్లను ఎలా ఎదుర్కొంటారో వేచి చూడాలి.

# ప్రపంచాన్ని కదిలిస్తున్న బాల పర్యావరణవేత్తలు




టైమ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా గ్రెటా థన్‌బర్గ్



లిసిప్రియా కంగుజమ్

**మాడ్రిడ్:** వారిద్దరూ స్కూలుకెళ్లి చక్కగా చదువుకుంటూ, ఆడుకుంటూ కాలం గడపాల్సిన వాళ్లు. కానీ పర్యావరణ పరిరక్షణపై వారికున్న ఆసక్తి ప్రపంచ దేశాల నేతల ముందు వక్తలుగా మార్చింది. మణిపూర్‌కు చెందిన ఎనిమిదేళ్ల లిసిప్రియా కంగుజమ్ వాతావరణంలో వస్తున్న మార్పులపై చర్యలు తీసుకోండి అంటూ ప్రపంచ అధినేతలను కోరుతోంది. స్పెయిన్ వేదికగా ఈనెల 13 వరకు జరుగుతున్న సీఓపీ25 వాతావరణ సదస్సులో భాగంగా ఆమె ప్రసంగించారు. ఆడుకోవాల్సిన వయసులో తమ భవిష్యత్తు కోసం పోరాటం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె తండ్రి కేకే.సింగ్ మాట్లాడుతూ..తమ కూతురు ఇప్పటికే 21 దేశాల్లో వాతావరణ మార్పుల గురించి ప్రసంగాలు చేసిందన్నారు. ఐక్యరాజ్య సమితి సమావేశంలో 'హౌ డేర్ యూ ?' అంటూ ప్రపంచ నేతలనుద్దేశించి ప్రశ్నించిన స్వీడన్ టీనేజర్ గ్రెటా థన్‌బర్గ్ (16) టైమ్స్ మేగజీన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2019గా నిలిచింది. మానవాళికి ఉన్న ఒకే గృహాన్ని నాశనం చేయవద్దంటూ ఆమె చేసిన పోరాటం మన్ననలు అందుకుందని టైమ్స్ మేగజీన్ బుధవారం తెలిపింది. వ్యక్తిగతంగా ఈ రికార్డును అందుకున్న అతి పిన్న వయస్కురాలు గ్రెటానే అంటూ టైమ్స్ ఆమెను కొనియాడింది. లిసిప్రియా, గ్రెటాలు ఇద్దరూ పర్యావరణం గురించి నిరసనల్లో పాల్గొనేందుకు స్కూలుకు సైతం సరిగా వెళ్లేవారు కాదు.




ప్రపంచంలోనే మొట్టమొదటి ' విద్యుత్ ఆధారిత సీ-ప్లేన్' ఇది. బుధవారం బ్రిటిష్ కొలంబియాలోని రిచ్‌మండ్‌లో ల్యాండ్ అవుతున్నపుడు తీసిందీ ఫొటో. హార్బర్ ఎయిర్ అనే సంస్థ ఈ విమాన సర్వీసులను నడపనుంది.

సాక్షి
గురువారం, డిసెంబర్, 12

# బోధనపై ఆంక్షలా?

**వి**వేచనపైనా, వివేకంపైనా పిడివాదమే గెలిచింది. వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం(బీహెచ్‌యూ)లోని సంస్కృత విద్యా ధర్మ విజ్ఞాన్(ఎస్‌వీడీవీ) విభాగంలో సంస్కృత విద్యా బోధన కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితుడైన ఫిరోజ్‌ఖాన్ దాన్నుంచి తప్పుకుని మరో విభాగంలో చేరవలసి వచ్చింది. విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్ష, ఇంటర్వ్యూల్లో ఆయన మరో 9మందితో పోటీపడి రెండు నెలలక్రితం ఆ పోస్టుకు ఎంపికయ్యాడు. ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన బోర్డులో ప్రముఖ సంస్కృత పండితుడు ప్రొఫెసర్ రాధావల్లభ్ త్రిపాఠీతోసహా హేమాహేమీలున్నారు. ఇతరులతో పోలిస్తే ఆ పోస్టుకు కావాల్సిన సకల అర్హతలూ ఆయనకు ఉన్నాయని, ఫిరోజ్‌ఖాన్ సంస్కృతంలో సాహిత్య సంబంధ అంశాలే బోధిస్తారు తప్ప మతపరమైన అంశాలతో ఆయనకు ప్రమేయం ఉండదని బీహెచ్‌యూ వైస్‌చాన్సలర్ రాకేష్ భట్నాగర్, సంస్కృత సాహిత్య విభాగం అధిపతి ప్రొఫెసర్ ఉమాకాంత్ చతుర్వేది, విశ్వవిద్యాలయ పాలకమండలి నచ్చజెప్పినా విద్యార్థులు అంగీకరించలేదు. సంస్కృతాన్ని మతంతో లేదా కులంతో ముడిపెట్టడం, దాన్ని ఫలానా మతం వారు మాత్రమే నేర్చుకోవాలని, వారు మాత్రమే బోధించాలని ఆంక్షలు పెట్టడం రాజ్యాంగ విలువలకు అపచారం చేయడం మాత్రమే కాదు.. ఆ భాషకు కూడా అన్యాయం చేసినట్టే. ప్రజల్లో విస్తృతంగా వాడుకలో ఉన్నప్పుడే ఏ భాషైనా అభివృద్ధి చెందుతుంటుంది. చిరకాలం వర్థిల్లుతుంది. కొందరికే పరిమితమైనప్పుడు కుంచించుకుపోతుంది. సంస్కృత వ్యాకరణం, సాహిత్యం, వేదాలు, ఉపనిషత్తులు ఔపోసనపట్టిన ఫిరోజ్‌ఖాన్‌ను విధ్వంసక శక్తిగా చూడటం, ఆయన బోధనాచార్యుడిగా వస్తే ఏదో అపచారం జరిగిపోతుందని బెంబేలెత్తడం ఆశ్చర్యం కలిగిస్తుంది. రాజస్తాన్‌కు చెందిన ఫిరోజ్ కుటుంబం మూడు తరాలనుంచి సంస్కృతంపైనా, హిందూ మత ఆచారాలపైనా ఆసక్తి, అనురక్తీ పెంచుకుంది. ఒకపక్క మసీదులో నమాజు చేస్తూనే గోవును పూజించడం, వారి స్వస్థలమైన బంగ్రూలో ఉన్న దేవాలయాల్లో భజన గీతాలు పాడటం ఫిరోజ్ తండ్రి రంజాన్‌ఖాన్‌కు దశాబ్దాలుగా అలవాటు. రంజాన్‌ఖాన్ సంస్కృతంలో పట్టభద్రుడు. తన కుటుంబం అనుసరిస్తున్న ఆచారాల విషయంలోగానీ, దేవాలయాల్లో భజనగీతాలు పాడటం విషయంలోగానీ ముస్లింలెవరూ అభ్యంతరం చెప్పలేదని ఆయనంటున్నాడు. సంస్కృతంపై తనకు వల్లమాలిన ప్రేమ ఉండబట్టే కుమారుణ్ణి ఆ భాషలో నిష్ణాతుడయ్యేలా ప్రోత్సహించానని చెబుతున్నాడు. ఫిరోజ్‌ఖాన్ సంస్కృత భాషపై చేసిన పరిశోధనైనా, ఆయన మాట్లాడే సంస్కృత భాషైనా అత్యున్నత ప్రమాణాలతో ఉన్నదని ఇంటర్వ్యూ బోర్డులోని సభ్యులు తెలిపారు. ఈ విషయమే ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తెలియజెప్పి వారిని ఒప్పించాలని చూశారు. కానీ ఫలితం లేకపోయింది. ఈ ఆందోళన కొనసాగినంతకాలం ఫిరోజ్‌ఖాన్ అజ్ఞాతవాసం గడపవలసి వచ్చింది. చిత్రమేమంటే అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో సంస్కృత విభాగ అధిపతిగా ఉన్న సల్మా మహీజ్‌కు ఇలాంటి అడ్డంకులు ఎదురుకాలేదు. అందరూ అత్యంత సంక్లిష్టమైనదిగా భావించే పాణిని విరచిత సంస్కృత వ్యాకరణం అష్టాధ్యాయిని ఆమె అలవోకగా బోధిస్తారు. సంస్కృత భాషలో పాండిత్యం గడించిన తొలి ముస్లిం మహిళగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఇప్పుడు పీహెచ్‌డీ చేస్తున్న 15మంది విద్యార్థులకు ఆమె గైడ్.

వారణాసికి చరిత్రలో విశిష్ట స్థానముంది. అక్కడ షా జహాన్ చక్రవర్తి పెద్ద కుమారుడు దారా షికో సంస్కృత భాషను అధ్యయనం చేయడమే కాదు... అందులో నిష్ణాతుడై భగవద్గీతను, 52 ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువదించాడు. సాగర సంగమం పేరుతో హిందూ, ఇస్లాం, ఇతర మతాల మధ్య ఉన్న వైవిధ్యతలనూ, ఏకత్వాన్ని సోదాహరణంగా వివరిస్తూ పర్షియన్ భాషలో గ్రంథం రచించాడు. ఆయనకన్నా ఏడువందల ఏళ్ల ముందు అల్–బిరూని అనే ముస్లిం విద్యాధికుడు ఇప్పటి ఉజ్బెకిస్తాన్, తుర్కుమెనిస్తాన్‌ల నుంచి భారత్ వచ్చి సంస్కృతంలో పాండిత్యం గడించి ఈ దేశంలోని సంస్కృతి, మతం, జీవనవిధానం, తాత్విక చింతనలను చాటిచెబుతూ ఉద్గ్రంథాన్ని రచించాడు. పర్షియన్ ప్రపంచానికి హిందూ మతాన్ని పరిచయం చేసే వంద గ్రంథాలు వెలువరించాడు. సూఫీ కవి, పండితుడు అమిర్ ఖుస్రో వేదాల్ని, పురాణాల్ని ఔపోసన పట్టి, సంస్కృతంలోనే అనేక రచనలు చేశాడంటారు. ఆయన వచనంలోనూ, కవిత్వంలోనూ అడుగడుగునా అనేక సంస్కృత పదాలుంటాయి. వీరు మాత్రమే కాదు... యూరప్ దేశాలకు చెందిన ఎందరో సంస్కృతాన్ని నేర్చుకున్నారు. 1785లో చార్లెస్ విల్కిన్స్‌తో మొదలుపెట్టి జర్మనీకి చెందిన మాక్స్ ముల్లర్ వరకూ అనేకులు సంస్కృత కావ్యాలను, గ్రంథాలను ఇంగ్లిష్, జర్మన్ తదితర భాషల్లోకి అనువదించారు. కొందరు పర్షియన్ భాషలోకి అనువాదమైన సంస్కృత కావ్యాలను తర్జుమా చేశారు. సంస్కృతభాషను నిశితంగా అధ్యయనం చేసి భిన్న శతాబ్దాల్లో వెలువడిన సంస్కృత కావ్యాల్లోని భాషా ప్రయోగాల్లో చోటుచేసుకున్న మార్పులపై పరిశోధనలు చేసిన కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ షెల్డన్ పొలాక్ వర్తమాన ప్రపంచంలోని సంస్కృత భాషా పండితుల్లో అగ్రగణ్యుడు.

భాష నేర్చుకోవడానికి కులమో, మతమో అడ్డురావడం అంతిమంగా దానికి ప్రతిబంధకమవుతుంది తప్ప అది విస్తరించడానికి దోహదపడదు. మన దేశంలో ఉన్న కుల వ్యవస్థ ఇలాంటి ప్రతిబంధకాలు సృష్టించబట్టే ఆర్యభట, కణాదుడు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, బ్రహ్మగుప్తుడు తదితరులు సంస్కృత భాషలో అభివృద్ధి చేసిన ఎన్నో విజ్ఞానశాస్త్రాలు అనంతర కాలంలో విస్తరించలేకపోయాయి. నిజానికి ఇలాంటివి మనకు గుణపాఠాలు కావాలి. మన దృష్టి కోణాన్ని విశాలం చేయాలి. మరింతమంది ఫిరోజ్‌ఖాన్‌లు రూపొందేందుకు దోహదపడాలి. కానీ జరుగుతున్నదంతా అందుకు విరుద్ధం. అది విచారకరం.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి పౌర్ణమి ఉ.10.49 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం రోహిణి ఉ.7.08 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం ప.12.49 నుంచి 2.25 వరకు, దుర్ముహూర్తం ఉ.8.35 నుంచి 9.19 వరకు, తదుపరి ప.2.26 నుంచి 3.10 వరకు, అమృతఘడియలు... రా.10.32 నుంచి 12.09 వరకు.

**సూర్యోదయం :** 6.24
**సూర్యాస్తమయం:** 5.23
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# అత్యాచార సంస్కృతి అంతం ఎలా?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

**బాధితులపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేస్తున్న ఘటనలకు కారణం వ్యక్తులు తమ స్వీయ నియంత్రణను కోల్పోవడం ఎంతమాత్రం కాదు. అమ్మాయిలను అవమానించడం అంతకంటే కాదు. నిజానికి ఇవి మన సమాజంలోని పలు దొంతరలను సాంస్కృతికంగా హింసిస్తున్నదానికి వ్యక్తీకరణలు మాత్రమే. కుటుంబం పాఠశాల, మత సంస్థలు, మార్కెట్ స్థలాలు అన్నీ కలిసి స్త్రీ, పురుషులు సమానులు అనే భావాన్ని పాటిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేటటువంటి సాంస్కృతిక విధానాలను పాటించాలి.. స్త్రీల ఆత్మాభిమానాన్ని, శ్రమగౌరవాన్ని పెంచేటటువంటి సిలబస్‌ను రూపొందించాలి. మహిళల శ్రమ, వారి సృజనాత్మకతే జాతి పురోగమనానికి, అభివృద్ధికి కీలకం అని మన పిల్లలకు పాఠశాలల్లో బోధించనట్లయితే, భవిష్యత్తులో కూడా అత్యాచారాలు, వేధింపుల వంటి ఉపద్రవాలు మనల్ని పీడిస్తూనే ఉంటాయి.**

**వ్య**క్తులు తమ సంతృప్తిని తీర్చుకోవడానికి లేక అణచివేతను ఆయుధంగా ప్రయోగించడానికి ఉపయోగపడుతున్న అత్యాచారాల సంస్కృతి ప్రజల నైతిక ప్రమాణాలను చంపేస్తోంది. నవంబర్ 27న హైదరాబాద్, శంషాబాద్ సమీపంలో దిశపై జరిగిన పాశవిక సామూహిక అత్యాచారం ఏడేళ్ల క్రితం ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను మళ్లీ తలపింపజేసింది. ఢిల్లీలో కదులుతున్న బస్సులో నిర్భయను పాశవికంగా హత్య చేయగా, హైదరాబాద్‌లో దిశపై సామూహిక అత్యాచారం జరిపిన తర్వాత ఆమెను దాదాపు సజీవంగానే తగులబెట్టి చంపేశారు. ఈ రెండు ఘటనలపై యావద్దేశం తీవ్రంగా నిరసించింది. కానీ దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి దారుణ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దిశ కేసులో మాత్రమే రేపిస్టులను కాల్చిచంపారు. నిర్భయ హంతకులు మాత్రం తమపై మరణశిక్ష అమలు కోసం వేచి ఉంటున్నారు. అయితే ఇలాంటి సామూహిక అత్యాచార ఘటనలు ఎన్నో జరుగుతున్నా మీడియా దృష్టికి అవి రావడం లేదు.

ప్రతిరోజూ దేశంలో చిన్నారులపై జరుగుతున్న అత్యాచార వార్తలు ప్రజల సున్నితత్వాన్ని చంపేస్తున్నాయి. అత్యాచారం అనేది మరొక చెడువార్త.. దాన్ని వదిలేయండి అని భావిస్తున్న పరిస్థితి ఏర్పడుతోంది. టీచర్లు తమ సొంత విద్యార్థులను పాఠశాలల్లోనే అత్యాచారం చేస్తున్నారు. మత బోధకులు తమ అనుయాయులనే అత్యాచారం చేస్తున్నారు. మన విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు భయాందోళనలను ప్రేరేపించే సంస్థలుగా మారిపోతున్నాయి. బాధితులపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటనలకు కారణం వ్యక్తులు తమ స్వీయ నియంత్రణను కోల్పోవడం ఎంతమాత్రం కాదు. తన దృష్టిలో పడిన అమ్మాయిలను అవమానించడం అంతకంటే కాదు. నిజానికి ఇవి మన సమాజంలోని పలు దొంతరలను సాంస్కృతికంగా హింసిస్తున్నదానికి వ్యక్తీకరణలుగానే చూడాలి. దీనికి మూలాలు ప్రస్తుత కుటుంబం, స్కూలు, మత వ్యవస్థలు, పౌర సమాజంలో దాగి ఉన్నాయి. ఎందుకంటే సామూహిక అత్యాచారాలు చేసేవారు విభిన్న కుటుంబాలు, కులాలనుంచి వస్తున్నారు. ఇలాంటి అనాగరికమైన అత్యాచారాలకు మన యూనివర్సిటీలు కూడా మినహాయింపు కాదు. ప్రత్యేకించి భారతదేశంలో ఇది ఒక సామాజిక, భావజాలపరమైన ట్రెండ్‌గా మారిపోయింది.

నగరం నుంచి గ్రామం దాకా, కుటుంబం నుంచి పాఠశాల, కాలేజీ, ఆలయం, మసీదు, చర్చి వరకు మనం స్త్రీ, పురుష సంబంధాలపై పునరాలోచించుకోవలసి ఉంది. ఏ మతాన్నీ, ఏ పాఠశాలను, ఏ కుటుంబాన్నీ వదలకుండా భారీస్థాయిలో సాంస్కృతిక ప్రచారాన్ని ప్రారంభించాల్సి ఉంది. అత్యాచార విముక్త భారత్ కోసం జరిగే సాంస్కృతిక ప్రచారంలో స్త్రీ, పురుషులిరువురు పూర్తిస్థాయిలో పాల్గొనాల్సి ఉంటుంది. కుల వ్యవస్థ, అమానవీకరించిన పితృస్వామిక సంబంధాలు అనేవి ప్రపంచంలోనే ఏ సమాజంలోనూ చోటు చేసుకోనంత హింసకు భారతీయ స్త్రీ, పురుష సంబంధాలను గురి చేశాయి. ఈ సమస్యను విడి విడి ఉదంతాలుగా కాకుండా సర్వసమగ్ర దృష్టితో పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



గ్రామీణ కుటుంబ వ్యవస్థ నుంచి పట్టణాలు, నగరాల్లోని మన కుటుంబాల వరకు పరిశీలిస్తే ఇళ్లలో మనం వాడే భాషలో భయంకరమైన బూతులు దొర్లుతుంటాయి. వీటిలో చాలావరకు మహిళలను కేంద్రంగా చేసుకున్నవే. ఇంట్లో తండ్రీ, తల్లి, తాతా అవ్వలు సాధారణంగా ఆమోదించే జాతీయాలతో బూతు భాషను వాడుతున్నందున అది బాల్యం నుంచే మనలో ఇంకిపోయి ఉంటుంది. తరం నుంచి తరానికి ఇది పయనిస్తూనే ఉంటుంది. మన సమాజంలో ఆడదానిపై మగవాడు చలాయించే అధికారం, ఆజమాయిషీని బట్టే ఘనత వహించిన పురుషత్వం అనేదాన్ని నిర్వచిస్తుంటారు. నిత్యజీవితంలో మహిళను తనతో సమానంగా భావించి వ్యవహరించే పురుషుడిని ఈ సమాజం అసమర్థుడు అంటుంది. దీనికి మించిన పాశవిక సాంస్కృతిక భావం మరొకటి ఉండదు. కానీ అన్ని చోట్లా ఇది ఉనికిలో ఉంటోంది. దీంతో మనం తప్పక పోరాడాలి.

మన పుస్తకాలు మొత్తంగా ఉత్పత్తి, ప్రకృతి, సైన్స్, స్త్రీపురుషుల మధ్య సహకార సంబంధాలు వంటివాటి కంటే శృంగారం, సెక్స్‌పైనే ఎక్కువగా కేంద్రీకరిస్తుంటాయి. ఇక పాఠశాలలు, కాలేజీలు మహిళా వ్యతిరేక సాంస్కృతిక భావనలను పెంచిపోషిస్తూ, ఇంటి నుంచి పాఠశాలకు బూతు భాషను విస్తృతపరుస్తూ ఉంటాయి. మన పోలీసు స్టేషన్లు భయంకరమైన బూతుభాషను వాడటంలో పేరుమోశాయి. మన సినిమాలు పూర్తిగా హింస, సెక్స్‌తో నిండివుండి రేపిజానికి మారుపేరుగా ఉంటున్నాయి. వికృతమైన సెక్సు, హింసాత్మక ఘటనలు లేని సినిమా ఒక్కరోజు కూడా థియేటర్లో ఆడలేదు. అటు ప్రేక్షకులు, ఇటు నిర్మాత, హీరోల మనస్తత్వం హింసాత్మక సెక్స్‌ని లేక వీరోచితమైన భౌతిక హింసను ప్రదర్శిస్తూంటుంది.

భారతదేశంలో లేక మరెక్కడైనా సరే.. మానవ ప్రాణులను అత్యాచారం చేస్తున్న సంస్కృతి, జంతువుల్లోని ఆడామగ మధ్య లైంగిక కార్యకలాపం సందర్భంగా కనబర్చే ప్రవర్తనకు ఏమాత్రం పోలలేదు. ఆడజంతువు మద్దతు లేకుండా జంతువులు, పక్షులు బలాత్కారంగా సెక్సులో పాల్గొనలేవు. జంతువుల్లోకూడా గమనించలేనంత ఘోరమైన పీడన స్వభావంతో పురుష అణచివేత కొనసాగుతున్నందున దీన్ని అడ్డుకోవడానికి మరింత ఎక్కువగా జంతు ప్రవర్తనా శాస్త్రాలను భారతీయులు నేర్చుకోవలసి ఉంది. కానీ భారతీయ తరహా రేప్ సంస్కృతిని ఇతర సమాజాలతో అసలు పోల్చి చూడలేం. ఎందుకంటే యుద్ధ సమయాల్లో తప్పితే.. సామూహిక హత్యలు, వధలు ఆ సమాజాల్లో తక్కువ. సాధారణ పరిస్థితుల్లో ఏ మగాడైనా సరే ఆడదాని శరీరాన్ని తాకాలంటే ఆమె అనుమతి తీసుకోవడం ముందు షరతుగా ఉంటుంది. కానీ భారతదేశంలో దీన్ని చాలావరకు పరిగణించరు. ఇది మన కుటుంబ, విద్యా వ్యవస్థకు పెద్ద సవాలు. మన సమాజం, జాతిలోని ఈ బలహీనతను మనం అంగీకరించాలి, ఆ తర్వాతే నాగరిక ప్రవర్తనకు మారాలి.

ఈ సమస్యకు మరింత పోలీసింగ్, ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పులు మాత్రమే పరిష్కారం కాదు. రేపిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తే ఇది పోయేది కాదు. మన సంస్కృతిలోనే స్త్రీ వ్యతిరేక బూతు ప్రయోగాల సమస్య ఉన్నందున, ఇళ్లలో, బహిరంగ స్థలాల్లో స్త్రీ, పురుషుల సమాన హక్కులను పెంచి పోషించే సంస్కృతిగురించి మనం తప్పక ఆలోచించాలి. దీనికోసం ఇళ్లలో, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తిలో లేక స్కూల్‌లో, కాలేజీలో, ఆఫీసులో కనీసం మాటల్లో కూడా మహిళలను తిట్టని 'జీరో టాలరెన్స్' సంస్కృతికి పట్టం కట్టాలి. ప్రతి ఇంటిలో వాడుతున్న భాష తీరును ఇరుగుపొరుగులు పరిశీలిస్తుండాలి. ఇంట్లో కానీ, బయట కానీ ఎవరైనా బూతు భాషను వాడారంటే అలాంటి వారిని ఖండించి, అవమానపర్చాలి.

సామాజిక పరంగా అవమానాలకు గురికావడం, మహిళల దృఢ వైఖరి కారణంగా ఇప్పుడు గ్రామాల్లో కూడా ఆడవారిని లేక భార్యను కొట్టడం నుంచి మనం బయటపడుతున్నాం. అలాగని కుటుంబంలో, ఇంట్లో, బయట ఏ మహిళనూ మనదేశంలో ఎవరూ కొట్టలేదని దీని అర్థం కాదు. గతంతో పోలిస్తే మహిళలను చితకబాదడం తగ్గుముఖం పడుతోంది. అదేవిధంగా మహిళలను బూతులాడటం, రేప్ చేయడం, చంపడం వంటివి కూడా ఒక క్రమంలో తగ్గిపోతాయి. సమాజంలోని ప్రతి చోటా మహిళలను అమితంగా గౌరవించడాన్ని నేర్పినట్లయితే కొంతకాలానికి మహిళలను వేధించడం, హింసించడం పూర్తిగా తగ్గిపోతుంది కూడా.

చివరగా, కుటుంబం పాఠశాల, మత సంస్థలు, మార్కెట్ స్థలాలు అన్నీ కలిసి స్త్రీ, పురుషులు సమానులు అనే భావాన్ని పాటిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేటటువంటి సాంస్కృతిక విధానాలను పాటించాలి. ఏ ఇతర సంస్థల కంటే పాఠశాలకు ఈ అంశంలో మరింత అధిక పాత్ర ఉంది. స్త్రీల గౌరవాన్ని, శ్రమగౌరవాన్ని పెంచేటటువంటి సిలబస్‌ను రూపొందించాలి. మహిళల శ్రమ, వారి సృజనాత్మకతే జాతి పురోగమనానికి, అభివృద్ధికి కీలకం అని మన పిల్లలకు పాఠశాలల్లో బోధించనట్లయితే, భవిష్యత్తులో కూడా అత్యాచారాలు, వేధింపుల వంటి ఉపద్రవాలు మనల్ని పీడిస్తూనే ఉంటాయి. అందుకే స్త్రీ, పురుషుల సమానత్వం కోసం ఒక సాంస్కృతిక విప్లవాన్నే ప్రారంభిద్దాం రండి. దీనికోసం ఇంట్లో, స్కూల్లో, కాలేజీలో, ఆలయంలో, మసీదులో, చర్చిలో, ఆఫీసుల్లో, షాపుల్లో ప్రతిచోటా ఈ అంశంపై చర్చను ప్రారంభిద్దాం.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



## సోషల్ మీడియా


### రోగం



"మోదీ, షాలు ఒక భయానక విద్వేష విధానంతో దేశాన్ని ముక్కలు చేస్తున్నారు. మాలాంటి యువతరాన్ని పౌరసత్వ సవరణ బిల్లు భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఎందుకంటే ఇదే ప్రపంచంలో మేం నివసించాలి, ఇదే ప్రపంచానికి మేం చికిత్స చేయాలి. అది అంత సులువుగా అయ్యేది కాదు. ఈ ప్రభుత్వం చేపట్టిన జాతి ప్రక్షాళనకు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు మనందరం బాసటగా నిలవడం చాలా ముఖ్యం. పౌరసత్వ బిల్లును వ్యతిరేకించడమంటే దేశం కోసం, దాని లౌకిక విలువల కోసం నిలబడటమే"

– గుర్మెహర్ కౌర్, రచయిత్రి

### కృత్రిమం



"పౌరసత్వ సవరణ బిల్లు కృత్రిమమైనదని కాంగ్రెస్ నేత చిదంబరం అన్నారు. న్యాయమంత్రిత్వ శాఖ స్పందనను పార్లమెంట్‌లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సొలిసిటర్ జనరల్‌ను సభకు పిలిపించాలని కోరారు. ఈ బిల్లు గురించి ఎవరో ఒకరు బాధ్యతతీసుకోవాలని ఆయన అన్నారు"

– వసుధా వేణుగోపాల్, జర్నలిస్ట్

### మూలం



"రెండు దేశాల విధానానికి జిన్నా, ముస్లిం లీగ్ కారణమని నేను స్కూల్‌లో చదువుకున్న వామపక్ష వాదులు రూపొందించిన చరిత్రే చెబుతోంది. ఇప్పుడు కాంగ్రెస్ మాత్రం జిన్నాను కాదని సావర్కర్‌ను నిందిస్తోంది. సోనియా నేతృత్వంలోని కాంగ్రెస్ విషం కక్కడంలో చాలా దూరమే వెళుతోంది"

– అఖిలేష్ మిశ్రా, సీఈఓ

### పథకం



"పౌరసత్వ బిల్లుతో ఒకేసారి 1.5కోట్లమంది ప్రజలకు మేలు జరుగుతుంది. ఈ పథకం కొత్తగా వచ్చినవారి కోసం కాదు, ఇప్పటికే దేశంలో ఉన్నవారి కోసం. పౌరసత్వ సవరణ బిల్లు కారణంగా లబ్ధి పొందేవారిలో 60శాతం మంది పశ్చిమ బెంగాల్‌కు చెందినవారే"

– కార్తికేయ శర్మ, జర్నలిస్ట్

### పరిశీలన



"అప్పులు తీర్చనివారు పేదవారైతే దొంగలంటారు, అదే డబ్బున్న వాళ్లయితే ఎగవేతదారులంటారని నా పరిశీలనలో తేలింది"

– హర్షా గోయెంకా, ఛైర్మన్

### వలస



"ప్రపంచంలోని ఏ ప్రాంతం నుంచైనా భారత్‌కు వలస వచ్చిన ముస్లిం ఎవరు? పశ్చిమాసియా ముస్లింలు పాశ్చాత్య దేశాల వైపు వెళతారు. మలేషియా, ఇండోనేషియా వాళ్లు ఇండియా గురించి పట్టించుకోరు. కానీ, చాలామంది హిందువులు గల్ఫ్‌లో పనిచేస్తున్నారు. ఒకవేళ గల్ఫ్‌లోని దేశాలు పౌరసత్వం ఇస్తామంటే వాళ్లంతా అర్రులు చాస్తారు"

– ఇరేనా అక్బర్, కళాకారిణి

### కూల్చివేత



"ఇండో–జపాన్ సదస్సు ప్రారంభోత్సవం కోసం అస్సాం సచివాలయంలో ఏర్పాటు చేసిన వేదికను ఆందోళనకారులు కూల్చివేశారు. నిరసనకారుల సంఖ్య పెరుగుతోంది. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కార్మికులంతా నినాదాలు చేస్తున్నారు"

– అను భూయాన్, జర్నలిస్ట్

# ఆర్థిక సంక్షోభానికి విరుగుడు వ్యవసాయమే

అభిప్రాయం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

**డి**సెంబర్ 3న జరిగిన వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ''మనిషి జీవితంలో, దేశాభివృద్ధిలో వ్యవసాయం ప్రాముఖ్యత'' అనే అంశంపై జరిగిన విస్తృతమైన చర్చల్లో పలు మౌలిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ముఖ్యంగా, నేడు ప్రతి మనిషి తన జీవితంలో వ్యవసాయానికి ఉన్న స్థానాన్ని, ప్రాముఖ్యతను గుర్తించగలుగుతున్నాడా? తమ ఆహార భద్రత వ్యవసాయంతోనే ముడిపడి ఉందన్న వాస్తవం ఎంతమంది ప్రజలకు తెలుసు? వ్యవసాయ ప్రాముఖ్యతను ప్రభుత్వాలే విస్మరిస్తున్నప్పుడు.. ప్రజలను తప్పుపట్టాల్సిన అవసరం ఉందా? అనే ప్రశ్నలు చర్చనీయాంశం అయ్యాయి.

నేటికీ 70% మందిపైగా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడే అతిపెద్ద రంగం వ్యవసాయమని.. ఇందులో పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, అవగాహన ఉన్న వారు కొంతమందే. కొన్ని దేశాల్లో వ్యవసాయ విద్యకు ఉన్న డిమాండ్ ఇతర రంగాల్లోని విద్యకు లేదు. వివిధ పంటలపై పరిశోధన, నూతన వంగడాల వృద్ధి, చిరుధాన్యాలసాగు, నూనెగింజల పరిశోధన, అభివృద్ధి.. మొదలైన అంశాలలో పుష్కలమైన అవకాశాలు ఇక్కడి విద్యార్థులకు కూడా ఉన్నాయి. కానీ, వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకునే సాహసం చాలామంది చేయడం లేదు.

ప్రైవేటీకరణ, ఉదారవాద విధానాలు, ప్రపంచీకరణల మేలు కలయికగా చెప్పబడే ఈ నయా ఉదార ఆర్థిక విధానాలు దేశంలో మొదలైన క్షణం నుంచే వ్యవసాయ రంగానికి పెను సవాళ్లు మొదలయ్యాయి. సన్న, చిన్నకారు రైతాంగం నడ్డి విరగడం మొదలైంది అప్పుడే. రైతాంగానికి ఇన్‌పుట్స్ అందించడంలో ప్రభుత్వ చొరవ తగ్గింది. పారిశ్రామికాభివృద్ధి పేరుతో వ్యవసాయోగ్యమైన భూములను రైతుల నుండి బలవంతంగా సేకరించి పారిశ్రామిక వేత్తలకు కారు చౌకగా కట్టబెట్టడం ఆర్థిక సంస్కరణల్లో ప్రధాన ఎజెండాగా మారింది. దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయరంగం వాటా క్రమేపీ 14 శాతానికి దిగజారింది. వ్యవసాయాభివృద్ధి రేటు ఇతర రంగాల కంటే కనిష్టంగా నమోదు కావడం 1995 తర్వాత ఎక్కువైంది.

బ్యాంకింగ్ రంగంపై అంతకుముందున్న నియంత్రణ సడలిపోవడంతో జాతీయ బ్యాంకులు సైతం తమ సామాజిక బాధ్యత నుండి వైదొలగాయి. చిన్న, సన్నకారు రైతులకు రుణాలు అందించడం తగ్గించి.. పారిశ్రామిక వేత్తలకు నామమాత్రపు షూరిటీపై వందలకోట్ల రుణాలు ఉదారంగా అందించడం, పర్యవసానంగా వారు వేలకోట్ల రూపాయలు బ్యాంకుకు ఎగనామం పెట్టడం పరిపాటి య్యింది. దీంతో, గ్రామీణ ప్రాంత రైతాంగం విధిలేని పరిస్థితుల్లో అధిక వడ్డీపై అప్పులు చేస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల్లో భాగంగా ఏర్పాటైన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)తో 1995లో చేసుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు దేశ వ్యవసాయరంగాన్ని సంక్షోభ స్థాయికి చేర్చాయి. దేశంలోకి ఆహార ధాన్యాలతోపాటు హార్టికల్చర్, వంటనూనెలు, డెయిరీ, ఫిషరీస్ ఉత్పత్తులు కూడా దేశంలోకి కుప్పలుతెప్పలుగా వచ్చి పడటం మొదలైంది. ఎగుమతుల అవకాశాలు పెరుగుతాయని మభ్యపెట్టినప్పటికీ.. అటువంటి అవకాశాలు దేశ రైతాంగానికి దక్కలేదు.

మరోపక్క సేంద్రియ ఎరువుల వాడకాన్ని తగ్గించి అధిక ఉత్పత్తి కోసం పంటపొలాల్లో హానికర రసాయనిక



ఎరువులు, నియంత్రణ లేకుండా పురుగు మందుల్ని వినియోగించే విధానాలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం పెరిగింది. ఫలితంగా భూసారం తగ్గిపోయింది. పర్యావరణ సమస్యలు ఎక్కువయ్యాయి. వీటన్నింటి కారణంగానే.. గత 10 సంవత్సరాలలో దేశంలో 3,50,000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా.. ఆర్థిక సంస్కరణలు మొదలైన 1991 నుండి నేటి వరకు దేశంలో దాదాపు 8 లక్షల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

ఈ సందర్భంలో 'వ్యవసాయం దండగకాదు.. పండుగ' అని చాటిచెప్పి, రైతులలో భరోసా నింపిన ఏకైక నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. 2003లో వైఎస్ చేపట్టిన పాదయాత్రలో.. వ్యవసాయ రంగానికి 9 గంటలు ఉచిత విద్యుత్ వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక నిలుపుకొన్నారు. నాటి నుంచి నేటివరకు వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అన్నది ఆక్సిజన్‌లా పనిచేస్తూనే ఉంది. 6 నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా కేంద్రం అందించే నగదుకు తోడుగా ప్రకటించిన 'వైఎస్సార్ రైతు భరోసా' ఓ వినూత్న పథకం. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇంటర్ మినిస్టీరియల్ కమిటీని ఏర్పాటు చేసి రైతాంగానికి ఏడు మార్గాల ద్వారా రైతులకు ఆదాయం అందించడంపై దృష్టి పెట్టింది.

అనేక కోణాల నుంచి ముప్పేటన దేశాన్ని ఆవరించిన ఆర్థిక మాంద్యం దేశ ప్రజలకు శరాఘాతమే. దీన్ని అధిగమించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా తమవంతు సామాజిక బాధ్యతగా వ్యవసాయ రంగంలో విరివిగా పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. క్యూబాలో సంక్షోభం ఏర్పడినప్పుడు వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. ఎంత చిన్న స్థలం ఉన్నా.. ఆహార పంటలను, కూరగాయలను, పండ్లను పండించడం మొదలుపెట్టారు. తమ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా.. సహకార పద్ధతిలో ఇచ్చిపుచ్చుకోవడం, మిగులును మార్కెట్‌లో అమ్మి లాభాలను పంచుకోవడం చేశారు. జపాన్‌లో కూడా ఇదే విధానంలో రెండో ప్రపంచ యుద్ధం మిగిల్చిన విషాదాన్ని అధిగమించి తొలినాళ్లలో వ్యవసాయరంగం ద్వారానే తమ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసుకున్నది. ప్రజా భాగస్వామ్యంతో వ్యవసాయం అనే విధానం క్రమంగా అనేక దేశాలకు విస్తరించింది. పొలం నుంచి పళ్లెం వద్దకు అనే ప్రాతిపదికపై సీఎస్ఏ (కమ్యూనిటీ సపోర్టెడ్ అగ్రికల్చర్)లు పనిచేస్తున్నాయి. ఈ విధానాన్ని దేశంలో పెద్ద ఎత్తున అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించాలి. పౌర సమాజం భాగస్వామ్యం వహించాలి. ఆర్థిక మాంద్యం తట్టుకోవడానికి వ్యవసాయాన్ని ఆలంబనగా చేసుకోవాలి.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, కేంద్ర మాజీ మంత్రి, చీఫ్ విప్, ఏపీ శాసనమండలి

## బాలల 'తరలింపు' అరికడదాం

**వి**ద్యాబుద్ధులు నేర్చుకొని దేశానికి భావి పౌరులై, సమాజానికి దిక్సూచిగా ఉండాల్సిన పిల్లలు అక్రమ తరలింపుదారుల చెరలో బాల కార్మికుల వేశ్యా వాటికల్లో, అక్రమ మాదక ద్రవ్యాల రవాణాదారుల చేతుల్లో బాల్యాన్ని కోల్పోతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని పసిపిల్లలు తల్లి పొత్తిళ్లలోంచి మాయమై ముఠాల మధ్యనే పెరిగి తల్లిదండ్రులు ఎవరో తెలియక చీకటి బతుకులు గడుపుతున్నారు. భారతదేశంలో అత్యధిక శాతం ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి పిల్లల అక్రమ తరలింపు ముఠాల చేతుల్లో చిక్కుతున్నట్లు నేర పరిశోధన సంస్థల గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి ఎంతవరకు చేరిందంటే ఒక లక్షా ముప్పై ఐదువేలమంది పిల్లలు అక్రమ తరలింపునకు గురవుతున్నట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి. పిల్లల అక్రమ తరలింపులో బిహార్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ ఉండగా.. జాతీయ స్థాయిలో 38 శాతం పిల్లల అక్రమ తరలింపులో అస్సాం రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. ఈ అక్రమ తరలింపునకు జాతీయ స్థాయిలో కారణాలు వెతుక్కుంటే అంతర్జాతీయ అక్రమ దత్తత, అవిద్య, జనన మరణాల నమోదు సరిగ్గా లేకపోవడం, దుర్భర దారిద్ర్యం, అవగాహనా లేమి కారణాలుగా చెప్పుకుంటున్న పిల్లల్ని సులభంగా తరలించేందుకు అనుకూలంగా ఉండటం, పిల్లలు వ్యతిరేకించకపోవటం, పేదరికంలో ఉన్న తల్లిదండ్రులకు సంపాదనా మార్గంగా ఉండటం ఇత్యాది కారణాలతో అక్రమ తరలింపునకు నిరాఘాటంగా సాగిపోతోంది.

పిల్లల అక్రమ తరలింపును అరికట్టాలంటే ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వే తదితర రవాణా వ్యవస్థల్లో పటిష్టమైన భద్రత ఉండటంతో పాటు పుట్టిన ప్రతి చిన్నారి జననం నమోదై, ఆ జననంపై ప్రభుత్వ వ్యవస్థల నిఘాతో పాటు ఆరు సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ పాఠశాలలో చేరేటట్టు చూడటం పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాలల రక్షణ యూనిట్లు, కార్మిక శాఖ, పిల్లల సంక్షేమ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తే పిల్లల అక్రమ తరలింపును అరికట్టవచ్చు.

(నేడు అంతర్జాతీయ బాలల అక్రమ రవాణా నిరోధక దినం సందర్భంగా)

అచ్యుతరావు, గౌరవ అధ్యక్షులు, బాలల హక్కుల సంఘం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



**శశికళ సిన్హా**
భారత రక్షణ రంగానికి కలికి తురాయి వంటి అడ్వాన్స్‌డ్ ఏరియా డిఫెన్స్ ప్రాజెక్టు డైరెక్టర్. డీఆర్‌డీవో ఔట్‌స్టాండింగ్ సైంటిస్ట్



**జ్యోత్స్న ధవన్**
హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ సీనియర్ శాస్త్రవేత్త. దేశంలో అంతరిక్ష ప్రయోగాలకు బాటలు వేసిన దిగ్గజ శాస్త్రవేత్త సతీశ్ ధవన్ కుమార్తె కూడా!



**మంజులా రెడ్డి**
హైదరాబాద్‌లోని సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త. ఈ ఏటి ఇన్ఫోసిస్ అవార్డు గ్రహీత



**సౌమ్య స్వామినాథన్**
ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త.

# సమాజం మారాలి సర్



**డాక్టర్ రేణూ స్వరూప్:**
భారత బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి

**శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలంటే వారిపట్ల సమాజపు ఆలోచనా ధోరణి, ప్రభుత్వ విధానాల్లోనూ మార్పులు అత్యవసరమని పద్మశ్రీ ఎం.రోహిణి గోడ్‌బోలే అంటారు. "సమాజంలో పైకి తెలియకుండానే మహిళలపట్ల ఒక రకమైన వివక్ష ఉంటుంది. కొన్ని పనులు మహిళలు చేయలేరని, కొన్నింటికి మాత్రమే వారు పరిమితం అని సమాజం భావిస్తుంటుంది. ఈ ధోరణి మారాలి" అని ప్రొఫెసర్ రోహిణి అన్నారు. బుధవారం ఇండియన్ విమెన్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూఎస్‌ఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్)లో పద్నాలుగవ త్రైవార్షిక జాతీయ సదస్సు ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ప్రొఫెసర్ రోహిణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తనను కలిసిన 'సాక్షి'తో ఆమె ముచ్చటించారు.**



**శారదా శ్రీనివాసన్:**
ఈ ఏడాది పద్మశ్రీ అవార్డు గ్రహీత, బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ అధ్యాపకురాలు.

పరిశోధన, అభివృద్ధి రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న ఆలోచన కేవలం వారి సాధికారత కోసం లేదా దయతో చేయాల్సిన పని కాదు. మెరుగైన సైన్స్ కోసమే ఇది జరగాలి.

* * *

"మహిళా శాస్త్రవేత్తగా గుర్తింపు వచ్చేందుకు, తగిన అవార్డులు లభించేందుకు ఆలస్యం జరుగుతోంది"

పిల్లల పెంపకం ఒక్క తల్లి బాధ్యతగా మాత్రమే కాకుండా.. తల్లిదండ్రులు / అత్తమామలూ చేయూత ఇవ్వడం ద్వారా మహిళలు శాస్త్ర రంగంలో మరింత ముందుకు ముందుకు వెళ్లే అవకాశం ఉందని ప్రొఫెసర్ రోహిణి అభిప్రాయపడ్డారు. ''ప్రభుత్వ విధానాల్లోనూ మహిళల శక్తియుక్తులను వినియోగించుకునేందుకు తగినట్టుగా కొన్ని మార్పులు కూడా అవసరమే. దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో చదువుకుంటున్న, బోధిస్తున్న మహిళలు చాలామందే ఉన్నప్పటికీ... పరిశోధన, అభివృద్ధి సంస్థల్లో, కంపెనీల్లోనూ ఉన్నతస్థానాల్లో ఉన్న వారు తక్కువే.



**సంఘమిత్ర బందోపాధ్యాయ:**
ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్

భారత్‌లో సైన్స్ సబ్జెక్టులు చదువుతున్న మహిళలు కాలేజీ స్థాయిలో 40 శాతం మంది ఉంటే, యూనివర్శిటీ స్థాయికి వచ్చేసరికి ఇది 30 శాతానికి, పీహెచ్‌డీ స్థాయిలో 20 –22 శాతానికి తగ్గిపోతోంది. శాస్త్రవేత్తగా పనిచేస్తున్న వారి విషయానికి వస్తే ఇది మరీ తక్కువగా పదిశాతం మాత్రమే ఉంది'' అని ప్రొఫెసర్ రోహిణి చెప్పారు.

మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం అంత తప్పేమీ కాకపోవచ్చు. కాకపోతే మానవ మేధలో 50 శాతాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదన్నది అందరూ గుర్తించాలి. వైవిధ్యత అన్నది అన్ని రంగాల్లోనూ మంచిదే. ఇంటిని అత్యంత సమర్థంగా నిర్వహించగలిగిన మహిళ పరిశోధన రంగంలోనూ పూర్తిస్థాయిలో పనిచేసి ఉంటే మానవ శాస్త్ర విజ్ఞానం మరింత పురోగమించి ఉండేదేమో.

**పరిశోధన ఉద్యోగం కాదు. జీవితాంతపు విధి నిర్వహణ. కుటుంబాన్ని చక్కబెట్టుకుంటూనే ఉద్యోగ బాధ్యతల్ని సమర్థంగా చేపట్టడం ఈ రంగంలోని ఏ మహిళకైనా సవాలే. అసలే సమాజంలో పురుషాధిక్యత. అడుగడుగునా అననుకూలమైన పరిస్థితులు. సామర్థ్యం, ప్రతిభ ఉన్నప్పటికీ, వాటికి తగిన గుర్తింపు లభించడం ఓ గగన కుసుమం. అయితే ఇన్ని చిక్కుముళ్ల మధ్యలోనూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో తమదైన ముద్ర వేసిన మహిళామణులు ఎందరో..! వారిలో వీరు కొందరు.**

### ఒకటే కారణం కాదు

''పెళ్లి, కుటుంబ బాధ్యతలు, ఇంట్లోని వృద్ధుల ఆలనపాలన వంటి విషయాల కోసం మహిళా శాస్త్రవేత్తలు తమ వృత్తిని వదిలేసుకుంటున్నారనే భావన కూడా సమాజంలో నెలకొని ఉంది. కానీ వీటితో పాటు చాలా ఇతర కారణాలూ ఉన్నాయని ఇటీవలి సర్వే ఒకటి స్పష్టం చేస్తోంది. మహిళలు స్వేచ్ఛగా పని చేసేందుకు తగ్గ వాతావరణం సంస్థల్లో లేకపోవడం, మహిళల అవసరాలకు తగ్గ వెసులుబాట్లు కల్పించలేని విధానాలు, చదువుకున్న చదువుకు తగ్గ ఉద్యోగాలు లేకపోవడమూ కారణమే'' అని ప్రొఫెసర్ రోహిణి అంటారు.



**సీతా సోమసుందరమ్:**
ప్రోగ్రామ్ డైరెక్టర్, ఇస్రో సైంటిస్ట్



**ఎం.రోహిణి గోడ్‌బోలే**
**సెంటర్ ఫర్ హై ఎనర్జీ ఫిజిక్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరు**

## సైన్స్‌ను సమాజానికి చేరువ చేసేందుకు

పరిశోధనశాలల్లో ఎంత నిబద్ధతతో పరిశోధనలు చేసినా...శాస్త్ర విజ్ఞానాన్ని సమాజానికి చేరవేయకపోతే ప్రయోజనం లేదన్న ఆలోచన నుంచి పుట్టుకొచ్చింది ఇండియన్ విమెన్ సైంటిస్ట్ అసోసియేషన్ 1973 జూన్ 13న అప్పటి బాంబే ప్రస్తుత ముంబైలో రిజిస్టర్ అయిన ఈ సంస్థ అప్పటి నుంచి ఇప్పటివరకూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి శాస్త్రాన్ని చేరవేసే లక్ష్యంతో పలు కార్యకలాపాలు చేపట్టింది. వేర్వేరు శాస్త్ర రంగాలకు చెందిన 12 మంది వ్యవస్థాపక సభ్యుల ఏర్పాటుకు తొలి ఆలోచన చేయగా, రెండేళ్ల తరువాత ఐడబ్ల్యూఎస్‌ఏ సాకారమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐడబ్ల్యూఎస్‌ఏకు 11 శాఖలు ఉన్నాయి. మొత్తం రెండువేల మంది మహిళా శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్నారు. శాస్త్ర విజ్ఞానాన్ని సమాజానికి చేరువ చేయడం సంస్థ తొలి లక్ష్యమైతే... శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసేందుకూ పలు కార్యకలాపాలు చేపడుతుంది. మహిళా శాస్త్రవేత్తల విజయాలను ప్రోత్సహించడం, శాస్త్ర రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు సూచించడం తద్వారా మహిళా సాధికారతకు సాయపడటం కూడా సంస్థ లక్ష్యాల్లో కొన్ని. ఈ లక్ష్యాల సాధన కోసం ఐడబ్ల్యూఎస్‌ఏ పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది. పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ముంబైలో 'లెర్నింగ్ గార్డెన్' పేరుతో పార్కును ఏర్పాటు చేయడం, ఏడాది కాలంలో సుమారు 17 వేల మంది పిల్లలు ఈ పార్కును సందర్శించడం ఐడబ్ల్యూఎస్‌ఏ సాధించిన ఒక ఘనత మాత్రమే. దీంతోపాటు మహిళా శాస్త్రవేత్తల కోసం ఒక వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, పిల్లల కోసం డే కేర్ సెంటర్, నర్సరీ స్కూల్, ఆరోగ్య కేంద్రం, లైబ్రరీ రీడింగ్ రూమ్ వంటి వసతులూ కల్పిస్తోంది. స్కాలర్‌షిప్పులు, అవార్డులు సరేసరి!

– గిళియార్ గోపాలకృష్ణ మయ్యా

## ప్రతిభకు పోషణ



**డాక్టర్ ఆర్. హేమలత**
డైరెక్టర్ ఎన్.ఐ.ఎన్.

''దేశం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ఎదగాలని ఆకాంక్షిస్తోంది. ఇది నెరవేరాలంటే కాబోయే తల్లులకు తగిన పోషకాహారం అందించడం ఎంతో కీలకం'' అని జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత తెలిపారు. ''మహిళల్లో సుమారు 50 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతూంటే సుమారు 20 శాతం మందికి తగినన్ని పోషకాలు అందడం లేదు. అదే సమయంలో 40 శాతం మంది మహిళలు ఊబకాయులు'' అని ఆమె వివరించారు. గర్భధారణ సమయంలో మహిళలు వంద గ్రాముల బరువు పెరిగితే పుట్టబోయే బిడ్డ.. జనన సమయ బరువు 20 గ్రాముల వరకూ పెరుగుతుందని, అలాగే గర్భధారణ సమయంలోనూ, బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకూ తగినంత మోతాదులో పోషకాలను పొందడం బిడ్డ ఎదుగుదలకు, భవిష్యత్తులో సాంక్రమిక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఎంతో కీలకమని డాక్టర్ హేమలత వివరించారు. అంతేకాకుండా పిండం ఏర్పడ్డ తొలినాళ్లలో తల్లిద్వారా తగినన్ని పోషకాలు అందకపోతే ఆ ప్రభావం కాస్తా బిడ్డ జీవక్రియలతోపాటు, జ్ఞాపకశక్తి, మెదడు పనితీరులపై కూడా దుష్ప్రభావం పడుతుందని తెలిపారు.

**బ్యూటిప్స్**

## ఆపిల్ ప్యాక్

- ఆపిల్ పై తొక్క తీసి, ముక్కలు కోసి, మిక్సర్‌లో వేసి గుజ్జు చేయాలి. దీంట్లో రెండు టీ స్పూన్ల తేనె, విటమిన్–ఇ క్యాప్సుల్ మిశ్రమం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ ముఖ చర్మాన్ని మృదువుగా మార్చుతుంది.



- సగం ఆపిల్ ముక్కను ఉడికించి గుజ్జు చేయాలి, అందులో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచి, తీసి, ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ ఫేస్ ప్యాక్ ముడతలను నివారిస్తుంది.



- సగం ముక్క ఆపిల్‌ను తరగాలి. రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్, టేబుల్ స్పూన్ కొబ్బరి పాలు కలిపి మెత్తగా నూరి మిశ్రమం తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసి మృదువుగా వేళ్లతో రాయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. కొబ్బరిపాలు లేదంటే మజ్జిగ కలుపుకోవచ్చు. ఈ ప్యాక్ పొడిబారిన చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

**చెట్టు నీడ**

## పుణ్యమంతా మీకేనా?

ఒకసారి రమణ మహర్షి ఆశ్రమంలో సోఫాలో విశ్రాంతి తీసుకుంటుండగా భక్తుల్లో కొందరు చొరవ తీసుకుని ఆయన పాదాలు వత్తుతూ ఆ భాగ్యానికి లోలోపల పరవశించసాగారు. మహర్షి పాదాలకు సేవ చేసుకోవాలని ప్రతి భక్తుడికీ కోరిక ఉండేది. అలా అయినా తమ పాపం పోయి, పుణ్యం దక్కుతుందని వారి విశ్వాసం.

అలా పాదసేవ జరుగుతుండంగా మధ్యలో రమణ మహర్షి భక్తులను వారించి ''కాసేపు మీరలా దూరంగా జరగండి'' అన్నారు. భక్తులంతా ఆశ్చర్యపోయి దూరంగా జరిగి కూర్చున్నారు.

రమణ మహర్షి ఒక్కసారి ముందుకు వంగి తన కాళ్ళను తానే నొక్కుకోవడం ప్రారంభించారు. అది చూసిన భక్తులు మరింత ఆశ్చర్యపోయి వారిలో వారే చెవులు కొరుక్కున్నారు.

ఉత్కంఠ ఆపుకోలేకపోయిన భక్తుల్లో ఒకడు ''అదేంటి స్వామీ.. మీ సేవకోసం తపించే మమ్మల్ని కాదని మీరే ఆ పని చేస్తున్నారు?'' అని ప్రశ్నించేసరికి మహర్షి నవ్వేసి ''పుణ్యమంతా మీకేనా? నాకు అక్కర్లేదా?'' అన్నారు. భక్తులకు ఏమి మాట్లాడాలో బోధపడలేదు.

– ఉమామహేశ్వర్

**మైండ్ స్టోరీ**

# కలత ఘటనల నుంచి కోలుకొని సాగిపోవాలి ముందుకు

**స్పందించడం మంచిదే. ఆరోగ్యకరమైన స్పందన ఉండాల్సిందే. కాని అతి స్పందన అవసరం లేదు. సమాజంలో జరుగుతున్న దారుణమైన ఘటనలకు అతిగా స్పందించి, అవి మనకే జరిగితే అని పదేపదే ఆలోచిస్తూ వ్యాకుల పడితే ప్రమాదం. ఈ దశను దాటాలి. భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథం ఉండాలి. కలత ఘటనల నుంచి ముందుకు సాగాలి. అలా సాగమని చెప్పేదే ఈ కథనం.**


ప్రతీకాత్మక చిత్రం

సృజనను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకొని వచ్చారు. ఆమెకు నలభై ఏళ్లుంటాయి. మనిషి కలతగా ఉంది. కన్నీరుగా ఉంది. ఉలికిపాటుగా ఉంది. అపనమ్మకంగా ఉంది. తనకేదో ప్రమాదం రాబోతున్నట్టుగా ఉంది.

'ఏమిటి సంగతి?' అని అడిగాడు సైకియాట్రిస్ట్ ఆమెను తీసుకొొచ్చిన భర్తని.

'వారం రోజులుగా తన పరిస్థితి బాగోలేదు డాక్టర్. ఒళ్లు హటాత్తుగా చల్లబడిపోతూ ఉంటుంది. అర్ధరాత్రి లేచి కూచుంటోంది. ఎప్పుడూ పక్కన మనిషి ఉండాలంటుంది. మాటిమాటికి వెళ్లి మా అమ్మాయి ఉన్న తలుపు తెరిచి అమ్మాయి లోపల ఉందా లేదా అని చూసి వస్తుంటుంది. దేనిమీదా ధ్యాస లేదు. ఎప్పుడూ టీవీ చూస్తూ ఉలికులికిపడుతుంటుంది. ఏమిటి నీ భయం అంటే ఏమీ చెప్పదు. మాకేం చేయాలో అర్థం కాక మీ దగ్గరకు తీసుకొొచ్చాము' అన్నాడు భర్త. ఆయన హైస్కూల్ టీచర్‌గా పని చేస్తున్నాడు.

'మీ అమ్మాయి వయసెంతా?' అని అడిగాడు సైకియాట్రిస్ట్.

'21 సంవత్సరాలు'

'ఏం చేస్తుంటుంది?'

'కొత్తగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరింది. షిఫ్ట్‌లుంటాయి. క్యాబ్ వచ్చి పికప్ చేసుకుంటుంది. ఇవాళ లీవ్ పెట్టి తోడొచ్చి బయట కూచొని ఉంది. తనకేం ప్రాబ్లం లేదు. తను బాగుంది. ఈమే'... అని ఆగాడు.

'సరే.. మీరెళ్లండి.. మాట్లాడతాను' అని చెప్పి పంపించాడు.

అతను వెళ్లాక సృజనను అడిగాడు – 'చెప్పండమ్మా.. ఎందుకిలా ఉన్నారు?'

'ఏమో డాక్టర్... నాకు భయంగా ఉంటోంది. నిద్రపోతే నలుగురు మనుషులు నా కూతురిని చుట్టుముట్టినట్టుగా అనిపిస్తోంది. లాక్కెళుతున్నట్టుగా కనపడుతుంది. ఒకటే భయం. నిద్ర లేచేస్తాను'

'ఎందుకలాంటి కలలొస్తున్నాయి?'

'ఈ మధ్య జరిగిన ఘటనను టీవీలో పదే పదే చూశాను. చాలా బాధ కలిగింది. పాపం ఆ అమ్మాయిని తీసుకెళ్లి అత్యాచారం చేసి చంపేశారు. ఆ తల్లిదండ్రుల దుఃఖం చూడలేకపోయాను. అలా టీవీ చూస్తూ ఉంటే సడన్‌గా నాకు ఏమిటోగా అనిపించింది. ఆ తల్లి స్థానంలో నేనున్నట్టుగా, ఆ అమ్మాయి స్థానంలో నా కూతురు ఉన్నట్టుగా అనిపించడం మొదలెట్టింది. అంతే. నా ఒళ్లంతా చెమటలు పట్టాయి. కన్ను తెరిచినా మూసినా అలాంటి నరకం నా కూతురికి ఎదురైతే నేనేం కావాలి అన్నదే నా భయం' అందామె.

'మీరు మీ బాల్యంలోగాని టీనేజ్‌లోగాని ఇలాగే ఏ విషయానికైనా కలత పడ్డారా?'

'పడ్డాను డాక్టర్. నేను ఎవరి కష్టాన్నీ గట్టిగా చూళ్లేను. ఒకవేళ చూస్తే ఆ కష్టం నాకే వచ్చినట్టు బాధ పడి ఇబ్బంది తెచ్చుకుంటాను' అందామె.

డాక్టర్ ఆమెకు మంచినీళ్లిచ్చాడు.

'చూడండమ్మా... మీకు పెద్ద జబ్బేమీ లేదు. కొంచెం సున్నితంగా ఉన్నారు. పెను ఘటనలు చూసినప్పుడు అవి నాలుగు రకాల మనుషుల మీద ప్రభావం చూపిస్తాయి. సెన్సిబుల్ పర్సనాలిటీస్, డిపెండెంట్ పర్సనాలిటీస్, యాంగ్జియస్ పర్సనాలిటీస్, డిప్రెసివ్ పర్సనాలిటీస్... ఈ నాలుగు రకాల్లో మీరు ఏదో ఒక రకం అయి ఉండాలి. 'దిశ'లాంటి ఘటనలు జరిగినప్పుడు పౌరులుగా మనం స్పందించాలి. మార్పు జరగాలని ఆశించాలి. అది కరెక్ట్. కాని తీవ్రంగా దాని గురించే ఆలోచిస్తూ అనుక్షణం అదే బుర్రలో నింపుకోవడం సరికాదు. ఫస్ట్ మీరు రిలాక్స్ కండి. ఊహించని చెడు ఘటనలు, ప్రమాదాలు, వైపరీత్యాలు అనాదిగా జరుగుతున్నాయి అని గుర్తు చేసుకోండి. మనం ఎంత ప్రయత్నం చేయాలి, ఎంత జాగ్రత్తలో ఉండాలి, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామా లేదా చెక్ చేసుకొని ముందుకు సాగిపోవాలి. అంతే తప్ప అక్కడే ఆగిపోకూడదు' అని బెల్ నొక్కాడు.

భర్త, కూతురు లోపలికి వచ్చారు.

'చూడండి.. ముందు మీ భార్యను మాట్లాడనివ్వాలి. ఆమె చెప్పేది మీరు పదే పదే వినాలి. ఆమె దేనికి భయపడుతోందో దానికి వెంటిలేషన్ ఇవ్వాలి. కసరొద్దు. ఆపు అనొద్దు. అదంతా మాట్లాడి మాట్లాడి ఖాళీ అయిపోవాలి. అప్పుడు మీరు ఆమెకు ధైర్యం మాటలు మాట్లాడాలి. ఆమెను నార్మల్‌గా ఉంచాలి. పాజిటివ్ విషయాలను చూపించాలి. పాటలు వినిపించాలి. ఆమెకు ఏదైనా వ్యాపకం ఉంటే అందులో బిజీగా ఉంచాలి. ఒకటి రెండు మందులు రాస్తాను అవి కూడా సాయం చేస్తాయి.' అన్నాడు డాక్టర్.

ఆ తర్వాత సృజనతో మళ్లీ అన్నాడు.

'సృజనగారూ... రాక్షసులు ఎప్పుడూ ఉన్నారు. కాని వారి సంఖ్య చాలా తక్కువ. మరి దేవతలు? ముక్కోటిమంది ఉన్నారని మర్చిపోకండి. ఎందుకు చెప్తున్నానంటే చెడు కంటే ఎప్పుడూ మంచి శాతమే ఎక్కువగా ఉంటుంది. మంచి తనను తాను కాపాడుకుంటుంది. మీకూ మీ అమ్మాయికి ఎప్పుడూ ఏమీ కాదని మనస్ఫూర్తిగా అనుకోండి. ఇప్పటికే మీ అమ్మాయి తన హ్యాండ్‌బ్యాగ్‌లో పెప్పర్ స్ప్రే పెట్టుకొని తిరుగుతోంది. తన ఫోన్ డిస్‌ప్లేలో పోలీస్ నంబర్‌ను క్విక్ డయల్‌గా పెట్టుకుని ఉంది. ఇంకేం భయం చెప్పండి' అని నవ్వించే ప్రయత్నం చేశాడు.

ఆమె మెల్లమెల్లగా తేరుకోవడం కనిపించింది. ఎవరైనా చేయాల్సింది అదే. తేరుకుని ముందుకు సాగడం.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**
ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి**, సైకియాట్రిస్ట్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 12-12-2019


శ్రుతిహాసన్

# కొబ్బరికాయ కొట్టారు


మీనా, రజనీకాంత్, ఖుష్బూ

కొత్త సినిమాకు కొబ్బరికాయ కొట్టారు రజనీకాంత్. శివ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో రజనీ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. మీనా, ఖుష్బూ కీలక పాత్రల్లో నటించనున్నారు. కీర్తీ సురేశ్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా ముహూర్తం బుధవారం జరిగింది. 28 ఏళ్ల తర్వాత రజనీకాంత్ సినిమాలో ఖుష్బూ నటించనుండటం విశేషం. అలాగే ఖుష్బూ తమిళ సినిమాలో కనిపించి దాదాపు పదేళ్లు కావస్తోంది. ఈ నెల రెండోవారంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుందని సమాచారం.

# నా జీవితంలో ఆ రెండూ ప్లాన్ చేయకుండా జరిగినవే!


నాగచైతన్య

‘‘జీవితంలో మనకు ఎదురయ్యే వైఫల్యాలే మనకు ఎక్కువ పాఠాలు నేర్పుతాయి. నేనూ చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ కొన్నిసార్లు తప్పులు జరుగుతుంటాయి. అప్పుడు నా నిర్ణయ లోపం ఎక్కడ ఉందో పరిశీలించుకుంటాను. నటుడిగా నన్ను మరింత మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తాను. సినిమా విడుదల సమయంలో సోషల్ మీడియా కామెంట్స్‌ని పట్టించుకుంటాను. కొన్ని ప్రతికూల వ్యాఖ్యలు చూస్తుంటాను. కానీ ఆ విమర్శలను కూడా సానుకూలంగా తీసుకుని ముందుకు వెళ్లినప్పుడే లైఫ్ బాగుంటుంది’’ అన్నారు నాగచైతన్య. కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో వెంకటేష్, నాగచైతన్య హీరోలుగా నటించిన చిత్రం ‘వెంకీమామ’. ఇందులో పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలుగా నటించారు. డి. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

- భీమవరంలో మొదలైన ఈ కథ కశ్మీర్‌లో ముగుస్తుంది. కాలేజ్ సెలవుల్లో నేను భీమవరం వెళ్లినప్పుడు వెంకీమామతో నా సందడి మొదలవుతుంది. ఈ సినిమాలో ఆర్మీ ఆఫీసర్ పాత్ర చేశాను.
- ఈ సినిమాలో కెమెరా వెనకాల సురేష్ మావయ్య, కెమెరా ముందు వెంకటేష్ మావయ్య నుంచి చాలా విషయాలు తెలుసుకున్నాను. వెంకటేష్ మావయ్యకు ‘నో హేటర్స్, నో నెగటివ్స్’ అని అందరూ అంటుంటారు. అలా ఎందుకు అంటారో నాకు సెట్‌లో అర్థమైంది. వెంకటేష్ మావయ్య ఆయన కామెడీ టైమింగ్‌ను మ్యాచ్ చేయడం కష్టం. సురేష్‌మావయ్య, వెంకటేష్ మావయ్య ప్రణాళిక ప్రకారం అన్నీ జరగాలనుకుంటారు. లేకపోతే కోపం వస్తుంది. ఆ కోపం అప్పటి పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.
- సురేష్‌మావయ్య కథలు వినమని అప్పుడప్పుడు స్క్రిప్ట్స్ పంపిస్తుంటారు. నేను వింటుంటాను. కానీ సురేష్ ప్రొడక్షన్స్‌లో సినిమా చేసే అవకాశం ఎందుకో ఇప్పటివరకు కుదర్లేదు. ఇప్పుడు ‘వెంకీమామ’తో కుదిరింది. ఇందులో వెంకటేష్ మావయ్యతో కూడా కలిసి చేశాను. ఇలా ఒకేసారి, ఒకే ఏడాది ఈ రెండూ జరిగాయి. కానీ ఇది ప్లాన్ చేసింది కాదు. అలా జరిగిపోయిందంతే. నా జీవితంలో పెళ్లి, ‘వెంకీమామ’ ప్లాన్ చేసినవి కాదు.
- ‘వెంకీమామ’ మల్టీస్టారర్ కాదనే నా అభిప్రాయం. వెంకటేష్‌గారితో కలిసి నేను ఓ క్యారెక్టర్ చేశానంతే. ఈ కథకు నేను ప్లస్ కాదు. ఈ కథే నాకు ప్లస్ అనుకుంటున్నాను. ఈ సినిమాలో విలన్స్ లేరు. పరిస్థితులు, జాతకాల ప్రభావం సినిమాలో పాత్రలపై ప్రతికూలతలను చూపిస్తున్నట్లు కనిపిస్తుంది.
- సినిమా నేను రఫ్‌గా మొత్తం చూశాను. బాగుంది. సమంత (నాగచైతన్య భార్య) కూడా చూసింది. బాగుందని చెప్పింది. ఈ సినిమానే కాదు నా ప్రతి సినిమా గురించి తన అభిప్రాయం నిర్మొహమాటంగా చెబుతుంది. నేనూ తన సినిమాలకు అంతే చెబుతాను.
- ఈ సినిమా కథను నాన్నగారు (నాగార్జున) వినలేదు. సురేష్‌మామ పంపిన కథ విని నేనే ఓకే చేశాను. నాన్నగారితో (సోగ్గాడే చిన్ని నాయనా సీక్వెల్ గురించి ప్రస్తావిస్తూ) చేయాల్సిన ప్రాజెక్ట్‌కు ఇంకా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. నాన్నగారు, వెంకటేష్ మామలో ఉన్న కామన్ పాయింట్ ఏంటంటే ఇద్దరూ కామ్ పర్సనాలిటీస్. కానీ నిర్ణయాలు మాత్రం చాలా వేగంగా తీసుకుంటారు.
- నేను డైరెక్టర్స్ యాక్టర్‌ని. ఒకసారి స్క్రిప్ట్ లాక్ అయిన తర్వాత డైరెక్టర్ చెప్పింది చేసుకుని వెళ్తుంటాను. అనుభవం ఉన్న దర్శకులు అయితే నా నుంచి మరింత నటనను రాబట్టుకోగలరని నా అభిప్రాయం. కొత్త దర్శకులు అయితే నన్ను మరో టేక్ చేయమని చెప్పడానికి మొహమాట పడొచ్చు. అలా యాక్టింగ్ పరంగా నాకు తెలియకుండానే నేను రాజీపడాల్సి వస్తుందేమో. అందుకే కెరీర్‌లో రెండుమూడు మంచి హిట్స్ సాధించిన తర్వాత కొత్త దర్శకులతో సినిమాలు చేస్తాను. కొత్త దర్శకులు డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. కొంతకాలం అనుభవం ఉన్న దర్శకులతోనే సినిమాలు చేయాలనుకునే నా ఆలోచన నాకొక బలహీనత కూడా కావొచ్చు.
- శేఖర్‌కమ్ములగారి దర్శకత్వంలో చేస్తున్న ‘లవ్ స్టోరీ’ (వర్కింగ్ టైటిల్) చిత్రీకరణ 40 శాతం పూర్తయింది.

# శ్రుతి కుదిరిందా?

చిన్న బ్రేక్ తర్వాత వరుస సినిమాలు అంగీకరిస్తున్నారు శ్రుతీహాసన్. రవితేజతో ‘క్రాక్’ సినిమా చేస్తున్నారామె. ఇపుడు మరో పెద్ద సినిమాలో కూడా కనిపించబోతున్నారని సమాచారం. ‘సరిలేరు నీకెవ్వరు’ తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ సినిమా చేయనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రుతీహాసన్ పేరుని పరిశీలిస్తున్నారట దర్శకుడు వంశీ పైడిపల్లి. గతంలో ‘శ్రీమంతుడు’ సినిమాలో మహేశ్‌బాబు, శ్రుతీహాసన్ జోడీగా నటించిన విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అలాగే వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించిన ‘ఎవడు’ సినిమాలోనూ శ్రుతీహాసనే హీరోయిన్. వచ్చే ఏడాది వేసవి తర్వాత సెట్స్ మీదకు వెళ్లనున్న ఈ చిత్రంలో మహేశ్, శ్రుతీ రెండోసారి జోడీ కడతారా? వేచి చూడాలి.

# మా సినిమాను ఆపాలనుకున్నవారి పేర్లు బయటపెడతా


రామ్‌గోపాల్ వర్మ

‘‘మా ‘అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు’ సినిమాని ఆపడానికి చాలామంది ప్రయత్నించారు. ఎవరెవరు ఆపడానికి ప్రయత్నించారో వారి వివరాలన్నీ త్వరలోనే బయటపెడతా. సినిమా ఆపడానికి ప్రయత్నించినవారిపై పరువు నష్టం దావా కూడా వేస్తాం. 2019 మే నుంచి సెప్టెంబర్ మధ్యలో జరిగిన సంఘటనల ఆధారంగానే ఈ సినిమా తీశాం. ఇదంతా ఫన్నీగా ఉంటుంది’’ అన్నారు రామ్‌గోపాల్ వర్మ. ప్రస్తుతం ‘ఎంటర్ ది గర్ల్ డ్రాగన్’ సినిమా పనుల నిమిత్తం చైనాలో ఉన్నారు వర్మ. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆన్‌లైన్ ద్వారా ఆయన పై విధంగా మాట్లాడారు. రామ్‌గోపాల్ వర్మ తన టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై అందిస్తున్న చిత్రం ‘అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు’. రామ్‌గోపాల్ వర్మతో కలసి సిద్దార్థ తాతోలు దర్శకత్వం వహించారు. టి.అంజయ్య సమర్పణలో అజయ్ మైసూర్, టి. నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మించిన ఈ చిత్రానికి నట్టి క్రాంతి, నట్టి కరుణ సహ నిర్మాతలు. వర్మ ఆన్‌లైన్ ప్రసంగం ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాతలు నట్టికుమార్, అంజయ్య మాట్లాడుతూ – ‘‘మా సినిమా ప్రపంచ వ్యాప్తంగా 1200 థియేటర్లలో గురువారం విడుదల కాబోతోంది. ఈ సినిమా విడుదల కోసం 15 రోజులుగా యుద్ధం చేశాం. ఆ యుద్ధంలో విజయం సాధించాం. సినిమాని ఆపడానికి ఎవరు ప్రయత్నించారో గురువారం మధ్యాహ్నానికల్లా ప్రతి ప్రేక్షకుడి ఊహకు తెలుస్తుంది. ఆపాలని ప్రయత్నించిన వారిపై వర్మ చెప్పినట్లుగానే పరువు నష్టం దావా వేస్తాం. ఈ సినిమాకు హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సెన్సార్ బోర్డ్ యు/ఎ సర్టిఫికెట్‌ను ఇచ్చింది’’ అన్నారు.

# అయ్యప్ప కటాక్షంతో...


వి.యస్.పి. తెన్నేటి, రుద్రాభట్ల వేణుగోపాల్, ఎ.జ్యోతి

సుమన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం ‘వీరశాస్త అయ్యప్ప కటాక్షం’. ఎ. జ్యోతి, రమాప్రభ, ఆకెళ్ల, చలపతి, మాస్టర్ హరీంద్ర, అశోక్ కుమార్ ముఖ్యపాత్రధారులు. రుద్రాభట్ల వేణుగోపాల్ దర్శకత్వం వహించారు. నటుడు సుమన్ కెరీర్‌లో ఇది నూరవ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాకు కథ,స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు అందించిన వి.యస్.పి. తెన్నేటి, టి.ఎస్. బద్రీష్ రామ్‌తో కలిసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. వేణుగోపాల్ మాట్లాడుతూ– ‘‘ఒక సినిమా పూర్తి కావాలంటే అద్భుతాలు జరగాలంటుంటారు. అలాంటివి ఈ సినిమాకు జరిగాయి. అయ్యప్పకటాక్షం వల్లే ఈ సినిమాను త్వరగా పూర్తి చేసి రిలీజ్ చేస్తున్నామనిపిస్తోంది’’ అన్నారు. ‘‘ఇరవై ఏళ్లకు పైగా అయ్యప్ప దీక్ష చేస్తున్నాను. అయ్యప్ప దీక్ష ఎలా చేయాలి? అయ్యప్ప దీక్ష చేసేవారు నలుపు రంగు దుస్తులే ఎందుకు వేసుకోవాలి? కాషాయ రంగు వస్త్రాలు ధరించి కూడా దీక్ష చేయవచ్చా? ఎలా క్రమశిక్షణగా ఉండాలి? అనే ఇలాంటి చాలా అంశాలకు ఈ సినిమాలో వివరణలు ఇచ్చాం’’ అన్నారు వి.యస్. పి. తెన్నేటి.

# క్లాస్.. మాస్ అశ్వత్థామ


షాలినీ పాండే


బుజ్జి, శంకర్‌ప్రసాద్, ఉషా ముల్పూరి, రమణ తేజ

‘‘సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘అశ్వథ్థామ’. మా అబ్బాయి నాగశౌర్య మంచి కథ రాశాడు.. దాన్ని డైరెక్టర్ చక్కగా తెరకెక్కించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి’’ అన్నారు నిర్మాత ఉషా ముల్పూరి. నాగశౌర్య, మెహరీన్ జంటగా నూతన దర్శకుడు రమణ తేజ తెరకెక్కించిన చిత్రం ‘అశ్వథ్థామ’. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మించిన ఈ సినిమా జనవరి 31న విడుదల కానుంది. శంకర్ ప్రసాద్ ముల్పూరి మాట్లాడుతూ– ‘‘అటు క్లాస్ ఇటు మాస్ ఆడియన్స్‌ని అలరించాలనే ఉద్దేశంతో ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాల్ని కాస్త ఎక్కువగానే తీశాం. ‘కేజీఎఫ్’ సినిమాకి ఫైట్స్ కంపోజ్ చేసిన అన్బు–అరివు మా సినిమాకి పనిచేశారు. ఈ సినిమాలో కొత్త నాగశౌర్యను చూస్తారు’’ అన్నారు. ‘‘నాకు ఈ అవకాశం ఇచ్చిన ఐరా క్రియేషన్స్ వారికి థ్యాంక్స్. నన్ను నమ్మి దర్శకత్వ బాధ్యతలు అప్పగించిన నాగశౌర్యకి కృతజ్ఞతలు. మా సినిమా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా’’ అన్నారు రమణ తేజ. ‘‘అనుకున్న టైమ్‌లో సినిమాను పూర్తి చేశాం. మేం అనుకున్న దానికంటే ఔట్‌పుట్ బాగా వచ్చింది. ఇందుకు సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు’’ అని సహ నిర్మాత బుజ్జి అన్నారు.

# గణతంత్ర దినోత్సవానికి షురూ


రాహుల్ విజయ్

శ్రీను వైట్ల దగ్గర దర్శకత్వ శాఖలో పని చేసిన బీవీ సూర్య దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రముఖ సీనియర్ స్టంట్ కొరియోగ్రాఫర్ విజయ్ మాస్టర్ తనయుడు రాహుల్ విజయ్ ఈ చిత్రంలో కథానాయకునిగా నటించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, ప్యాషనేట్ ఫిలిం మేకర్ చింతా గోపాలకృష్ణారెడ్డి శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించనున్న ఈ చిత్రం గణతంత్ర దినోత్సవం రోజున (జనవరి 26న) ప్రారంభోత్సవం జరుపుకోనుంది. ‘‘రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. జనవరి 27న రెగ్యులర్ షూటింగ్ మొదలు’’ అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, కెమెరా: ఈశ్వర్ యెల్లు మహంతి, కథ– స్క్రీన్ ప్లే– డైలాగ్స్– దర్శకత్వం: బీవీ సూర్య.

# జయేష్ భాయ్‌కి జోడీ

‘అర్జున్ రెడ్డి’తో తెలుగులోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన షాలినీ పాండే, ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లో పరిచయం కాబోతున్నారు. మరి... బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌లో సినిమా, అందులోనూ యూత్ క్రేజీ స్టార్ రణ్‌వీర్ సింగ్ సరసన అంటే క్రేజీ ప్రాజెక్టే కదా. దివ్యాంగ్ తక్కర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ‘జయేష్ భాయ్ జోర్దార్’ అనే టైటిల్ ఖరారు చేశారు. ‘‘ఈ అవకాశం ద్వారా నా టాలెంట్‌ను బాలీవుడ్‌లోనూ చూపిస్తాను. రణ్‌వీర్ సింగ్‌లాంటి సూపర్‌స్టార్‌తో కలసి నటించడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది’’ అన్నారు షాలినీ పాండే. గుజరాత్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే వినోదాత్మక చిత్రమిది. త్వరలో షూటింగ్ ఆరంభం కానున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల కానుంది.






ఆస్తమా నియంత్రణతో

# హ్యాపీ ఊపిరి

**చలికాలం వచ్చిందంటే చాల మంది చిన్నపిల్లలకు ఇబ్బంది. ఆ పిల్లల తల్లిదండ్రులకూ వణుకు. కారణం... ఈ వాతావరణంలో పిల్లల్లో ఆస్తమా మరింత పెచ్చరిల్లుతుంది. ఆస్తమా ఉన్నవారిలో ఊపిరితిత్తులకు ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) వస్తుంది. అప్పడప్పడూ ఎటాక్ చేస్తూ ఇది దీర్ఘకాలికంగా బాధిస్తుంది. ఈ సీజన్‌లో మరిన్ని ఎక్కువసార్లు, మరింత తీవ్రతతో కనిపించేందుకు అవకాశాలెక్కువ. అలర్జీ కారణంగా వచ్చే ఆస్తమా... ఈ సీజన్‌లో అయితే సరిపడని వాతావరణంతోనూ వస్తుంది. ఆస్తమాపై అవగాహనకు, దానిని నియంత్రణలో ఉంచుకునేందుకే ఈ కథనం...**



ఆస్తమాను అర్థం చేసుకోవాలంటే మన ఊపిరితిత్తుల్లోని వాయు నాళాల పనితీరును అవగతం చేసుకోవాలి. మన దేహానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఊపిరితిత్తుల్లోకి తీసుకెళ్లి, అక్కడి కాలుష్య కార్బన్ డై ఆక్సైడ్‌ను మళ్లీ బయటకు వదలడానికి అంచెలంచెలుగా అనేక నాళాలు ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట, ఎర్రబారడం) కారణంగా అవి ఉబ్బుతాయి. దాంతో సెన్సిటివ్‌గా మారిపోతాయి. ఉదాహరణకు చర్మంపై ఏదైనా గాయమైనప్పుడు అది ఎర్రబారి, వాచి, ముట్టుకుందామన్నా ముట్టనివ్వని విధంగా మారడాన్ని ఇన్‌ఫ్లమేషన్ అని చెప్పవచ్చు.

ఇలా ఊపిరితిత్తుల్లోని నాళాల కండరాలు ఉబ్బడం వల్ల వాటి మధ్యభాగంలోని స్థలం సన్నబడిపోయి, శ్వాసమార్గాలు మూసుకు పోయినట్లుగా అవుతాయి. ఫలితంగా ఆ నాళాల్లో గాలి ఫ్రీగా కదిలేందుకు సరిపడనంత స్థలం లేక శ్వాస సరిగా అందదు. దాంతో మనకు ఆస్తమా అటాక్ వస్తుందన్నమాట.

ఏవైనా మనకు సరిపడని వాటిని తిన్నా, పీల్చుకున్నా మన వాయునాళాలు తీవ్రంగా ప్రతిస్పందించడం వల్ల ఇలా జరుగుతుంది. ఈ సీజన్‌లో చల్లటి వాతావరణంలోని గాలిలో మంచు కారణంగా వాయునాళాలు ఉబ్బుతాయి. దాంతో పాటు వాయునాళాల్లో కాస్త జిగురుగా ఉండే మ్యూకస్ అనే పదార్థం స్రవిస్తుంది. అసలే నాళాలు సన్నబడి ఉండటంతో పాటు... ఈ మ్యూకస్ కూడా అడ్డుపడటం వల్ల వాయువులు కదిలే ప్రాంతం మరింత మూసుకుపోతుంది. ఫలితంగా గాలి పీల్చడమూ, వదలడమూ... అంటే మొత్తంగా శ్వాస తీసుకోవడమే చాలా కష్టమవుతుంది.

**కారణాలు:** ఆస్తమాకు ప్రధాన కారణం జన్యుపరమైనవని అనేక అధ్యయనాల్లో స్పష్టమైంది. అయితే ఇటీవల జన్యుపరమైన కారణాలేమీ లేకుండానే ఇది వస్తోందంటూ కూడా మరికొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇక మనకు సరిపడని వాతావరణం దీన్ని ట్రిగ్గర్ చేస్తుందనేది చాలామందికి తెలిసిన విషయమే.

మనం శ్వాసించే సమయంలో ఏదైనా మనకు సరిపడని పదార్థం (దీన్ని అలర్జెన్ అంటారు) మన ఊపిరితిత్తుల మార్గంలోకి ప్రవేశిస్తే అది అలర్జిక్ రియాక్షన్‌కు కారణమవుతుంది. ఇలా అలర్జిక్ రియాక్షన్ రావడానికి కారణమయ్యే అంశాల్లో ఇవి కొన్ని...

- గదుల్లోపల (ఇన్‌డోర్స్‌లో)ఉండే అలర్జెన్స్ (ఉదా... పక్కబట్టల్లో, కార్పెట్స్‌లో, ఇరుగ్గా ఉండే ఫర్నిచర్‌లో ఉండే డస్ట్‌మైట్స్, కాలుష్యంలో చాలా ఎక్కువ సంఖ్యలో ఉండే ధూళి కణాలు, పెంపుడు జంతువుల వెంట్రుకలు.
- **ఆరుబయట ఉండే అలర్జెన్స్:** పుప్పొడి, బూజు వంటి పదార్థాలు.
- పొగాకు కాలినప్పుడు / మండినప్పుడు వచ్చే పొగ
- ఘాటైన రసాయనాలు, స్ప్రేలు.. వాటి తాలూకు ఘాటైన వాసనలు కొందరిలో ఆస్తమాకు కారణం కావచ్చు.

### పిల్లల్లో ఆస్తమా

చిన్న పిల్లల్లో సాధారణంగా ఐదేళ్ల వయసు తర్వాత ఆస్తమా లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే అంతకంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో ఆస్తమాను గుర్తించడం అటు తల్లిదండ్రులకు, ఇటు డాక్టర్లకు కూడా ఒకింత కష్టమవుతుంది. చిననపిల్లల్లో ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే బ్రాంకియల్ ట్యూబులు మొదటే చాలా సన్నగా, చిన్నగా ఉంటాయి. ఇక జలుబు, పడిశం వంటి వాటి కారణంగా ఆ మార్గాలు మామూలుగానే ఇన్‌ఫ్లమేషన్‌కు గురవుతుంటాయి. దాంతో అవి మరింత సన్నగా మారతాయి. అందువల్ల అవి ఆస్తమా వల్ల సన్నబడ్డాయా లేక పడిశం, జలుబు తాలూకు లక్షణాలా అన్నది గుర్తించడం కొంత కష్టమవుతుంది.

### అలర్జిక్ ఆస్తమా కోసం చేసే కొన్ని అలర్జీ పరీక్షలు

కొన్ని ట్రిగరింగ్ అంశాల కారణంగా పిల్లల్లో ఆస్తమా కనిపిస్తుంటే... అలాంటి పిల్లల్లో డాక్టర్లు అలర్జీ స్కిన్ టెస్ట్ చేయిస్తారు. ఇందులో ఏదైనా అలర్జీ కలిగించే పదార్థాన్ని (అంటే జంతువుల వెంట్రుకలో లేదా బూజునో) ఉపయోగించి చర్మంలోని కొంత భాగాన్ని సేకరిస్తారు. ఇలా చేయడం ద్వారా చర్మంపై ఏదైనా అలర్జిక్ రియాక్షన్ జరుగుతుందేమోనని గమనిస్తారు. కొన్నిసార్లు చర్మంపై లక్షణాలు కనిపిస్తూ ఉండే వారికి, యాంటీ హిస్టమైన్ మందులు తీసుకునే వారికి అలర్జీ బ్లడ్ టెస్ట్‌ల వల్ల ఉపయోగం ఉంటుంది. అయితే కొంతమందికి ఆహారం కారణంగా అలర్జీ వచ్చి ఆస్తమా కనిపించవచ్చు. అలాంటప్పుడు ఏయే రోగులకు ఏయే ఆహారం వల్ల అలర్జీ కలుగుతుందో తెలుసుకోవడం చాలా కష్టమైన పని. అది వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. అందుకే పెద్ద వారైతే తమకు తాము... పిల్లల విషయంలోనైతే తల్లిదండ్రులు... ఏయే పదార్థాలు తిన్న తర్వాత లక్షణాలు కనిపిస్తున్నాయో జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి. ఫలానా పదార్థాలతోనే ఆస్తమా లక్షణాలు బయటపడుతున్నాయని ఒకటి రెండుసార్లు గమనించాక తెలిసిపోతుంది. అలాంటప్పుడు ఆయా పదార్థాలకు దూరంగా ఉండాలి.

కొన్ని సందర్భాల్లో డాక్టర్లు మరింత సూక్ష్మస్థాయి పరీక్షలనూ ఆశ్రయించాల్సి రావచ్చు.

### ఆస్తమా లక్షణాలు

- దగ్గు, ఆయాసం... ప్రధానంగా రాత్రివేళల్లో ఎక్కువగా ఉంటుంది. శరీరానికి శ్రమ కలిగే వ్యాయామం చేడం లేదా గట్టిగా నవ్వడం, ఏడ్వటం, పరుగెత్తడం వంటివి చేస్తే ఈ దగ్గు, ఆయాసాలు మరింతగా పెరుగుతాయి.
- శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బంది
- ఛాతీ బిగుతుగా పట్టేసినట్లుగా ఉండటం
- హాయిగా ఊపిరి అందకపోవడం, సాఫీగా ఊపిరాడకపోవడం
- పిల్లికూతలు (శ్వాస తీసుకునే సమయంలో... అందునా మరీ ముఖ్యంగా గాలి వదిలే సమయంలో సన్నటి పిల్లికూతలు వినిపిస్తుంటాయి).
- కొందరిలో ఆస్తమా వచ్చినప్పుడు ఒళ్లు (చర్మం) కూడా ఎర్రబారి పొడిగా మారుతుంది. మరికొందరిలో ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, గురక వంటి లక్షణాలు కనిపించవచ్చు.



పిల్లల్లో పైన పేర్కొన్న లక్షణాల్లో ఏదో ఒకటిగాని లేదా కొన్ని లక్షణాలు కలగలిసి గాని కనిపించవచ్చు. ఇలా లక్షణాలు కనిపించినప్పుడు దాన్ని జలుబు లేదా బ్రాంకైటిస్ కావచ్చని అనుకుంటాం. అయితే అవే లక్షణాలు పదే పదే కనిపిస్తుంటే అప్పుడు అది ఆస్తమా కావచ్చని అనుమానించాలి. ఆ పిల్లలకు ఆస్తమాను ప్రేరేపించే అంశం (ట్రిగరింగ్ ఫ్యాక్టర్) ఏదైనా ఎదురైతే వారి పరిస్థితి మరింత దుర్భరమవుతుంది. వెంటనే ఆస్తమా లక్షణాలు మొదలైపోతాయి. పొగ, ఘాటైన వాసనలు, పుప్పొడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు, డస్ట్‌మైట్స్... ఇవి సోకీ సోకగానే ఆస్తమాను తక్షణం ప్రేరేపిస్తాయి.

### నిర్ధారణ

ఆస్తమా నిర్ధారణ కాస్తంత కష్టమైన ప్రక్రియ. లక్షణాలతో పాటు... అవి ఎంత వ్యవధిలో మళ్లీ మళ్లీ వస్తున్నాయనే అంశం ఆధారంగా అది ఆస్తమా కావచ్చేమోనని అనుమానిస్తారు. దాంతో నిర్ధారణ కోసం కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణంగా బాల్యంలో వచ్చే మరికొన్ని సమస్యల లక్షణాలూ ఆస్తమా లక్షణాలతో కలగలసి ఉంటాయి. దాంతో ఆయా లక్షణాలు ఆస్తమా వల్లనే కనిపిస్తున్నాయా లేక ఇతర మరికొన్ని ఆరోగ్య సమస్యల వల్లనా అని నిర్ధారణ చేయడం కష్టమవుతుంది. ఉదాహరణకు ఆస్తమా లాంటి లక్షణాలే కనబరిచే మరికొన్ని కండిషన్లు.... ● రైనైటిస్ ● సైనసైటిస్ ● ఆసిడ్ రిఫ్లక్స్ లేదా గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్‌డీ) ● వాయునాళాలలో ఏమైనా తేడాలు (ఎయిర్ వే అబ్‌నార్మాలిటీస్) ● స్వరపేటిక సరిగా పనిచేయకపోవడం (వోకల్ కార్డ్ డిస్‌ఫంక్షన్) ● బ్రాంకైటిస్ వంటి శ్వాస మార్గంలో వచ్చే ఇన్ఫెక్షన్లు

ఆస్తమా నిర్ధారణ ఇంత సంక్లిష్టం కాబట్టే డాక్టర్లు చిన్నారి లక్షణాలను నిశితంగా పరిశీలించడంతో పాటు కొన్ని వైద్య పరీక్షలూ చేయించాల్సి రావచ్చు. అవి...

- ఐదేళ్లు లేదా అంతకంటే పైబడిన వయసు పిల్లల విషయానికి వస్తే పెద్దవాళ్లలోనూ నిర్ధారణ చేసేందుకు నిర్వహించే లంగ్ ఫంక్షన్ పరీక్షలు (స్పైరోమెట్రీ) వంటివి చేస్తారు. ఇందులో పిల్లలు ఎంత సమర్థంగా గాలిని బయటకు వదలగలరో చూస్తారు. సాధారణ స్థితితో ఈ పరీక్ష చేయడంతో పాటు, కాస్త వ్యాయామం తర్వాత, అటుపైన కొంత ఆస్తమా మందు ఇచ్చాక ఆ పరీక్షల్లో కనిపించే తేడాలను సునిశితంగా గమనించాకే ఆస్తమా అని నిర్ధారణ చేస్తారు.
- ఇక మూడేళ్లు కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో లంగ్ ఫంక్షన్ పరీక్షతో ఆస్తమా నిర్ధారణ ఒకింత కష్టం. దాంతోపాటు రోగి చెప్పేవి, తల్లిదండ్రులు గమనించే అనేక లక్షణాల ఆధారంగా ఆస్తమాను నిర్ధారణ చేస్తారు.


### చికిత్స

సాధారణంగా చిన్నపిల్లల్లో ఆస్తమా వస్తే చాలామందిలో వారు పెరుగుతున్న కొద్దీ... అంటే టీన్స్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడుగానీ లేదా యుక్త వయస్కులుగా మారుతున్నప్పుడుగానీ ఆ ఆస్తమా లక్షణాలు క్రమంగా తగ్గిపోవచ్చు. అయితే కొంత మందిలో కొన్నాళ్లు కనిపించకుండా పోయిన ఆ లక్షణాలు కొంతకాలం తర్వాత మళ్లీ వ్యక్తం కావచ్చు. ఇక చిన్నప్పుడు మరీ తీవ్రమైన ఆస్తమా ఉన్న పిల్లల్లో పెద్దయ్యాక కూడా తగ్గకపోవచ్చు.

### రెండు రకాల చికిత్స ...

- దీర్ఘకాలంలో మళ్లీ రాకుండా నివారించేందుకు అవసరమైన ప్రివెంటివ్ చికిత్స. వాయునాళాల ఇన్‌ఫ్లమేషన్ నివారణకు ఈ మందులను వాడాలి. వీటిని రోజూ తీసుకోవాలి.
- **తక్షణ ఉపశమనం కోసం:** ఆస్తమా వచ్చినప్పుడు వాయునాళాల వాపు తగ్గించి, హాయిగా శ్వాస తీసుకోవడానికి దోహదపడేందుకు ఉపయోగించే మందులు వాడాలి. వీటినే రెస్క్యూ మెడికేషన్ అనీ, క్విక్ రిలీఫ్ మెడికేషన్ అనీ అంటారు. ఇది ఆస్తమా అటాక్ ఉన్నప్పుడు చేసే స్వల్పకాలిక చికిత్స. కొందరు పిల్లల్లో ఆటలు లేదా వ్యాయామానికి ముందు కూడా ఈ చికిత్సను డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు.
- మూడేళ్ల లోపు పిల్లలకు ఇన్‌హేలర్స్‌తో చికిత్స చేయాల్సి వచ్చినప్పుడు ఆ మందు పిల్లల ఊపిరితిత్తుల్లోకి సమర్థంగా వెళ్లడానికి స్పేసర్ డివైజ్ విత్ మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇందువల్ల మందు వృథా కాకుండా ఉంటుంది. ఇక ఐదు సంవత్సరాలు దాటిన పిల్లల్లో స్పేసర్‌తో ఇన్‌హేలర్ ఉపయోగించాలి.
- ఇప్పుడు ఆస్తమాకు ఇమ్యూనోథెరపీ చికిత్స కూడా అందుబాటులో ఉంది.

చివరగా... కేవలం కొన్నాళ్లు మందులు వాడటం లేదా చికిత్స తీసుకోవడంతో మాత్రమే ఆస్తమా తగ్గిపోదు. దీన్ని అనుక్షణం నియంత్రణలో ఉంచడం అవసరం. అందుకే పిల్లలకు ఆస్తమా ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఆ విషయాన్ని అంగీకరించి, దీర్ఘకాలం పాటు చికిత్సకు సిద్ధపడాలి. ఆస్తమాను ప్రేరేపించే అంశాలకు రోగిని దూరంగా ఉంచడం, తమకు ఆస్తమాను ప్రేరేపించే అంశాలేమిటో క్రమంగా గుర్తించి, వాటినుంచి ఎల్లప్పుడూ దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ ఉండటం చేస్తుండాలి. గతంతో పోలిస్తే ఇప్పుడు ఆస్తమా నివారణ, నియంత్రణ చాలా సులభమే. అందుకే ఆందోళనకు గురికాకుండా తమ డాక్టర్‌తో నిత్యం ఫాలోఅప్‌లో ఉండాలి.



**డా. రమేశ్‌బాబు దాసరి**
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్

పరిపరిశోధన

## జంక్‌ఫుడ్‌తో రొమ్ముక్యాన్సర్ ముప్పు!

టీనేజీ పిల్లలు జంక్‌ఫుడ్ అదేపనిగా తింటుంటారు. వారి ఈ అలవాటుతో భవిష్యత్తులో రొమ్ము క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. పిల్లలు తీసుకునే జంక్‌ఫుడ్స్, కేక్స్, బిస్కెట్ల వంటి



పదార్థాల్లోని కొవ్వులు, నూనెల వల్ల వారు పెద్దయ్యాక కొన్ని అనర్థాలు కనిపించే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌కు చెందిన అధ్యయనవేత్తలు వెల్లడించారు. అనేక మంది టీనేజీ పిల్లలపై అధ్యయనం చేస్తూ దాదాపు పదేళ్ల పాటు సేకరించిన సమాచారాన్ని విశ్లేషించగా ఈ విషయం తేటతెల్లమైంది. ఆ వయసులో ఉండే అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు తోడుగా ఇక పెద్దయ్యాక ఆల్కహాల్ కూడా జత అయితే రొమ్ముక్యాన్సర్ ముప్పు మరింత పెరుగుతుందని తేలింది. ఈ వివరాలన్నింటినీ అమెరికా అసోసియేషన్ ఫర్ క్యాన్సర్ రీసెర్చ్ జర్నల్ అయిన 'క్యాన్సర్ ఎపిడిమియాలజీ, బయోమార్కర్స్ అండ్ ప్రివెన్షన్'లో పేర్కొన్నారు.

జిమ్‌కు వెళ్లండి...

## మతిమరపును దూరం చేసుకోండి

మీరు ప్రతిరోజూ జిమ్‌కు వెళ్లి అక్కడ బరువులు ఎత్తుతూ చేసే వ్యాయామాల వల్ల మతిమరపు (డిమెన్షియా) వచ్చే అవకాశాలు చాలా తక్కువ అంటున్నారు ఫిన్‌ల్యాండ్‌కు చెందిన



శాస్త్రవేత్తలు. మరీ ముఖ్యంగా బెంచ్‌ప్రెస్ (బెంచ్‌మీద పడుకొని బరువులు ఎత్తుతూ చేసే వ్యాయామం) చేసే వారికి పెద్దవయసులోనూ మెదడు చురుగ్గా పనిచేస్తుందని వారు పేర్కొంటున్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్టర్న్ ఫిన్‌ల్యాండ్‌కు చెందిన పరిశోధకులు వందలాది మంది పెద్దవయసు వారిపై చాలాకాలంపాటు నిర్వహించిన ఓ అధ్యయనం ద్వారా ఈ విషయాలు తెలిశాయి.

# పెయిన్‌కిల్లర్స్ వాడుతున్నారా...?

## ఒకింత జాగ్రత్త!



ఏదైనా కారణాలతో కాస్త నొప్పి అనిపించగా మెడికల్ షాపుకు వెళ్లిపోయి నొప్పి నివారణ మందులు (పెయిన్‌కిల్లర్స్) కొని వేసుకోవడం చాలా ఎక్కువగా జరుగుతోంది. కొందరు తమకు తెలిసిన మందుల పేర్లు చెప్పి అదేపనిగా తీసుకుంటూ ఉంటే... మరికొందరు పెయిన్‌కిల్లర్ ఏదైనా ఇవ్వమని అడుగుతుంటారు. ఇలా డాక్టర్ చీటీ లేకుండానే ఆన్‌కౌంటర్ పెయిన్‌కిల్లర్స్ వాడటం మన సమాజంలో చాలా ఎక్కువే.

అయితే ఇప్పుడు వైద్యరంగంలో వచ్చిన పురోగతి కారణంగా... ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్, స్పాండిలోసిస్, ఇన్ఫెక్షియస్ జబ్బులకు చాలా కొత్తమందులు, గతంలో ఉన్న సైడ్‌ఎఫెక్ట్ లేని మందులు వస్తున్నాయి. కాబట్టి మునుపెప్పుడో డాక్టర్ రాసి ఇచ్చిన చీటీలోని మందులనే ఇంకా ఇప్పటికీ అదేపనిగా వాడటం సరైనది కాదు. ఎందుకంటే దానికంటే మెరుగైనవీ, సైడ్‌ఎఫెక్ట్స్ గణనీయంగా తగ్గినవీ అయిన మందులు రోజురోజుకీ అందుబాటులోకి వస్తున్నాయి. పైగా ముందుతో పోలిస్తే ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి వస్తున్న మందులు మరింత త్వరితంగా ఉపశమనం ఇవ్వడంతో పాటు చాలా చవకగా కూడా లభ్యమవుతున్నాయి. అందుకే డాక్టర్‌ను సంప్రదించాకే మందులు వాడాలి. ఇక నొప్పి నివారణ మందుల విషయానికి వస్తే ఇలా డాక్టర్‌ను సంప్రదించాకే వాడటం అన్నది మరింతగా అవసరం. దీనికి ఎన్నో కారణాలున్నాయి. ఉదాహరణకు...

నొప్పి నివారణకు మందులు వాడే వారిలో చాలా మందికి వాటి కారణంగా వచ్చే దుష్ప్రభావాలపై అవగాహనే ఉండదు. కొన్ని దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అవి నొప్పి నివారణ మందుల వల్ల అన్న విషయం కూడా వారికి తెలియనే తెలియదు.

**కొన్ని మందులతో కాంబినేషన్‌గా ఈ మందులు వాడాల్సి వస్తే...**

పెద్దవయసులో ఉన్నవారు యాస్పిరిన్, వార్‌ఫేరిన్ వంటి మందులు వాడుతూ పెయిన్‌కిల్లర్స్‌నూ వేసుకోవాల్సి వస్తే చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే... రోగుల్లో ఆ మందుల కాంబినేషన్ రక్తస్రావానికి దారితీయవచ్చు. అందుకే మీరు వాడుతున్న మందులని డాక్టర్‌కి తప్పక చెప్పండి

**పెయిన్‌కిల్లర్స్ వాడుతున్నారా... జాగ్రత్త:** నొప్పి నివారణ మందులను చాలా కొద్ది మోతాదుల్లోనూ, చాలా కొద్ది వ్యవధికోసం మాత్రమే వాడాల్సి ఉంటుంది. మోతాదు మించితే అవి శరీరంపై ఎన్నో దుష్పరిణామాలను కలగజేస్తాయి. నొప్పులను తగ్గించే విషయంలో అవి ఒక వరప్రదాయినులే. అయినప్పటికీ వాటిని ఉపయోగించే విషయంలో చాలా జాగరూకతతో వ్యవహరించాలి.

### దుష్పరిణామాలివే...

- నొప్పి నివారణ మందులు కడుపులోకి వెళ్లగానే అవి పొట్టలోని లోపలి పొరలు మొదలుకొని రక్తనాళాల్లోని లోని పొరల వరకు... లోపలి వైపు పొరలను (ఇన్నర్ లేయర్స్‌ను) దెబ్బతీస్తాయి. ప్రధాన రక్తనాళాల చివరన ఉండే సన్నటి నాళాలు, మూత్రపిండాల్లోని అతి సన్నటి నాళాలు దెబ్బతింటాయి. దానికి తోడు కొంతమందిలో వాంతులు, వికారం వంటివి కూడా కనిపిస్తాయి. మామూలుగానైతే కొన్ని యాంటాసిడ్‌ను తీసుకుంటూ నాలుగైదు రోజులు మాత్రమే నొప్పి నివారణ మందులు వాడాలి. అదేపనిగా అంతకుమించి వాడకూడదు.
- రెండు లేదా మూడు వారాలకు మించి నొప్పి నివారణ మందులు తీసుకునేవారిలో కొన్ని ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడతాయి. అందులో మూత్రపిండాలకు వచ్చే నెఫ్రోపతి అత్యంత ప్రమాదకరం. ముందుగా చెప్పుకున్నట్లుగా రక్తనాళాల చివరన ఉండే సన్నటి రక్తకేశనాళికలు దెబ్బతినే అవకాశాలు ఎక్కువ. దాంతో నొప్పి నివారణ మందుల వల్ల అన్ని అవయవాలకంటే కిడ్నీ దెబ్బతినే అవకాశాలు చాలా చాలా ఎక్కువ.
- కొందరిలో ఈ మందులతో పాటు అధిక రక్తపోటు కూడా అదనపు కారణమై ప్రధాన రక్తనాళాల చివరన ఉండే అతి సన్నటి రక్తనాళాలు దెబ్బతింటాయి. ఇలాంటివారిలో గుండె పనితీరుపై మరింత ఒత్తిడి పడి గుండెజబ్బులు కూడా రావచ్చు.
- ఈ మందులు పరిమితికి మించి వాడటం వల్ల కడుపులోని లోపల ఉండే పొరలు దెబ్బతిన వచ్చు. ఇలాంటివారిలో కొందరికి మేజర్ సర్జరీ కూడా అవసరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి.
- కొందరిలో రక్తం గడ్డకట్టడానికి ఉపయోగపడే ప్లేట్‌లెట్స్‌పై దుష్ప్రభావం పడి కోయాగ్యులోపతి వంటి సీరియస్ పరిస్థితికి దారితీయవచ్చు.

**ఈ మందులు వాడే వారికి కొన్ని సూచనలు**

నొప్పి నివారణ మందులు తప్పనిసరిగా వాడాల్సిన వారు వాటి దుష్పరిణామాలను తగ్గించుకోవడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవి... ● ఇప్పటికే కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నవారు నొప్పి నివారణ మందులను వాడకూడదు. ● అల్సర్ ఉన్నవారు వాడకూడదు. ● పరగడుపున ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదు. ● గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్‌డీ) ఉన్నవారు, గుండెజబ్బులతో బాధపడుతున్నవారు, హైబీపీ రోగులు వీటిని వేసుకోకూడదు. ● వీటిని వేసుకున్న తర్వాత నీరు ఎక్కువగా తాగాలి. ● ఎక్కువగా వాడాల్సి వస్తే కొన్ని రోజులు వ్యవధి అనంతరం మళ్లీ డాక్టర్ సలహా తీసుకుని ఆ మేరకే వాటిని వాడాలి. ● ఇవి వాడే సమయంలో తరచూ మూత్రపిండాలు, బీపీ చెక్ చేయించుకుంటూ ఉండాలి.

చివరగా... పెయిన్‌కిల్లర్ వాడాల్సి వచ్చినప్పుడు మీరీ నొప్పి భరించగలరేమో చూసుకోండి. ఎందుకంటే వీటి వల్ల భవిష్యత్తులో వచ్చే నొప్పులు మరింత తీవ్రంగా ఉంటాయని గుర్తుంచుకోండి.



**- డాక్టర్ కె. శివ రాజు**
సీనియర్ ఫిజీషియన్,
కిమ్స్ హాస్పిటల్, సికింద్రాబాద్

# గర్భవతులు బరువు పెరుగుతుంటే?



ప్రెగ్నెన్సీలో బరువు పెరగడం సాధారణంగా జరిగేదే. గర్భధారణ సమయంలో మహిళలు 8 నుంచి 10 కిలోల బరువు వరకు పెరుగుతారు. అయితే ఎవరెవరు ఏ మేరకు, ఎంతెంత బరువు పెరగడం ఆరోగ్యకరం అన్నది... గర్భం దాల్చక ముందు వారెంత బరువున్నారన్న అంశం మీద ఆధారపడి ఉంటుంది.

ఒకరు ఎంత బరువున్నారు, అది ఆరోగ్యకరమైన పరిమితేనా అన్నది... వారి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎమ్ఐ) మీద ఆధారపడి ఉంటుంది. బరువును కేజీల్లో తీసుకుని, దాన్ని మీటర్లలో వారి ఎత్తు స్క్వేర్‌తో భాగిస్తే వచ్చే సంఖ్యను 'బీఎంఐ' అంటారు. (కిలో గ్రామ్స్/మీటర్స్ స్క్వేర్). ఇలా లెక్కవేయగా వచ్చిన ఈ సంఖ్య 18 కంటే తక్కువగా ఉంటే... వారిని తక్కువ బరువువారిగా(అండర్‌వెయిట్‌గా) వర్గీకరించవచ్చు. అలాగే ఈ సంఖ్య 18.5 నుంచి 24.9 వరకు ఉంటే వారిని సాధారణ బరువు ఉన్నవారిగా చెప్పవచ్చు. అదే 25 నుంచి 29.9 వరకు ఉంటే వారిని ఎక్కువ బరువు ఉన్నవారిగానూ (ఓవర్ వెయిట్), 30 కంటే ఎక్కువగా ఉంటే స్థూలకాయులుగానూ (ఒబేస్‌గా) చెప్పవచ్చు.

వీరిలో బరువు తక్కువగా ఉన్నవారు ప్రెగ్నెన్సీ టైమ్‌లో 15 కిలోల వరకు పెరిగినా పర్లేదు. కానీ స్థూలకాయులు మాత్రం తమ బరువు పెరుగుదలను 5 నుంచి 9 కిలలో లోపే పరిమితం చేసుకోవడం మంచిది. సగటున చూస్తే గర్భంతో ఉన్నప్పుడు మహిళలు సాధారణంగా వారానికి 200 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకు బరువు పెరగవచ్చు. ఇక వేవిళ్లతో బాధపడుతూ తరచూ వాంతులు చేసుకునేవారు 20 వారాలలోపు ఒక్కోసారి అసలు బరువే పెరగకపోవచ్చు. ఇలా బరువు పెరగకపోవడం కూడా వారి సాధారణ ఆరోగ్యానికి లేదా ఆరోగ్యకరమైన గర్భధారణకూ (హెల్దీ ప్రెగ్నెన్సీకి) అవరోధమేమీ కాదు.

గర్భవతులు తమ బరువు పెరుగుదలను ఆరోగ్యకరమైన పరిమితిలో ఉంచుకోడానికి తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు తినడం మంచిది. అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. అంటే సాధారణ ఆహారంతో పాటు పాలు, గుడ్లు, పండ్లు, మొలకెత్తిన గింజలు తీసుకోవడం మంచిది. మాంసాహారం తినేవారైతే చికెన్, చేపలు తినవచ్చు. శాకాహారులు తమ ఆహారంలో పాలు, పెరుగు, జున్ను ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇక గర్భవతులు ఇద్దరికోసం తినాలంటూ చాలామంది వారిని ఒత్తిడి చేస్తుంటారు. నిజానికి కడుపులోని బిడ్డ తన ఆహారాన్ని తల్లి నుంచి ఎలాగైనా గ్రహిస్తుంటాడు. కాబట్టి సాధారణ బరువు ఉన్నవారు, ఎక్కువ బరువు ఉన్నవారు తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు మామూలుగానే తింటే సరిపోతుంది. అంటే బరువు తక్కువగా ఉన్నవారు మినహా మిగతా వారంతా ఇద్దరి కోసం తినడం అన్నది సరికాదని గ్రహించాలి. ఇది బరువును పెంచి, ముప్పునూ పెంచుతుంది.

# నలుగురితో కలిసి..

# నచ్చిన రంగంలో సేవ!



» సామాజిక స్పృహ కలిగిన యువతకు చక్కటి అవకాశం
» ఫెలోషిప్ వ్యవధి పూర్తయ్యాక విభిన్న రంగాల్లో ఉపాధి

## ఫెలోషిప్‌లు

**సంప్రదాయ చదువులు, ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి వివిధ రకాల ఫెలోషిప్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ, సమాజం మారాలి, విద్యా వ్యవస్థ బాగుపడాలి అనే లక్ష్యంతో అమలుచేస్తున్న ఫెలోషిప్‌ల గురించి ఎంత మందికి తెలుసు...? కేవలం ఉన్నత చదువులు, ఉద్యోగాలకే పరిమితం కాకుండా.. సామాజిక బాధ్యత, సామాజిక స్పృహ మేళవింపుగా పలు ఫెలోషిప్‌లు అందుబాటులో ఉన్నాయి. నలుగురితో కలిసి నచ్చిన రంగంలో సేవ చేస్తూ.. సమాజానికి అవసరమైన నాయకత్వాన్ని అందించాలనుకునే యువతకు పలు సంస్థలు ఫెలోషిప్‌లను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో... ఔత్సాహికులైన అభ్యర్థులకు ఉపయోగపడేలా సదరు ఫెలోషిప్‌ల వివరాలు...**

### అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్

ప్రభుత్వ పాఠశాలల్లో బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏడాది వ్యవధితో ఫెలోషిప్‌లు అందిస్తోంది. ఫెలోషిప్‌కు ఎంపికైన వారు దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి కృషి చేయాల్సి ఉంటుంది. సామాజిక మార్పు ధ్యేయంగా ఉన్న వివిధ రంగాలకు చెందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఫెలోషిప్‌లు అందిస్తారు. ఎంపికైనవారికి నెలకు రూ.35,000 స్టైఫండ్‌గా చెల్లిస్తారు. పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫెలోషిప్ పూర్తయిన తర్వాత ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో కొనసాగడానికి అవకాశం లభిస్తుంది.



» **దరఖాస్తులు:** ప్రస్తుతం 2020-2021 సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. తిరిగి జూన్, 2020లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
» **వెబ్‌సైట్:** azimpremjifoundation.org

### యంగ్ ఇండియా ఫెలోషిప్‌లు

హరియాణలోని (సోనాపేట్) అశోకా యూనివర్సిటీ 2011 నుంచి లిబరల్ ఆర్ట్స్‌లో యంగ్ ఇండియా ఫెలోషిప్‌లు అందిస్తోంది. ఈ ఫెలోషిప్‌లో చేరినవారు కోర్సు అనంతరం కోరుకున్న విభాగం (డిసిప్లిన్) నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ లిబరల్ స్టడీస్ డిగ్రీ అందుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. దేశవ్యాప్తంగా 300 మందికి అవకాశం కల్పిస్తారు.



#### ఎంపిక విధానం

అకడమిక్ నేపథ్యం, ఆలోచనలు, అభిరుచులు ఆధారంగా దరఖాస్తుదారులను వడపోసి టెలిఫోన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైనవారిని ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తారు. అభ్యర్థులు అదే రోజు కాంప్రహెన్షన్ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.

» **అర్హత:** డిగ్రీ లేదా పోస్టు గ్రాడ్యుయేషన్. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** జులై 15, 2020 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి.
» **దరఖాస్తులకు గడువు:** రౌండ్ 2 ప్రవేశాలకు ఫిబ్రవరి 2, రౌండ్ 3 ప్రవేశాలకు మార్చి 31, 2020
» **వెబ్‌సైట్:** www.ashoka.edu.in

### గాంధీ ఫెలోషిప్

ఇది రెండేళ్ల రెసిడెన్షియల్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. స్కూల్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ పేరుతో నిర్వహిస్తున్న ఈ ఫెలోషిప్‌కు ఎంపికైన అభ్యర్థులు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన బోధనకు స్థానిక సిబ్బందితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఫెలోషిప్ కింద నెలకు రూ.14,000తో పాటు ఉచిత బస కల్పిస్తారు. ఫెలోషిప్ మొత్తంలో నెలకు రూ. 7000 ఖర్చుల కోసం చెల్లిస్తారు. మిగిలిన మొత్తాన్ని కోర్సు పూర్తయిన అనంతరం అందిస్తారు.



» **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత.
» **వయసు:** 26 ఏళ్లలోపు ఉండాలి.
» **దరఖాస్తు గడువు:** మార్చి 31, 2020
» **వెబ్‌సైట్:** gandhifellowship.org

### ఇండియా ఫెలో

దేశంలో దీర్ఘకాలిక సామాజిక మార్పును తేగలిగే యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు ఇండియా ఫెలో ఆవిర్భవించింది. ఇండియా ఫెలో కార్యక్రమం యువత తమలోని స్వీయ నాయకత్వ లక్షణాలను గుర్తించేలా సాగుతుంది. ఫెలోషిప్‌కు ఎంపికైన వారు మూలాల నుంచి సమస్యల పరిష్కారంపై దృష్టిపెడతారు. కొత్త ఆలోచనలతో సంస్థలకు తోడ్పాటు అందిస్తారు. ఫెలోషిప్ వ్యవధి 13నెలలు. ఈ సమయంలో దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలి. ఫెలోషిప్ వ్యవధిలో నెలకు రూ.16,000 స్టైఫండ్‌గా అందుతుంది.



#### ఎంపిక విధానం

ఎంపిక ప్రక్రియ నాలుగంచెల్లో ఉంటుంది. అభ్యర్థులు ముందుగా తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు టెలిఫోన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన వారు ఏదైనా అంశంపై వెయ్యి పదాలతో వ్యాసం రాసి పంపాలి. అలా వచ్చిన వ్యాసాల్లో ఉత్తమమైన వాటిని అసెస్‌మెంట్ (ఇంటర్వ్యూ) నిర్వహిస్తారు.

» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
» **వయసు:** 21 -27 ఏళ్లలోపు ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు:** డిసెంబరు1, 2019 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.
» **వెబ్‌సైట్:** www.indiafellow.org

### టీచ్ ఫర్ ఇండియా

'ఏదో ఒక రోజు పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందుతుందని నమ్ముతున్నాం'... 'విద్యా అసమానతలను రూపుమాపి... అందరికీ నాణ్యమైన విద్య అనే కలను సాకారం చేసేందుకు నాయకులను తయారుచేయాలి'... ఇవీ టీచ్ ఫర్ ఇండియా లక్ష్యాలు..!! తాజాగా 2020-22 సంవత్సరానికి గానూ టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.



తల్లిదండ్రుల ఆదాయాలు తక్కువగా ఉన్న కారణంగా నాణ్యమైన విద్యకు దూరం అవుతున్న పిల్లలకు, సరైన సౌకర్యాలు లేని పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనకు టీచ్ ఫర్ ఇండియా కృషి చేస్తోంది. ఈ దిశగా ఫెలోషిప్‌లను ఆఫర్‌చేస్తోంది. ఫెలోషిప్ వ్యవధి రెండేళ్లు. వీటికి టీచింగ్‌పై ఇష్టం ఉన్న గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైనవారు రెండు నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ముంబయి, పుణె, దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నైల్లో టీచ్ ఫర్ ఇండియా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఫెలోషిప్ కింద నెలకు రూ.20,412తోపాటు హెచ్ఆర్ఏ చెల్లిస్తారు.

#### ఎంపిక విధానం

ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో జరుగుతుంది. తొలిదశలో ఆన్‌లైన్ పరీక్ష(ఏఎమ్‌క్యాట్) ఉంటుంది. ఇందులో పరిస్థితులను అంచనా వేసే నైపుణ్యాలు, ఇంగ్లిష్ సామర్థ్యాలను పరీక్షిస్తారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండో దశలో 30 నిమిషాల పాటు ఫోన్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారిని అసెస్‌మెంట్ సెంటర్‌కు ఆహ్వానిస్తారు. అక్కడ అభ్యర్థులు ఐదు నిమిషాలపాటు బోధించాల్సి ఉంటుంది. దీంతోపాటు గ్రూప్ డిస్కషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ యాక్టివిటీలు నిర్వహిస్తారు. అనంతరం గంటపాటు ముఖాముఖి జరుగుతుంది. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఫెలోషిప్ అందిస్తారు.

» **దరఖాస్తులకు గడువు:** డిసెంబరు 15, 2019
» **వెబ్‌సైట్:** www.teachforindia.org

---



# సీఐఎస్‌ఎఫ్ (ఏసీ)-2020

# అసిస్టెంట్ కమాండెంట్

**సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్)లో అసిస్టెంట్ కమాండెంట్(ఎగ్జిక్యూటివ్) కొలువుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకోసం మార్చి 1, 2020న లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా దేశ భద్రతలో కీలక బాధ్యతలు నిర్వహించే ఉన్నత కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. సీఐఎస్ఎఫ్(ఏసీ) -2020 నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక ప్రక్రియ, పరీక్ష తీరుతెన్నులు, సిలబస్ విశ్లేషణ...**

» దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 24, 2019

### సీఐఎస్ఎఫ్

సీఐఎస్ఎఫ్ ప్రస్థానం 1969లో ప్రారంభమైంది. ఇది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉంటుంది. దేశంలోని ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలు, ఎయిర్‌పోర్టులు, అణువిద్యుత్ కేంద్రాలు, అంతరిక్ష కేంద్రాలు, మేజర్ పోర్టులు-బ్యారేజ్‌లు, రిఫైనరీలు, కరెన్సీ ముద్రణాలయాలు, స్టీల్ ప్లాంట్లు, వారసత్వ కట్టడాలకు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తుంది.

### అసిస్టెంట్ కమాండెంట్

#### అర్హత

జనవరి 1, 2020 నాటికి ప్రాథమిక శిక్షణా కాలంతో కలుపుకొని జనరల్ డిపార్ట్‌మెంట్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్/ఇన్‌స్పెక్టర్‌గా నాలుగేళ్ల రెగ్యులర్ సర్వీస్ ఉండాలి. నియామక సమయానికి సర్వీస్‌లో ఎలాంటి వివాదాలు ఉండరాదు.

#### వయసు

ఆగస్టు 1, 2020 నాటికి 35ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు గరిష్టంగా ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

#### విద్యార్హత


గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌సీసీ 'బి, సి' సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ సమయంలో ప్రాధాన్యం ఉంటుంది.

#### ఎంపిక విధానం

రాత పరీక్ష, ఫిజికల్ అండ్ మెడికల్ స్టాండర్డ్ టెస్టు, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్టు నిర్వహించి అసిస్టెంట్ కమాండెంట్‌గా నియామకం ఖరారు చేస్తారు.

#### ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ)

ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమే. అయితే కింది ఈవెంట్‌లలో దేనిలో అర్హత సాధించక పోయినా.. సదరు అభ్యర్థి పీఈటీలో అర్హత సాధించనట్లే పరిగణిస్తారు.



| | పురుషులు | మహిళలు |
|---|---|---|
| 100 మీటర్లు | 16 సెకన్లు | 18 సెకన్లు |
| 800 మీటర్లు | 3 ని.45 సెకన్లు | 4 ని.45 సెకన్లు |
| లాంగ్ జంప్ | 3.5 మీటర్లు (3 అవకాశాలు) | 3 మీటర్లు (3 అవకాశాలు) |
| షాట్‌పుట్ | 4.5 మీటర్లు (7.26 కిలోగ్రామ్స్) | --- |

#### రాత పరీక్ష

రాత పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్ 1 మల్టిపుల్ ఛాయిస్, పేపర్ 2 డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. పరీక్ష సమయం 2:30 గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.

పేపర్ 1

| విభాగం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్(పార్ట్ ఎ) | 75 | 150 |
| ప్రొఫెషనల్ స్కిల్స్ | 75 | 150 |

(పార్ట్ బి)

**పేపర్ 2:** ఎస్సే, ప్రిసైస్ రైటింగ్ అండ్ కాంప్రహెన్షన్- 100 మార్కులు. పరీక్ష సమయం రెండు గంటలు. సమాధానాలను ఇంగ్లిష్ లేదా హిందీ మాధ్యమాల్లోనే రాయాల్సి ఉంటుంది. ✦ రాత పరీక్షలో అర్హత సాధించినవారికి ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహించి ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.

### సిలబస్

**పేపర్ 1 (జనరల్ ఎబిలిటీ, ఇంటెలిజెన్స్, ప్రొఫెషనల్ స్కిల్)**

- **పార్ట్ ఎ (జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్):** జనరల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్ » క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ » న్యూమరికల్ ఎబిలిటీ » డేటా ఇంటర్‌ప్రిటేషన్, జనరల్ సైన్స్ » జనరల్ అవేర్‌నెస్ » శాస్త్రీయ కోణం » దైనందిక అంశాలపై అవగాహన » ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ » బయోటెక్నాలజీ »ఎన్విరామ్‌మెంటల్ సైన్స్‌తో పాటు సమకాలీన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సంస్కృతి, సంగీతం » కళలు, సాహిత్యం » క్రీడలు, పరిపాలన » సామాజిక, అభివృద్ధి అంశాలు » పరిశ్రమలు, వ్యాపారం » ప్రపంచీకరణ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి భారతదేశ చరిత్ర » ఇండియా, వరల్డ్ జాగ్రఫీ » ఇండియన్ పాలిటీ అండ్ ఎకానమీలపై అవగాహన పెంచుకోవాలి.
- **పార్ట్ బి (ప్రొఫెషనల్ స్కిల్స్)** సీఐఎస్ఎఫ్-ప్రొఫెషనల్ స్కిల్స్‌లో భాగంగా » ఇండస్ట్రియల్ సెక్యూరిటీ » ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఫైర్ ఫైటింగ్ » విపత్తు నిర్వహణ » ఏవియేషన్ సెక్యూరిటీ » క్రైమ్ అండ్ ఇంటెలిజెన్స్ -గూఢచర్యం, విద్రోహం » చుట్టూ భద్రత కల్పించడం (పెరీ మీటర్ సెక్యూరిటీ) » సెక్యూరిటీ ఆఫ్ డీఏఈ, మెట్రోరైలు(ఢిల్లీ), స్పేస్ తదితరాల గురించి తెలుసుండాలి. అలాగే » ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల ఉపయోగాలు » అలారమ్, డిటెక్షన్, ఇన్‌స్ట్రుషన్, యాక్సెస్ కంట్రోల్, ఫైర్ సేఫ్టీ » బాంబ్ డిస్పోజల్ » వీఐపీ సెక్యూరిటీ » ఇంటర్నల్ సెక్యూరిటీ అండ్ ఎలక్షన్ డ్యూటీస్‌కు సంబంధించిన నాలెడ్జ్ తప్పనిసరి.

✦ లాకు సంబంధించి సీఆర్‌పీసీ (తనిఖీ, స్వాధీనం, చట్టవ్యతిరేక సమావేశం) » ఐపీసీ (అపహరణ, తప్పుదోవ పట్టించడం, మోసం, అవినీతి తదితరం) »ఎవిడెన్స్ యాక్ట్(తనిఖీ, స్వాధీనం, ఆధారాల సేకరణ) » లేబర్ లాస్ (ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్, వర్క్‌మెన్ కాంపన్సేషన్ యాక్ట్, ఈపీఎఫ్ యాక్ట్) » క్రిమినల్ నేరాలు » మానవ హక్కులపై అవగాహన అవసరం.

✦ కంప్యూటర్ ప్రొఫిషియెన్సీలో భాగంగా.. » కంప్యూటర్ సెక్యూరిటీ » బేసిక్ కంప్యూటర్ ఆపరేషన్స్ » బేసిక్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్‌పై ప్రశ్నలు అడిగే అవకాశముంది. అలాగే సర్వీస్ రూల్స్, హెచ్ఆర్ అంశాలైన - సీసీఏ రూల్స్ » సీఐఎస్ఎఫ్ యాక్ట్ అండ్ రూల్స్ » సీఐఎస్ఎఫ్ సంబంధిత హెచ్ఆర్ విధులు గురించి కూడా తెలుసుండాలి.

**పేపర్ 2: ఎస్సే, ప్రిసైస్ రైటింగ్ అండ్ కాంప్రహెన్షన్**

ఈ పేపర్‌లో పేర్కొన్న అంశంపై అభ్యర్థి అభిప్రాయాలను పరీక్షిస్తారు. అభ్యర్థులు వ్యాసాన్ని సమగ్రంగా, అర్థమయ్యేలా రాయాలి. సమాధానాలు రాసేటప్పుడు వ్యాకరణ, పద దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి. ప్రిసైస్ రైటింగ్ అండ్ కాంప్రహెన్షన్‌కు సంబంధించి ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని ఏవిధంగా అర్థంచేసుకున్నారు? కాంప్రహెన్షన్‌కు సంబంధించి షార్ట్ ప్రశ్నలకు ఏవిధంగా సమాధానాలు ఇచ్చారు? తదితరాలను పరీక్షిస్తారు.

✦ **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in/

---

## ఉద్యోగ సమాచారం

### బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర-350

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 350 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **విభాగాల వారీ ఖాళీలు:** నెట్‌వర్క్ అండ్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్స్ -11, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్-4, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్-21, ప్రొడక్షన్ సపోర్ట్ ఇంజనీర్-7, ఈ-మెయిల్ అడ్మినిస్ట్రేటర్-2, బిజినెస్ అనలిస్ట్-5.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:**డిసెంబర్16, 2019
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019

2. **జనరలిస్ట్ ఆఫీసర్లు:** 300
- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ, జేఏఐఐబీ, సీఏఐఐబీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 20-38 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

### ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్-14

కొచ్చి ప్రధాన కేంద్రంగా ఉన్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 14 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** డిప్యూటీ మేనేజర్, ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, సీనియర్ ఆఫీసర్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, బీఈ/బీటెక్, సీఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 30-50 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 27, 2019
- **వెబ్‌సైట్:** www.airindiaexpress.in

### హెచ్ఎస్ఎల్-22

విశాఖపట్నంలోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 22 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ తదితర పోస్టులున్నాయి.
- **విభాగాలు:** హెచ్ఆర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, నేవల్ ఆర్కిటెక్చర్, కమర్షియల్, ఫైనాన్స్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 11, 2020. ▪ **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** జనవరి 21, 2020.
- **వెబ్‌సైట్:** www.hslvizag.in

### బీఈసీఐఎల్-98

నోయిడాలోని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్).. ఈస్ట్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఈడీఎంసీ)లో ఖాళీగా ఉన్న 98 పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** పబ్లిక్ హెల్త్ నర్స్-15, క్యాటరింగ్ సూపర్‌వైజర్-1, ఏఎన్ఎం-60, డ్రెస్సర్-12, డైటీషియన్-1, కుక్-1, ఎంటీఎస్-7, రిసెప్షనిస్ట్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, బీఎస్సీ (నర్సింగ్), మాస్టర్స్ డిగ్రీ (హోమ్ సైన్స్) ఉత్తీర్ణత, సంబంధిత పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 25, 2019
- **వెబ్‌సైట్:** www.becil.com

### మిధాని-17

హైదరాబాద్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 17 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** డిప్యూటీ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్, ఆఫీస్ అటెండెంట్, టర్నర్, జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఎస్సీ, బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, డిసెంబర్ 11 నాటికి పోస్టులను బట్టి 30-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ట్రేడ్/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 25, 2019
- **వెబ్‌సైట్:** http://midhani-india.in

# సాక్షి స్పోర్ట్స్

గురువారం
12-12-2019




ఆఖరి పోరులో భారత జట్టు 'ముగ్గురు మొనగాళ్లు' మెరిపించారు. కెప్టెన్ కోహ్లి (29 బంతుల్లో 70 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), రాహుల్ (56 బంతుల్లో 91; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), రోహిత్ శర్మ (34 బంతుల్లో 71; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) పరుగుల దాడికి విండీస్ శిబిరం చెల్లాచెదురైంది. తొలుత లోకేశ్ రాహుల్‌ను మించిన సిక్సర్లను రోహిత్ శర్మ బాదితే... 'హిట్‌మ్యాన్'ను తలదన్నేలా భారీ సిక్స్‌లతో కోహ్లి రెచ్చిపోయాడు. భారత బౌలర్లు కూడా ఆరంభంలోనే విండీస్ వికెట్లు తీయడంతో వార్ వన్‌సైడ్ అయింది. టీమిండియా ఖాతాలో విజయంతోపాటు సిరీస్ కూడా చేరింది.

# చితగ్గొట్టి... సిరీస్ పట్టి...



## నా శ్రీమతికి బహుమతి: కోహ్లి

విండీస్‌పై సాధించిన టి20 సిరీస్ విజయాన్ని తన భార్య అనుష్క శర్మకు రెండో వివాహ వార్షికోత్సవం బహుమతిగా ఇచ్చినట్లు కోహ్లి అన్నాడు. 'నా కెరీర్‌లో అద్భుత ఇన్నింగ్స్‌లలో ఇదొకటి. అదీ మా రెండో వివాహ వార్షికోత్సవం రోజున జరగడం ఎంతో ప్రత్యేకం' అని కోహ్లి తెలిపాడు.

- విరాట్ 'విధ్వంస' పర్వం
- చెలరేగిన రోహిత్, రాహుల్
- ఆఖరి పోరులో విండీస్‌పై భారత్ జయభేరి
- 2–1తో టీమిండియా సిరీస్ కైవసం

**ముంబై:** కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి! ఆడితే ఆడాలిరా రఫ్ఫాడాలి! అనే తెలుగు పాటకు సరిగ్గా సరిపోయే విన్యాసం చేశారు భారత బ్యాట్స్‌మెన్. ఓపెనర్లు రోహిత్, రాహుల్, కెప్టెన్ కోహ్లి సిక్స్‌లు కొట్టారు... విండీస్‌తో రఫ్ఫాడారు! దీంతో రెండు సార్లు టి20 ప్రపంచ చాంపియన్ అయిన వెస్టిండీస్ కకావికలమైంది. బుధవారం వాంఖెడే మైదానంలో జరిగిన ఆఖరి టి20లో భారత్ 67 పరుగుల తేడాతో విండీస్‌పై గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 240 పరుగుల భారీస్కోరు చేసింది. తర్వాత వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసి ఓడింది. పొలార్డ్ (39 బంతుల్లో 68; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) కాసేపు పోరాటం చేశాడు. భారత బౌలర్లు దీపక్ చాహర్, భువనేశ్వర్, షమీ, కుల్దీప్ తలా 2 వికెట్లు తీశారు. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'... కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాలు లభించాయి.

### రోహిత్ సూపర్ హిట్...

తొలి ఓవర్లోనే బౌండరీతో ఖాతా తెరిచిన రోహిత్ శర్మ... కాట్రెల్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో డీప్ వికెట్ మీదుగా కొట్టిన సిక్సర్‌తో 400 సిక్సర్ల క్లబ్‌లో చేరాడు. ఆ ఓవర్లో మరో రెండు బౌండరీలను బాదాడు. ఆ మరుసటి ఓవర్ తన వంతు అనుకున్నాడేమో రాహుల్! 4, 6లతో మొత్తం 14 పరుగులు సాధించాడు. ఐదో ఓవర్ తొలి బంతిని 'హిట్‌మ్యాన్' లాంగాన్‌లోకి సిక్స్‌గా తరలించాడు. దీంతో 4.1 ఓవర్లలోనే (25 బంతుల్లో) భారత్ 50 పరుగులు పూర్తయ్యాయి. తర్వాత బంతిని సిక్స్ బాదేందుకు ప్రయత్నించగా.. డీప్ మిడ్‌వికెట్ బౌండరీ లైన్ వద్ద అప్రమత్తంగా ఉన్న లూయిస్ అసాధారణ రీతిలో అడ్డుకున్నాడు. ఓపెనింగ్ జోరు చూసి ఇక లాభం లేదనుకొని పొలార్డ్ ఆరో ఓవర్లో విలియమ్స్‌ను రంగంలోకి దింపాడు. రాహుల్ అతనికి 4, 6, 4తో స్వాగతం పలికాడు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 72/0 స్కోరు చేసింది. ఎనిమిదో ఓవర్లో రోహిత్ రెచ్చిపోయాడు. పియరీ వేసిన ఆ ఓవర్‌లో చితగ్గొట్టాడు. డీప్‌స్క్వేర్ లెగ్‌లో ఒకటి, బౌలర్ తలమీది నుంచి మరొకటి ఇలా వరుస సిక్స్‌లు బాదడంతో 23 బంతుల్లోనే రోహిత్ అర్ధసెంచరీ పూర్తయ్యింది. ఆఖరి బంతిని బౌండరీకి తరలించడంతో 8వ ఓవర్లో భారత్ స్కోరు వంద దాటింది. ఈ ఓవర్లో 21 పరుగులొచ్చాయి.

### రాహుల్ జిగేల్...

గత మ్యాచ్‌లో విఫలమైన రాహుల్ సిరీస్‌ను నిర్ణయించే పోరులో బాధ్యతాయుతంగా ఆడాడు. ఒక్క లూజ్ షాట్ లేకుండా తన ఇన్నింగ్స్‌ను ఆఖరి ఓవర్‌దాకా కొనసాగించాడు. 'హిట్‌మ్యాన్' తర్వాత 9వ ఓవర్లో రాహుల్ కూడా 29 బంతుల్లో (6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫిఫ్టీ చేశాడు. తొలిసగం (10) ఓవర్లు ముగిసేసరికి భారత్ వికెట్ కోల్పోకుండా 116 పరుగులు చేసింది. వాల్ష్ వేసిన 11వ ఓవర్లో రోహిత్ బ్యాట్ నుంచి మరో సిక్స్ డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్‌లో పడింది. రాహుల్ మరో 2 బౌండరీలు సాధించడంతో భారత్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఓపెనర్లిద్దరి విధ్వంసకాండకు ఎట్టకేలకు విండీస్ బౌలర్ విలియమ్స్ బ్రేక్ వేశాడు. భారీ షాట్‌కు యత్నించిన రోహిత్... వాల్ష్ చేతికి చిక్కాడు. దీంతో 135 పరుగుల తొలి వికెట్ మెరుపు భాగస్వామ్యానికి తెరపడింది. గత మ్యాచ్‌లో శివమ్ దూబేను దించిన కోహ్లి ఈసారి రిషభ్ పంత్(0)కు ఆ అవకాశమిచ్చాడు. కానీ అతను డకౌటై నిరాశపరిచాడు.


రోహిత్, రాహుల్

**2** అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాలు నెగ్గిన రెండో క్రికెటర్ కోహ్లి (15). ఈ జాబితాలో సచిన్ (19) అగ్రస్థానంలో ఉన్నాడు. తాజా అవార్డుతో మూడో స్థానంలో ఉన్న జాక్వస్ కలిస్ (దక్షిణాఫ్రికా–14)ను కోహ్లి దాటేశాడు.

**1** అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరాజయాలు పొందిన జట్టుగా అగ్రస్థానంలో ఉన్న శ్రీలంక సరసన విండీస్ చేరింది. ఈ రెండు జట్లు ఇప్పటివరకు 61 టి20 మ్యాచ్‌ల చొప్పున ఓడిపోయాయి.

**1** అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాట్స్‌మెన్ 70 అంతకంటే ఎక్కువ పరుగులు చేయడం ఇదే తొలిసారి.

**4** ఒకే దేశంలో అంతర్జాతీయ టి20ల్లో 1000 పరుగులు పూర్తి చేసిన నాలుగో క్రికెటర్, భారత్ తరఫున తొలి క్రికెటర్‌గా కోహ్లి నిలిచాడు. గప్టిల్ (న్యూజిలాండ్), మొహమ్మద్ షహజాద్ (అఫ్గానిస్తాన్- యూఏఈలో), కొలిన్ మున్రో (న్యూజిలాండ్) కూడా ఈ ఘనత సాధించారు.

**5** అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో భారత ఓపెనర్లిద్దరూ అర్ధ సెంచరీలు చేయడం ఇది ఐదోసారి.


**3** అంతర్జాతీయ క్రికెట్‌లో 400 సిక్స్‌లు పూర్తి చేసుకున్న మూడో క్రికెటర్ రోహిత్ శర్మ. ఈ జాబితాలో గేల్ (విండీస్–534), అఫ్రిది (పాక్–476) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

### విండీస్ విలవిల...

కష్టసాధ్యమైన 241 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వెస్టిండీస్ ఆదిలోనే కష్టాల పాలైంది. తొలి ఓవర్లో 7 పరుగులు చేసిన విండీస్ ఆ తర్వాత ఓవర్‌కు ఓ వికెట్ చొప్పున నాలుగు ఓవర్లదాకా 3 కీలక వికెట్లను కోల్పోయింది. రెండో ఓవర్లో కింగ్ (5)ను భువనేశ్వర్, మూడో ఓవర్లో సిమన్స్ (7)ను షమీ, నాలుగో ఓవర్లో పూరన్ (0)ను చాహర్ పెవిలియన్ చేర్చారు. దాంతో విండీస్ 17 పరుగులకే మూడు టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. అనంతరం హెట్‌మైర్ (24 బంతుల్లో 41; 1 ఫోర్, 5 సిక్స్‌లు), పొలార్డ్ కాసేపు వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేసి చకచకా పరుగులు చేశారు. దూబే వేసిన ఏడో ఓవర్లో హెట్‌మైర్ 6, 4 కొట్టగా, పొలార్డ్ రెండు బౌండరీలు బాదడంతో ఆ ఓవర్లో 19 పరుగులు వచ్చాయి. 27 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హెట్‌మైర్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను షమీ నేలపాలు చేశాడు. అయినప్పటికీ అతను ఎంతోసేపు క్రీజులో నిలువలేకపోయాడు. పదో ఓవర్లో కుల్దీప్ హెట్‌మైర్‌ను బోల్తా కొట్టించాడు. తర్వాత పొలార్డ్ సిక్స్‌లతో విరుచుకుపడటంతో జట్టు స్కోరు 10.4 ఓవర్లలోనే వంద పరుగులకు చేరింది. పొలార్డ్ 33 బంతుల్లో (3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. అనంతరం అతన్ని భువీ ఔట్ చేయడంతో విండీస్ ఆశలన్నీ అడుగంటాయి. ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ లూయిస్ బ్యాటింగ్‌కు దిగలేదు.

## విరాట్... 2.0

భారత కెప్టెన్ కోహ్లి వచ్చీరాగానే విధ్వంసం మొదలెట్టాడు. భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ మ్యాచ్‌లో విరాట్ 2.0 వర్షన్ చూపెట్టాడు. మంచుకురిసే వేళలోనూ ఫీల్డర్లను చెమటలు కక్కించాడు. హోల్డర్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్లో 6, 1, 4, 6, 4, 1తో ఏకంగా 22 పరుగుల్ని పిండుకున్నాడు. ఆఖర్లో పొలార్డ్‌ను తన షాట్లతో 6, 6, 3, 4, 1, 1, 6 ఊచకోత కోశాడు. విండీస్ సారథి 19వ ఓవర్ వేయగా భారత కెప్టెన్ బేస్‌బాల్ షాట్‌తో లాంగాన్‌లో సిక్స్‌గా మలిచాడు. ఈసారి వికెట్లపై సంధించిన లెంత్‌బాల్‌ను తన మణికట్టు బలంతో మళ్లీ లాంగాన్ వైపే సిక్సర్‌గా తరలించాడు. ఈ రెండు సిక్స్‌లతో కోహ్లి 21 బంతుల్లోనే (3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. మూడో బంతి నోబాల్ కాగా, ఆ తర్వాత ఫోర్, సిక్స్‌తో మొత్తం 27 పరుగుల్ని సాధించాడు. అంతకుముందు కాట్రెల్ బౌలింగ్‌లో చెరో బౌండరీ బాదిన కోహ్లి, రాహుల్ తర్వాత విలియమ్స్ బౌలింగ్‌నూ విడిచిపెట్టలేదు. మొదట లాంగాఫ్‌లో రాహుల్ సిక్సర్ బాదగా... బంతి వ్యవధిలో కోహ్లి లాంగాన్‌లో సిక్సర్ బాదారు. దీంతో 17.4 ఓవర్లలోనే భారత్ స్కోరు 200 పరుగులకు చేరింది. చివరి ఓవర్లో రాహుల్ నిష్క్రమించినా... కోహ్లి ఆఖరి బంతికి సిక్స్‌తో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.


పొలార్డ్

## స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) వాల్ష్ (బి) విలియమ్స్ 71; లోకేశ్ రాహుల్ (సి) పూరన్ (బి) కాట్రెల్ 91; రిషభ్ పంత్ (సి) హోల్డర్ (బి) పొలార్డ్ 0; కోహ్లి (నాటౌట్) 70; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 240.**
**వికెట్ల పతనం:** 1–135, 2–138, 3–233.
**బౌలింగ్:** కాట్రెల్ 4–0–40–1; హోల్డర్ 4–0–54–0; క్యారీ పియరీ 2–0–35–0, కాస్రిక్ విలియమ్స్ 4–0–37–1; వాల్ష్ 4–0–38–0; పొలార్డ్ 2–0–33–1.
**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** సిమన్స్ (సి) అయ్యర్ (బి) షమీ 7; బ్రాండన్ కింగ్ (సి) రాహుల్ (బి) భువనేశ్వర్ 5; హెట్‌మైర్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 41; పూరన్ (సి) దూబే (బి) దీపక్ చాహర్ 0; పొలార్డ్ (సి) (సబ్) జడేజా (బి) భువనేశ్వర్ 68; హోల్డర్ (సి) (సబ్) మనీశ్ పాండే (బి) కుల్దీప్ 8; వాల్ష్ (బి) షమీ 11; క్యారీ పియరీ (సి) (సబ్) జడేజా (బి) దీపక్ చాహర్ 6; కాస్రిక్ విలియమ్స్ (నాటౌట్) 13, కాట్రెల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 173.**
**వికెట్ల పతనం:** 1–12, 2–17, 3–17, 4–91, 5–103, 6–141, 7–152, 8–169.
**బౌలింగ్:** దీపక్ చాహర్ 4–0–20–2; భువనేశ్వర్ 4–0–41–2; షమీ 4–0–25–2; శివమ్ దూబే 3–0–32–0; కుల్దీప్ యాదవ్ 4–0–45–2; వాషింగ్టన్ సుందర్ 1–0–5–0.

## మళ్లీ ఓడిన హైదరాబాద్



**పుణే:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు ఆరో ఓటమి చవిచూసింది. ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 2–3 గోల్స్ తేడాతో ఓడింది. ఒడిశా తరఫున డెల్గాడో (27వ ని.లో), జిస్కో హెర్నాండెజ్ (41వ ని.లో), పెరెజ్ (71వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. హైదరాబాద్ జట్టుకు బోబో (65వ ని.లో), రోహిత్ (89వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.

# విదర్భకు భారీ ఆధిక్యం

- సతీశ్ గణేశ్ డబుల్ సెంచరీ
- ఆంధ్రతో రంజీ మ్యాచ్


సతీశ్


వినయ్


పృథ్వీషా

**మూలపాడు (విజయవాడ):** మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ సతీశ్ గణేశ్ (397 బంతుల్లో 237; 25 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత డబుల్ సెంచరీ చేయడంతో... ఆంధ్ర జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ పటిష్ట స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 268/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు 147.3 ఓవర్లలో 441 పరుగులకు ఆలౌటైంది. 230 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. ఆంధ్ర బౌలర్లలో స్టీఫెన్ ఐదు వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 100 పరుగులు చేసింది.

### వినయ్ ఖాతాలో 400 వికెట్లు...

రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో భాగంగా బిహార్‌తో జరిగిన మ్యాచ్‌లో పుదుచ్చేరి జట్టు 10 వికెట్ల తేడాతో గెలిచింది. పుదుచ్చేరికి ఆడుతున్న భారత జట్టు మాజీ బౌలర్, కర్ణాటకకు చెందిన వినయ్ కుమార్ ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీయడంద్వారా రంజీల్లో 400 వికెట్లు పడగొట్టిన రెండో పేస్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. పంకజ్ సింగ్ (409 వికెట్లు) మాత్రమే వినయ్‌కంటే ముందున్నాడు. ఓవరాల్‌గా రంజీ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు లెఫ్టార్మ్ స్పిన్నర్ రాజిందర్ గోయల్ (637 వికెట్లు) పేరిట ఉంది.

### పృథ్వీ షా డబుల్ సెంచరీ...

డోపింగ్ నిషేధం పూర్తయ్యాక పునరాగమనంలో ముంబై యువ ఆటగాడు పృథ్వీ షా అదరగొడుతున్నాడు. బరోడాతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లోపృథ్వీ షా (179 బంతుల్లో 202; 19 ఫోర్లు, 7 సిక్స్‌లు) రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేశాడు. ఫలితంగా ముంబై రెండో ఇన్నింగ్స్‌ను 4 వికెట్లకు 409 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. బరోడాకు 534 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది.



# సింధుకు షాక్

- అకానె యామగుచి చేతిలో ఓటమి
- వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ

**గ్వాంగ్‌జౌ (చైనా):** బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, భారత స్టార్ పీవీ సింధుకు తొలి లీగ్ మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్)తో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ సింధు 21–18, 18–21, 8–21తో ఓడిపోయింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను గెలిచి, రెండో గేమ్‌లో 11–6తో ఆధిక్యంలో నిలిచి విజయం దిశగా సాగింది. అయితే ఈ ఏడాది సింధుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ యామగుచి పట్టువిడవకుండా పోరాడింది. స్కోరు 11–15తో ఉన్నదశలో యామగుచి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 16–15తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత సింధుపై మరింత ఒత్తిడి పెంచిన యామగుచి గేమ్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో యామగుచి చెలరేగిపోగా... సింధు డీలా పడింది. ఆరంభంలోనే 5–0తో ఆధిక్యంలోకి వెళ్లిన యామగుచి ఆ తర్వాత సింధుకు ఏదశలోనూ కోలుకునే అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది.

నేడు జరిగే గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా)తో సింధు ఆడుతుంది. సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో సింధు తప్పనిసరిగా గెలవాలి. ముఖాముఖి రికార్డులో సింధు 6–3తో చెన్ యుఫెపై ఆధిక్యంలో ఉంది. ఈ ఏడాది చెన్ యుఫెతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ సింధునే నెగ్గింది.

## సింధుకు డోప్ పరీక్ష!

యామగుచితో మ్యాచ్ ముగిసిన తర్వాత సింధుకు డోప్ పరీక్ష నిర్వహించారు. గత రెండు నెలల్లో సింధుకు ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా), జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఆధ్వర్యంలో నాలుగుసార్లు (డెన్మార్క్, పారిస్, హైదరాబాద్) డోప్ టెస్టులు జరిగాయని సింధు తండ్రి రమణ తెలిపారు. నేడు చైనా ప్లేయర్ చెన్ యుఫెతో మ్యాచ్ ఉందనగా చైనా కాలమానం ప్రకారం రాత్రి ఒకటిన్నరకు సింధుకు డోప్ టెస్టు నిర్వహించడంపట్ల రమణ అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండో మ్యాచ్‌కు ముందు సింధుకు తగిన విశ్రాంతి లభించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.


భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు అజహరుద్దీన్ తనయుడు అసద్‌తో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సోదరి ఆనమ్ 'నిఖా' బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. నేడు హైదరాబాద్‌లోనే వీరిద్దరి వివాహ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## దక్షిణాసియా క్రీడల విజేతలకు నజరానా

**న్యూఢిల్లీ:** గతంలో ఎన్నడూలేని విధంగా దక్షిణాసియా క్రీడల్లో (శాగ్) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత క్రీడాకారులకు కేంద్ర క్రీడా శాఖ నగదు పురస్కారాలు ప్రకటించింది. నేపాల్‌లో మంగళవారం ముగిసిన ఈ క్రీడల్లో భారత్ అత్యధికంగా 312 పతకాలు సాధించి మరోసారి 'టాప్'లో నిలిచింది. ఈ క్రీడల్లో భారత్‌కు 174 స్వర్ణాలు... 93 రజతాలు... 45 కాంస్యాలు లభించాయి. ఇప్పటివరకు జరిగిన అన్ని 'శాగ్' క్రీడల్లో భారత్ టాప్ ర్యాంక్‌లోనే నిలిచింది. ఈసారి స్వర్ణ పతక విజేతలకు రూ. లక్షా 50 వేలు చొప్పున... రజతాలు నెగ్గిన వారికి రూ. లక్ష చొప్పున... కాంస్యాలు కైవసం చేసుకున్న వారికి రూ. 50 వేలు చొప్పున కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ఇక్కడ జరిగిన సన్మాన కార్యక్రమంలో అందజేశారు.

## డోపీలు సుమీత్, రవి





**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత బాక్సర్ సుమీత్ సాంగ్వాన్... షూటర్ రవి కుమార్ డోపింగ్ పరీక్షల్లో పట్టుబడ్డారు. వీరిద్దరు ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత ఔషధాల జాబితాలో ఉన్నవాటిని వినియోగించినట్టు డోప్ పరీక్షల్లో తేలింది. సుమీత్ 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచాడు. సుమీత్ ఎసిటజోలామైడ్ ఉత్ప్రేరకం వాడినట్లు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తెలిపింది. గత ఏడాది జరిగిన కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కాంస్య పతకాలు గెలిచిన షూటర్ రవి కుమార్ ప్రొప్రానోలోల్ ట్యాబ్లెట్‌ను వాడినట్లు డోప్ పరీక్షలో తేలింది. మైగ్రేన్ తలనొప్పి వచ్చినపుడు డాక్టర్ వద్దకు వెళ్లగా అతను ఈ ట్యాబ్లెట్ రాసిచ్చాడని రవి తెలిపాడు.

## శ్రీలంక 202/5

**రావల్పిండి:** పదేళ్ల తర్వాత పాకిస్తాన్‌లో జరుగుతున్న మొదటి అంతర్జాతీయ టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో తొలి రోజు ఆతిథ్య, పర్యాటక జట్లు సమఉజ్జీలుగా నిలిచాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు వెలుతురులేమితో ఆట నిలిపి వేసే సమయానికి 68.1 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు సాధించింది. కెప్టెన్ కరుణరత్నే (110 బంతుల్లో 59; 9 ఫోర్లు), ఒషాడా ఫెర్నాండో (81 బంతుల్లో 40; 6 ఫోర్లు, సిక్స్) తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే ఓపెనర్లు వెనుదిరిగాక లంక ఇన్నింగ్స్ తడబడింది. ఎంజెలో మాథ్యూస్ (77 బంతుల్లో 31; 4 ఫోర్లు) క్రీజులో నిలదొక్కుకుంటున్న సమయంలో నసీమ్ షా బౌలింగ్‌లో అవుటయ్యాడు. ప్రస్తుతం ధనంజయ డి సిల్వా (77 బంతుల్లో 38 బ్యాటింగ్; 6 ఫోర్లు), డిక్‌వెలా (13 బంతుల్లో 11 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లలో నసీమ్ షాకు రెండు వికెట్లు దక్కగా... అబ్బాస్, షాహీన్ అఫ్రిది, ఉస్మాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

సాక్షి బిజినెస్
గురువారం
12-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 173 ▲ | 53 ▲ |
| 40,413 | 11,910 |

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,628 | ▲ | 12 |
| డోజోన్స్ | 27,829 | ▼ | 47 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,216 | ▲ | 2 |
| డాక్స్ | 13,147 | ▲ | 76 |
| షాంఘై | 2,924 | ▲ | 7 |
| నికాయ్ | 23,392 | ▼ | 18 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్


మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.10 | 71.74 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.55 | 94.80 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.22 | 80.13 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.02 | 66.46 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.28 | 49.46 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.28 | 53.06 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.10 | 19.70 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.82 | 19.83 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.44 | 10.85 |

# అందరివాడు... దాస్

**ఆర్‌బీఐ గవర్నర్‌గా ఏడాది**




**న్యూఢిల్లీ:** దేశీ బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టి సంవత్సరమవుతోంది. గతేడాది డిసెంబర్ 12న ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ అర్ధంతరంగా నిష్క్రమించిన తర్వాత అనూహ్యంగా ఆ స్థానంలో దాస్ నియమితులయ్యారు. బ్యూరోక్రాట్ స్థాయి నుంచి స్వతంత్ర ప్రతిపత్తి గల ఆర్‌బీఐ 25వ గవర్నర్‌గా ఎదిగారాయన. 1980 బ్యాచ్ తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. గతంలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సహా పలు హోదాల్లో సేవలు అందించారు. అందరినీ కలుపుకుపోవడం, అందరూ తమ అభిప్రాయాలు తెలిపేందుకు అవకాశమివ్వడం .. దాస్ స్టయిల్ అంటారు ఆయన్ను గురించి తెలిసినవారు. ప్రభుత్వానికి నిధుల బదిలీ, మొండిబాకీల పరిష్కారానికి కొత్త విధానం ప్రవేశపెట్టడం మొదలుకుని వరుసగా పలు దఫాలు కీలక రేట్లను తగ్గించడం దాకా ఈ ఏడాది కాలంలో ఆర్‌బీఐ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. బ్యాంకింగ్ రంగంలో సంక్షోభాలు, మందగిస్తున్న ఆర్థిక వృద్ధి తదితర సవాళ్ల మధ్య దాస్ సారథ్యంలో ఆర్‌బీఐ పనితీరును ఒకసారి సింహావలోకనం చేస్తే ..

- ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే క్రమంలో ఆర్‌బీఐ 2019 ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా అయిదు విడతల్లో 135 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆగస్టులో అసాధారణంగా 35 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అయితే, కచ్చితంగా మరో విడత రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలను తల్లకిందులు చేస్తూ నవంబర్‌లో నిర్ణయం తీసుకోవడం అందర్నీ విస్మయపర్చింది.
- స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి అంచనాలను కూడా మొత్తం మీద 240 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.
- ఆర్‌బీఐ వద్ద ఎంత మేర నిధులు ఉండాలన్న వివాదాస్పద చర్చకు ముగింపునిచ్చి, కేంద్రానికి రూ. 1,76,051 కోట్ల మేర మిగులు నిధులను రిజర్వ్ బ్యాంక్ బదలాయించింది.
- చిన్న, మధ్యతరహా సంస్థలకు ఊరటనిస్తూ వన్ టైమ్ రుణ పునర్ వ్యవస్థీకరణ వెసులుబాటు కల్పించింది.
- సత్వర దిద్దుబాటు చర్యలకు (పీసీఏ) సంబంధించిన ఆంక్షలు ఎదుర్కొంటున్న 11 బ్యాంకుల్లో నుంచి మూడు బ్యాంకులను (బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) బైటికి తెచ్చింది.
- సంస్కరణలపరంగా చూస్తే.. ద్రవ్య పరపతి విధానాల ప్రయోజనాలు సత్వరం బదిలీ అయ్యేలా... బ్యాంకులు రుణాలకు సంబంధించి రెపో ఆధారిత ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానానికి మళ్లేలా దాస్ కృషి చేశారు.
- రోజంతా చెల్లింపుల వ్యవస్థలు పనిచేసేలా చూసేందుకు నెఫ్ట్ సదుపాయం 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఇది 2020 జనవరి నుంచి అమల్లోకి వస్తోంది.

### ఆర్‌బీఐదే తుది నిర్ణయం..

ఆర్‌బీఐ, ప్రభుత్వం మధ్య చాలా విషయాలపై విస్తృతంగా చర్చలు జరుగుతాయి. కానీ, అంతిమంగా నిర్ణయం తీసుకునేది రిజర్వ్ బ్యాంకే. నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్‌బీఐకి 100 శాతం పైగా స్వయం ప్రతిపత్తి ఉంది. ఇందులో ఎవరి జోక్యం ఉండదు.


– శక్తికాంత దాస్, గవర్నర్, ఆర్‌బీఐ

### అందర్నీ ఒకే తాటిపైకి తెచ్చారు

నిబద్ధత, పారదర్శకత, నిజాయితీ గల వ్యక్తి శక్తికాంత దాస్. ప్రభుత్వాన్ని, వ్యవస్థను ఒకే తాటిపైకి తేవడంలోనూ, బోర్డును సమగ్రంగా తీర్చిదిద్దడంలోను అన్ని విధాలా సఫలీకృతమయ్యారు.

– సచిన్ చతుర్వేది, ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సభ్యుడు

## దేశీ మార్కెట్లోకి అమెజాన్ ఫైర్ టీవీలు




- ఒనిడాతో ఒప్పందం
- ధర రూ. 12,999–రూ. 21,999

**న్యూఢిల్లీ:** ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తాజాగా తమ ఫైర్ టీవీ బ్రాండ్ స్మార్ట్ టీవీలను భారత్‌లో ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం ఒనిడా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. 32 అంగుళాల ఒనిడా ఫైర్ టీవీ స్మార్ట్ టీవీ ధర రూ.12,999 కాగా, 43 అంగుళాల టీవీ ధర రూ.21,999. డిసెంబర్ 20 నుంచి అమెజాన్‌డాట్ ఇన్ పోర్టల్‌లో వీటి విక్రయం ప్రారంభమవుతుంది. ఈ ఫుల్ హెచ్‌డీ టీవీల్లో బిల్టిన్ వైఫై, 3 హెచ్‌డీఎంఐ పోర్టులు, 1 యూఎస్‌బీ పోర్టు, 1 ఇయర్‌ఫోన్ పోర్టు తదితర ఫీచర్స్ ఉంటాయి. ఫైర్ టీవీ స్మార్ట్ టీవీలను 2018లో అమెరికా, కెనడాలో అమెజాన్ ప్రవేశపెట్టింది. ఈ ఏడాది బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రియా తదితర దేశాల్లోకి విస్తరించింది. ఇందుకోసం డిక్సన్స్ కార్‌ఫోన్, మీడియామార్కెట్ శాటర్న్, గ్రండిగ్ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. భారత్‌లో ఒనిడాతో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇతర సంస్థలతో కూడా కలిసి పనిచేసే అవకాశాలున్నాయని ఫైర్ టీవీ డివైజెస్ అండ్ ఎక్స్‌పీరియన్సెస్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సందీప్ గుప్తా తెలిపారు. అమ్మకాల లక్ష్యాలను మాత్రం వెల్లడించలేదు.

నాణ్యమైన పిక్చర్, సౌండ్ ఫీచర్స్‌తో అందుబాటు ధరల్లో ఒనిడా ఫైర్ టీవీ ఎడిషన్ లభిస్తుందని మిర్క్ ఎలక్ట్రానిక్స్ (ఒనిడా) బిజినెస్ హెడ్ సునీల్ శంకర్ తెలిపారు. అమెజాన్ ప్రస్తుతం భారత్‌లో ఫైర్ టీవీ స్ట్రీమింగ్ స్టిక్‌లు, ఎకో (స్మార్ట్ స్పీకర్స్), కిండిల్ (ఈ–బుక్ రీడర్) వంటి ఉత్పత్తులు విక్రయిస్తోంది.

## ఖతార్ ఫండ్‌కు అదానీ ఎలక్ట్రిసిటీలో వాటా

**డీల్ విలువ రూ.3,200 కోట్లు**




**న్యూఢిల్లీ:** అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్‌లో 25.1 శాతం వాటాను ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(క్యూఐఏ) కొనుగోలు చేయనున్నది. ఈ డీల్ విలువ రూ.3,200 కోట్లు. ఈ మేరకు ఖతార్‌కు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్, ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీతో నిశ్చయాత్మక ఒప్పందం కుదుర్చుకున్నామని అదానీ గ్రూప్‌లో భాగమైన అదానీ ట్రాన్స్‌మిషన్ తెలిపింది. అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీకి చెందిన అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై సంస్థ(ఏఈఎంఎల్), ముంబైలో 400 చదరపు కిలోమీటర్ల పరిధిలో 30 లక్షల మంది వినియోగదారులకు విద్యుత్తును పంపిణీ చేస్తోంది. ఈ డీల్ నేపథ్యంలో అదానీ ట్రాన్స్‌మిషన్ షేర్ ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ.350ను తాకింది. చివరకు 1.7 శాతం లాభంతో రూ.342 వద్ద ముగిసింది.

# సౌదీ ఆరామ్‘కింగ్’!




**లిస్టింగ్‌లో అదరగొట్టిన చమురు దిగ్గజం**

- 10 శాతం అప్పర్ సర్క్యూట్‌తో 35.3 రియాల్స్‌కు షేర్ ధర
- 1.88 లక్షల కోట్ల డాలర్లకు పెరిగిన సంస్థ విలువ
- ప్రపంచంలో అత్యధిక మార్కెట్ విలువున్న కంపెనీగా ఘనత
- ఇక రెండో స్థానానికి యాపిల్...

**దుబాయ్:** సౌదీ అరేబియా చమురు దిగ్గజం సౌదీ ఆరామ్‌కో స్టాక్ మార్కెట్ అరంగేట్రం అదిరిపోయింది. ఇష్యూ ధర 32 రియాల్స్‌తో పోలిస్తే 10 శాతం అప్పర్ సర్క్యూట్‌తో 35.3 రియాల్స్ ధరను (9.39 డాలర్లు –రూ.662) తాకింది. ఈ ధర వద్ద కంపెనీ విలువ 1.88 లక్షల కోట్ల డాలర్లు. మన రూపాయల్లో 132.5 లక్షల కోట్లు. గురువారం కూడా ఈ షేర్ మరో 10 శాతం పెరిగితే సౌదీ అరేబియా పాలకులు ఆశించిన 2 లక్షల కోట్ల డాలర్ల విలువ గల కంపెనీ అనే మైలురాయిని సౌదీ ఆరామ్‌కో చేరనున్నదని అంచనా. సౌదీ ఆరామ్‌కో కంపెనీ తర్వాతి స్థానాల్లో ఉన్న ఇతర ఐదు చమురు కంపెనీల (ఎక్సాన్ మొబిల్, టోటల్, రాయల్ డచ్ షెల్, షెవ్రాన్, బీపీ) మొత్తం మార్కెట్ విలువ కన్నా కూడా సౌదీ ఆరామ్‌కో కంపెనీ విలువే ఎక్కువ కావడం విశేషం. వచ్చే ఐదేళ్ల పాటు ఏడాదికి 7,500 కోట్ల డాలర్ల చొప్పున డివిడెండ్‌ను ఇవ్వాలని ఈ కంపెనీ యోచిస్తోంది.

**ఐపీఓ, మార్కెట్ విలువలోనూ అగ్రస్థానం....**

ఇటీవలే ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా 1.5 శాతం వాటా షేర్లను విక్రయించి 2,560 కోట్ల డాలర్లు (రూ.1,80,480 కోట్లు) సమీకరించి ప్రపంచంలోనే అతి పెద్ద ఐపీఓగా ఈ కంపెనీ అవతరించింది. ఇప్పటివరకూ 2,500 కోట్ల డాలర్లతో అలీబాబా పేరిట ఉన్న అతి పెద్ద ప్రపంచ ఐపీఓ రికార్డ్‌ను సౌదీ ఆరామ్‌కో బ్రేక్ చేసింది. ఇక బంపర్ లిస్టింగ్‌తో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా కూడా ప్రపంచ నెంబర్–1 కంపెనీగా సౌదీ ఆరామ్‌కో అవతరించింది. అంతే కాకుండా లిస్టెడ్ కంపెనీల పరంగా ప్రపంచంలోనే టాప్ 10 స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఒకటిగా (తొమ్మిదవ స్థానాన్ని) సౌదీ అరేబియా స్టాక్ ఎక్స్ఛేంజ్ నిలిచేందుకు ఈ కంపెనీ తోడ్పడింది. ఇప్పటిదాకా లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువను సాధించిన కంపెనీలు ప్రపంచంలో రెండే ఉన్నాయి. 1.19 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువతో యాపిల్, 1.15 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్‌తో మైక్రోసాఫ్ట్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కంపెనీల తర్వాతి స్థానాల్లో గూగుల్ మాతృ కంపెనీ ఆల్ఫాబెట్ (92,600 కోట్ల డాలర్లు), ఆన్‌లైన్ రిటైల్ దిగ్గజం అమెజాన్ (86,200 కోట్ల డాలర్లు), సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ (57,200 కోట్ల డాలర్లు) నిలిచాయి.

### అగ్రస్థాయి ఆరు కంపెనీలు (మార్కెట్ క్యాప్ పరంగా)

| స్థానం | కంపెనీ | మార్కెట్ క్యాప్ (కోట్ల డాలర్లు) |
|---|---|---|
| 1 | సౌదీ ఆరామ్‌కో | 1,88,000 |
| 2 | యాపిల్ | 1,19,000 |
| 3 | మైక్రోసాఫ్ట్ | 1,15,000 |
| 4 | ఆల్ఫాబెట్(గూగుల్) | 92,600 |
| 5 | అమెజాన్ | 86,200 |
| 6 | ఫేస్‌బుక్ | 57,200 |

### 13 రిలయన్స్‌లకు మించి...

ఇక మన దేశంలో అత్యధిక మార్కెట్ క్యాప్ కంపెనీగా రూ.9,90,564 కోట్లతో(14,050 కోట్ల డాలర్లు) రిలయన్స్ ఇండస్ట్రీస్ నిలిచింది. ఒక విధంగా చెప్పాలంటే రిలయన్స్ ఇండస్ట్రీస్ లాంటి 13 కంపెనీలు కలిసినా... ఒక సౌదీ ఆరామ్‌కో కన్నా తక్కువే!!

- 1938లో ఒక చమురు బావితో సౌదీ ఆరామ్‌కో ప్రస్థానం మొదలైంది.
- ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత లాభదాయక, అతి పెద్దదైన చమురు కంపెనీగా మారింది.
- ప్రపంచవ్యాప్తంగా మొత్తం ముడి చమురు సరఫరాల్లో 10% ఈ సంస్థదే.
- 2018లో కంపెనీ నికర లాభం 46% ఎగసి 11,110 కోట్ల డాలర్లకు పెరిగింది. 35,600 కోట్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది.



## ఈ ఏడాది భారత్ వృద్ధి 5.1 శాతమే!

- ఆసియా అభివృద్ధి బ్యాంక్ అంచనా
- 2020లో 6.5% ఉంటుందని విశ్లేషణ




**న్యూఢిల్లీ:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 2019లో 5.1 శాతమే ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) తాజా నివేదికలో పేర్కొంది. ఉపాధి అవకాశాలు నెమ్మదించడం, పంట దిగుబడులు సరిగాలేక గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ బలహీనత, రుణ వృద్ధి మందగమనం వంటి అంశాలు దీనికి కారణమని ఏడీబీ విశ్లేషించింది. అయితే 2020లో భారత్ వృద్ధి 6.5 శాతం ఉంటుందని అంచనావేసింది. ప్రభుత్వ విధానాలు, సంస్కరణలు ఫలితాన్ని ఇచ్చే అవకాశాలు ఉండడం 2020పై తమ అంచనాలకు కారణమని తన 2019 అప్‌డేటెడ్ ఆసియన్ డెవలప్‌మెంట్ అవుట్‌లుక్‌లో ఏడీబీ పేర్కొంది.

**రెండవసారి కోత...:** నిజానికి 2019లో 7 శాతం వృద్ధి రేటు ఉంటుందని తొలుత ఏడీబీ అంచనావేసింది. అయితే సెప్టెంబర్ మొదట్లో దీనిని 6.5 శాతానికి తగ్గించింది. తాజాగా దీనిని మరింత కుదించి 5.1 శాతానికి చేర్చింది. ఇక 2020 విషయానికి వస్తే, తొలి అంచనా 7.2 శాతం అయితే దీనిని 6.5 శాతానికి తాజాగా తగ్గించింది. 2018లో భారత్ వృద్ధిరేటు 6.8 శాతంగా ఏడీబీ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి వరకూ) దేశీయ వృద్ధి రేటును 6.1 శాతం నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 5 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.

### ఐఎఫ్‌ఎస్‌సీల నియంత్రణకు ప్రత్యేక సంస్థ

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ (ఐఎఫ్‌ఎస్‌సీ)ల్లో ఆర్థిక లావాదేవీల నియంత్రణ కోసం ఏకీకృత సంస్థ ఏర్పాటుకు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. దేశీయంగా తొలి ఐఎఫ్‌ఎస్‌సీ గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో ఏర్పాటైంది. దీన్ని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్–సిటీ (గిఫ్ట్)గా వ్యవహరిస్తున్నారు. ఈ నియంత్రణ సంస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, అయితే.. సీవీసీ, కాగ్ పరిధిలో ఉంటుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

## దివాలా కోడ్‌కు మరిన్ని సవరణలు

- ఎన్‌హెచ్‌ఏఐ ఇన్‌విట్‌కు ఓకే...
- బ్యాంకులకు పాక్షిక రుణ హామీ పథకానికి ఆమోదముద్ర
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు...




**న్యూఢిల్లీ:** దివాలా పరిష్కార ప్రక్రియను క్రమబద్ధీకరించే దిశగా దివాలా కోడ్ (ఐబీసీ)లో మరిన్ని సవరణలకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. దీనితో పాటు ఇతరత్రా పలు ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలుపుతూ కేంద్ర క్యాబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఐబీసీ సవరణలకు సంబంధించి.. దివాలా తీసిన సంస్థలను కొనుగోలు చేసిన బిడ్డర్లకు ఊరట లభించే ప్రతిపాదనలు వీటిలో ఉన్నాయి. వీటి ప్రకారం ఆయా కంపెనీల గత ప్రమోటర్లు చేసిన తప్పిదాలకు కొత్త యాజమాన్యం.. క్రిమినల్ విచారణ ఎదుర్కొనాల్సిన అవసరం ఉండదు. 2016లో అమల్లోకి వచ్చిన ఐబీసీకి ఇప్పటికే మూడు సార్లు సవరణలు చేశారు. తాజాగా కొన్ని సెక్షన్లను సవరించడంతో పాటు కొత్తగా మరో సెక్షన్‌ను చేర్చారు. ఐబీసీ (రెండో సవరణ) బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం దివాలా పరిష్కార ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా దర్యాప్తు సంస్థలు ఆయా కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం కొనసాగిస్తున్నాయి. దీంతో దివాలా సంస్థల కొనుగోలుకు ఇన్వెస్టర్లు వెనుకాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా సవరణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఎన్‌బీఎఫ్‌సీలకు బాసట..**

సంక్షోభంలో ఉన్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు(ఎన్‌బీఎఫ్‌సీ), గృహ రుణ సంస్థలకు (హెచ్‌ఎఫ్‌సీ) ఊరటనిచ్చే స్కీమునకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. ఆర్థికంగా బలంగా ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీలకు సంబంధించిన అత్యధిక రేటింగ్ గల ఆస్తులను కొనుగోలు చేసే ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీ) ప్రభుత్వం పాక్షికంగా రుణ హామీ కల్పిస్తుంది. ఆయా అసెట్స్ విలువలో పది శాతం లేదా రూ. 10,000 కోట్ల దాకా (ఏది తక్కువైతే అది) నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఈ పూచీకత్తు ఉపయోగపడుతుంది. 2020 జూన్ దాకా ఆరు నెలల పాటు లేదా రూ. 1,00,000 కోట్ల అసెట్స్ కొనుగోలు పూర్తయ్యేదాకా ఈ స్కీము అమల్లో ఉంటుంది. అవసరమైతే దీన్ని మరో మూడు నెలల పాటు ఆర్థిక మంత్రి పొడిగించవచ్చు.

### ఎన్‌హెచ్‌ఏఐ ‘ఇన్‌విట్’...



ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్‌విట్) ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్‌హెచ్‌ఏఐకి అనుమతినిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. మ్యూచువల్ ఫండ్స్ తరహాలోనే ఇది కూడా పలువురు ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరించి, ఇన్‌ఫ్రా అసెట్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు రాబడులు అందిస్తుంది. దాదాపు రూ. 5,35,000 కోట్ల పెట్టుబడితో దేశవ్యాప్తంగా 24,800 కి.మీ. మేర రహదారులు అభివృద్ధి చేసే దిశగా 2017 అక్టోబర్‌లో కేంద్రం భారత్‌మాలా పరియోజన కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. ఈ ప్రాజెక్టుల పూర్తికి భారీ స్థాయిలో నిధులు అవసరమవుతాయి.

# అలా ఎలా రుణాలిచ్చేశారు?

- ‘కార్వీ స్టాక్ బ్రోకింగ్’ స్కామ్‌లో బ్యాంకుల పాత్రపై సెబీ సందేహాలు
- విచారణ జరపాలని ఆర్‌బీఐను కోరే అవకాశం

**ముంబై:** క్లయింట్ల షేర్లను సొంతానికి వాడుకుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) వివాదం... తాజాగా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మెడకు కూడా చుట్టుకుంటోంది. తనఖా పెట్టిన షేర్ల గురించి పూర్తిగా మదింపు చేయకుండా అవి కార్వీకి ఎలా రుణాలిచ్చాయన్న అంశంపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దృష్టి సారించింది. దీనికి సంబంధించి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలపై విచారణ జరపాలంటూ రిజర్వ్ బ్యాంక్‌కు సెబీ లేఖ రాసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అక్రమంగా క్లయింట్ల సెక్యూరిటీలను తనఖా పెట్టి రుణాలు తీసుకున్నప్పుడే బ్యాంకులు అప్రమత్తం కావాల్సిందని సెబీ వర్గాలు పేర్కొంటున్నాయి. కార్వీ తనఖా పెట్టిన షేర్లను క్లయింట్ల ఖాతాల్లోకి మళ్లించాలంటూ డిసెంబర్ 2న సెబీ ఆదేశించటంతో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌డీఎల్) దాదాపు 90 శాతం మంది క్లయింట్లకు షేర్లను బదలాయించడం తెలిసిందే. అయితే, తమకు పూచీకత్తుగా ఉంచిన షేర్లను క్లయింట్లకెలా బదలాయిస్తారంటూ బ్యాంకులు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ‘ఆ షేర్లపై కార్వీకే అధికారాల్లేనప్పుడు.. వాటిని తనఖా పెట్టుకుని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలెలా ఇచ్చాయి? వాటిని క్లయింట్ల ఖాతాల్లోకి బదలాయించొద్దంటూ ఎలా చెబుతాయి?‘ అని సెబీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.




**షేర్లన్నింటికీ రిస్కు..**

భారీ ఆస్తులను తనఖా పెట్టి స్వల్ప మొత్తంలో రుణాలు తీసుకుంటున్నప్పుడే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు అనుమానం రావాల్సిందని సంబంధిత వర్గాలు వ్యాఖ్యానించాయి. దాదాపు రూ.5,000 కోట్ల విలువ చేసే ప్రమోటర్ అసెట్స్‌కు ప్రతిగా కార్వీకి బ్యాంకులు రూ.1,200 కోట్లు రుణమిచ్చాయి. అలాగే రూ. 2,300 కోట్ల విలువ చేసే క్లయింట్ల షేర్లను తనఖా పెట్టి కార్వీ మరో రూ.600 కోట్లు రుణం తీసుకుంది. కార్వీ తీసుకున్న రుణాల్లో ఏ కొంచెం ఎగ్గొట్టినా.. ఇంత భారీ స్థాయిలో తనఖా పెట్టిన షేర్లన్నింటినీ బ్యాంకులు అమ్మేసే ప్రమాదం ఉంటుంది. పైపెచ్చు కార్వీ సొంత బ్యాలెన్స్ షీట్‌లో రూ.27 లక్షల విలువ చేసే షేర్లు మాత్రమే ఉండటం చూసైనా.. ఏదో పొరపాటు జరుగుతోందని బ్యాంకులు మేల్కొని ఉండాల్సిందని సంబంధిత వర్గాలు వ్యాఖ్యానించాయి. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కచ్చితంగా తప్పు చేశాయని ఇలాంటి ఉదంతాలు రుజువు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఐసీఐసీఐ, ఇండస్ఇండ్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కోటక్ మహీంద్రా బ్యాంకులతో పాటు బజాజ్ ఫైనాన్స్ వంటి సంస్థలు షేర్లను తనఖా పెట్టుకుని కార్వీకి దాదాపు రూ.1,800 కోట్ల మేర రుణాలిచ్చాయి.

### ఈవోడబ్ల్యూకీ సెబీ ఫిర్యాదు..?

కార్వీ కేసుకు సంబంధించి ముంబై పోలీస్‌లో భాగమైన ఆర్థిక నేరాల విభాగానికి (ఈవోడబ్ల్యూ) కూడా సెబీ ఫిర్యాదు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ‘కార్వీ కేసు కేవలం సెక్యూరిటీస్ చట్టానికి మాత్రమే పరిమితమైనది కాదు. ఇది సివిల్ కేసు కూడా కనక సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) ఆదేశాలిచ్చే అధికారాల్లేవు. కాబట్టి క్లయింట్ల షేర్లను దొంగిలించిందంటూ కార్వీపై ఈవోడబ్ల్యూకి సెబీ ఫిర్యాదు చేయొచ్చు‘ అని సంబంధిత వర్గాలు తెలిపాయి. క్లయింట్ల షేర్లను తనఖా పెట్టి రుణాలు తీసుకుంటున్న ఇతర బ్రోకరేజీ సంస్థలపైనా సెబీ దృష్టి సారించింది. సెక్యూరిటీలను తనఖా పెట్టి రూ.50 కోట్ల పైగా రుణాలు తీసుకున్న సంస్థలు నాలుగే ఉన్నాయని, మిగతా సంస్థలన్నీ సొంత షేర్లనే పూచీకత్తుగా పెట్టాయని తెలినట్లు సమాచారం.

# చివర్లో పుంజుకున్న మార్కెట్

- అంతంతమాత్రంగా అంతర్జాతీయ సంకేతాలు
- ఆరో రోజూ లాభపడిన రూపాయి
- బ్లూ చిప్ షేర్లలో షార్ట్ కవరింగ్
- 173 పాయింట్ల లాభంతో 40,413కు సెన్సెక్స్
- 53 పాయింట్లు పెరిగి 11,910కు నిఫ్టీ



ట్రేడింగ్ చివర్లో బ్యాంక్, ఐటీ, వాహన షేర్లలో కొనుగోళ్లు చోటు చేసుకోవడంతో బుధవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉన్నా, ఇండెక్స్‌లో వెయిటేజీ అధికంగా ఉన్న బ్లూ చిప్ షేర్లలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడంతో మన మార్కెట్ ముందుకే సాగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా ఆరో రోజూ పుంజుకోవడం సానుకూల ప్రభావం చూపించింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 11,900 పాయింట్లపైకి ఎగబాకింది. 53 పాయింట్ల లాభంతో 11,910 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక బీఎస్‌ఈ సెన్సెక్స్ 173 పాయింట్లు పెరిగి 40,413 పాయింట్ల వద్దకు చేరింది.

**331 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....**

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. మధ్యాహ్నం వరకూ పరిమిత శ్రేణిలో కదలాడింది. ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. చివరి గంటలో కోలు కొని లాభాల బాటపట్టింది. ఒక దశలో 105 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ మరో దశలో 226 పాయింట్లు లాభపడింది. రోజంతా 331 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. వృద్ధి అంచనాలను ఏడీబీ తగ్గించడం ఒకింత ప్రతికూలప్రభావం చూపించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బుధవారం అర్ధరాత్రి అమెరికా ఫెడ్ రిజర్వ్ రేట్ల నిర్ణయాన్ని వెలువరించనుండటం... ఇంగ్లండ్‌లో గురువారం ఎన్నికలు, అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందానికి గడువు (ఈ నెల 15న) దగ్గర పడుతుండటం, ఈ వారంలోనే ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడనుండటం వంటి పరిణామాలతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు.

- పెట్టుబడుల సమీకరణ విషయమై బుధవారం జరిగిన బోర్డ్ సమావేశం ఎలాంటి ఫలవంతమైన నిర్ణయం తీసుకోకపోవడంతో యెస్ బ్యాంక్ షేర్ 15 శాతం నష్టంతో రూ.42.80 వద్దకు చేరింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- కొన్ని ఆస్తులను విక్రయించడం ద్వారా రూ.17,500 కోట్లు సమీకరించనున్నదన్న వార్తల కారణంగా వొడాఫోన్ ఐడియా షేర్ 3 శాతం లాభంతో రూ.6.75 వద్ద ముగిసింది.
- ఎన్‌టీపీసీ షేర్ 2.7% లాభంతో రూ.113 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన షేర్ ఇదే.
- నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు ఊరటనిచ్చేలా క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ నిబంధనలను కేంద్రం సవరించిందన్న వార్తలతో ఎన్‌బీఎఫ్‌సీ, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల షేర్లు పెరిగాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,098 |
| ఎన్‌ఎస్‌ఈ | 31,869 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 13,31,138 |
| ఎఫ్‌ఐఐ | 605 |
| డీఐఐ | 240 |

## ఆకర్షణీయంగా ఆటోమొబైల్, కార్పొరేట్ బ్యాంకులు

**ఐటీఐ మ్యూచువల్ ఫండ్ సీఈవో జోసెఫ్**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆటోమొబైల్, కార్పొరేట్ బ్యాంకులు, పటిష్టమైన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు, ఫార్మా, టెలికం సంస్థలు ప్రస్తుతం ఇన్వెస్ట్‌మెంట్‌కు ఆకర్షణీయంగా ఉన్నాయని ఐటీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థ సీఈవో జార్జ్ హెబర్ జోసెఫ్ తెలిపారు. పదేళ్ల వ్యవధిలో రియల్టీ కూడా మంచి రాబడులు అందించగలదని పేర్కొన్నారు. మరోవైపు అధిక వేల్యుయేషన్స్ ఉన్న ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ స్టేపుల్స్ వంటి రంగాల సంస్థలకు దూరంగా ఉండటం శ్రేయస్కరమని బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. స్మాల్ క్యాప్ సంస్థల విషయంలో బులిష్‌గా ఉన్నట్లు జోసెఫ్ చెప్పారు. స్మాల్ క్యాప్ ఫండ్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి వచ్చిన పక్షంలో వచ్చే ఏడాది జనవరిలో దీన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం తమ సంస్థ ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) రూ. 200 కోట్లుగా ఉందన్నారు. 13 శాఖలు ఉండగా.. మార్చి ఆఖరు నాటికి 25కి పెంచుకోనున్నట్లు చెప్పారు. మరోవైపు, తాజాగా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజి ఫండ్‌ను ప్రారంభించినట్లు జోసెఫ్ తెలిపారు. ఇది డిసెంబర్ 23తో ముగుస్తుంది. సందర్భానుసారంగా ఈక్విటీ, డెట్ సాధనాల్లోకి ఇన్వెస్ట్ చేస్తూ మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ ప్రత్యేకతని జోసెఫ్ చెప్పారు.

### బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,750 | |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | |
| వెండి (కిలో) | 46,645 | |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,750 | ▲ 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,780 | ▲ 100 |
| వెండి (కిలో) | 44,400 | ▼ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,580 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,880 | ▼ 100 |
| వెండి (కిలో) | 44,000 | ▼ 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,890 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | 0 |
| వెండి (కిలో) | 44,500 | |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 58.87 (రాత్రి 11.30కు) | $ 59.24 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.75 (రాత్రి 11.30కు) | $ 64.34 (మంగళవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 439-00 |
| విజయవాడ | 454-00 |
| గోదావరి | 454-00 |
| **11-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 436-00 |

## రుణాల విభాగంలోకి రియల్‌మీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** చైనాలోని షెన్‌జెన్ ప్రధాన కేంద్రంగా ఉన్న స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ రియల్‌మీ... డిజిటల్ రుణాల విభాగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఈ నెలాఖరు నుంచి మన దేశంలో రుణ సేవలను ప్రారంభించనుంది. దీనికి సంబంధించి వచ్చే వారం న్యూఢిల్లీలో ఒక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దేశంలోని ప్రధాన బ్యాంక్‌లు, ప్రైవేట్ ఆర్థిక సంస్థలతో ఈ మేరకు సంస్థ ఒప్పందం చేసుకుంది. 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్క స్మార్ట్‌ఫోన్ యూజర్‌కు వ్యక్తిగత రుణాలను అందిస్తుంది. రూ.లక్ష వరకు రుణాన్ని 5 నిమిషాల్లో మంజూరు చేయడం దీని ప్రత్యేకత. ఇటీవలే చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ షావోమీ.. ఎంఐ క్రెడిట్ పేరిట డిజిటల్ లెండింగ్‌లోకి ప్రవేశించడం తెలిసిందే.

**స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో 14.3 శాతం వాటా..**

గతేడాది మేలో దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి రియల్‌మీ ప్రవేశించింది. ప్రస్తుతం మన దేశంతో పాటూ చైనా, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి 20 దేశాల్లో ఉంది. ఈ ఏడాది నవంబర్ నాటికి దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో రియల్‌మీకి 14.3 శాతం మార్కెట్ వాటా ఉంది.

## పదేళ్లలో రూ.5 వేల కోట్ల వ్యాపార లక్ష్యం

**ఆర్క్ గ్రూప్ సీఎండీ గుమ్మి రాంరెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్‌కు చెందిన మౌలిక, నిర్మాణ రంగ సంస్థ ఆర్క్ గ్రూప్ 2030 నాటికి రూ.5 వేల కోట్ల వ్యాపారాన్ని లక్ష్యంగా చేసుకుంది. గృహ నిర్మాణ, మౌలిక రంగ ప్రాజెక్ట్‌లు, కొత్త విభాగాల్లోకి ప్రవేశించటం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని కంపెనీ సీఎండీ గుమ్మి రాంరెడ్డి చెప్పారు. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ రూ.100 కోట్లు. ఆర్క్ గ్రూప్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఇప్పటివరకు తెలుగురాష్ట్రాలుసహా కర్నాటక, గోవా మహారాష్ట్ర, తమిళనాడుల్లో 50కి పైగా మౌలిక ప్రాజెక్ట్‌లు చేశాం. 3 ప్రాజెక్ట్స్ ఆర్డర్లు చేతిలో ఉన్నాయి. 5 లక్షల చదరపుటడుగుల్లో పలు నివాస సముదాయాలు నిర్మాణంలో ఉన్నాయి'' అని ఆయన వివరించారు. సంస్థకు ప్రస్తుతం వంద మంది ఉద్యోగులున్నారని.. ఈ సంఖ్యను 3 వేలకు పెంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గుమ్మి మేఘన పాల్గొన్నారు.

## జోస్ ఆలుక్కాస్‌లో డైమండ్ కార్నివల్

JOS ALUKKAS — A TRADITION OF FINE JEWELLERY

ప్రముఖ ఆభరణాల రిటైలింగ్ గ్రూప్‌లలో ఒకటైన జోస్ ఆలుక్కాస్... ఈ నెల 24 వరకూ 'డైమండ్ కార్నివల్' నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా ధ్రువీకరించిన వజ్రాలను ఈ కార్నివల్‌లో ప్రదర్శిస్తున్నట్లు సంస్థ ప్రకటన తెలిపింది. కార్నివల్ సందర్భంగా వజ్రాలను 20% తగ్గింపుతో కొనుగోలు చేయవచ్చని పేర్కొంది. రూ.15,000 వజ్రాలను కొనుగోలు చేసిన కస్టమర్‌కు ఉచితంగా ఒక బంగారు నాణెంను ఇవ్వనున్నట్లు పేర్కొంది.

## ఆస్తుల విక్రయ ప్రయత్నాల్లో ఐడియా!

- ఏజీఆర్ బకాయిలు చెల్లించే యత్నం
- ఆప్టిక్ ఫైబర్ వ్యాపార విక్రయానికి బ్రూక్‌ఫీల్డ్‌తో చర్చలు
- డేటా సెంటర్ అమ్మకానికి ఎడెల్‌వీజ్‌తో సంప్రదింపులు



**ముంబై:** భారీ రుణభారంతో కుదేలైన వొడాఫోన్ ఐడియా కంపెనీ ఆస్తుల విక్రయానికి వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ఆప్టిక్ ఫైబర్ వ్యాపారాన్ని విక్రయించడానికి బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్‌తోనూ, నవీ ముంబైలో ఉన్న డేటా సెంటర్‌ను అమ్మేయడానికి ఎడెల్‌వీజ్ గ్రూప్‌తోనూ ఐడియా చర్చలు జరుపుతోందని సమాచారం. సంబంధిత వర్గాల కథనం ప్రకారం... వొడాఫోన్ ఐడియా కంపెనీ తన 1,56,000 కిమీ. ఆప్టిక్ ఫైబర్ వ్యాపారాన్ని విక్రయించడానికి బ్రూక్‌ఫీల్డ్ సంస్థతో పాటు ఇతర సంస్థలతో కూడా చర్చలు జరుపుతోంది. ఈ వ్యాపారం విలువ 150–200 కోట్ల డాలర్ల మేర ఉండొచ్చని అంచనా. ఇక నవీ ముంబైలోని డేటా సెంటర్‌ను ఎడెల్‌వీజ్ సంస్థకు చెందిన ఎడెల్‌వీజ్ ఈల్డ్ ప్లస్ ఫండ్ కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఈ డేటా సెంటర్ విలువ 6–10 కోట్ల డాలర్ల మేర ఉండొచ్చు. సవరించిన స్థూల రాబడి(ఏజీఆర్)కు సంబంధించి వొడాఫోన్ ఐడియా రూ.53,000 కోట్ల బకాయిలను మూడు నెలల్లోగా చెల్లించాలని సుప్రీం కోర్ట్ ఈ ఏడాది అక్టోబర్24న తీర్పునిచ్చింది. ఈ ఆస్తుల విక్రయం ద్వారా ఈ బకాయిలను కొంతైనా తీర్చాలని ఈ కంపెనీ యోచిస్తోంది. అయితే టెలికం రంగానికి రూ.7 లక్షల కోట్లకు పైగా బకాయిలు ఉండటంతో ఆప్టిక్ ఫైబర్ ఆస్తుల విక్రయానికి బ్యాంక్‌లు అభ్యంతరం చెప్పే అవకాశాలున్నాయి.

## కార్పొబ్రీఫ్స్...

**పిరమల్ గ్రూప్, ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్**

ప్రధాన నగరాల్లోని రియల్టీ ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులు సమకూర్చే దిశగా పిరమల్ గ్రూప్, ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ కలిసి ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ప్రారంభించాయి. దీని పరిమాణం రూ. 2,000 కోట్లు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో సంక్షోభంతో రియల్ ఎస్టేట్ రంగం నిధుల కొరతతో అల్లాడుతున్న నేపథ్యంలో తాజా ఫండ్ ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఫ్యూచర్ సప్లై–చెయిన్ సొల్యూషన్స్**

కంపెనీలోని 22 శాతం వాటాను జపాన్‌కు చెందిన లాజిస్టిక్స్ దిగ్గజం, నిప్పన్ ఎక్స్‌ప్రెస్ దాదాపు రూ.700 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ డీల్‌లో భాగంగా ఫ్యూచర్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ కంపెనీ 22 శాతం వాటాకు సమానమైన 37,89,350 షేర్లను ఒక్కో షేర్‌ను రూ.664 ధరకు నిప్పన్ ఎక్స్‌ప్రెస్‌కు జారీ చేసింది.

## రూ. 2,400 కోట్ల పూచీకత్తు ఇవ్వండి

**కేంద్రాన్ని కోరిన ఎయిరిండియా**

**న్యూఢిల్లీ:** తీవ్ర నిధుల కొరత ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా (ఏఐ) కొత్తగా మరిన్ని రుణాలు సమీకరించే ప్రయత్నాల్లో పడింది. నిర్వహణ అవసరాల కోసం కావాల్సిన నిధులను సమీకరించుకునేందుకు రూ.2,400 కోట్ల మేర పూచీకత్తు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇవ్వనున్న దాదాపు రూ.7,600 కోట్ల గ్యారంటీలోనే ఇది భాగంగా ఉండనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రుణాలు, నష్టాలతో కుదేలవుతున్న ఎయిరిండియాను విక్రయించేందుకు కేంద్రం కసరత్తు చేస్తుండటం తెలిసిందే. 2018–19లో ఎయిరిండియా సుమారు రూ.8,556 కోట్ల నష్టాలు నమోదు చేసింది. కంపెనీ మూతబడకుండా కార్యకలాపాలు కొనసాగించేందుకు 2011–12 నుంచి కేంద్రం ఇప్పటి దాకా రూ.30,520 కోట్ల మేర తోడ్పాటు అందించిన సంగతి తెలిసిందే.

---

**రాష్ట్రీయం**

## ఎమ్మెల్యే ఊరు బాగుంది

**పంచసూత్రాల అమలులో కాసులపల్లి టాప్**

- ప్రధాని నరేంద్ర మోదీ వల్లే యోగాకు ప్రపంచ గుర్తింపు
- పెద్దపల్లి జిల్లా పర్యటనలో గవర్నర్ తమిళిసై

**పెద్దపల్లి:** 'పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఊరు పేరులోనే కాసులున్నాయి. కాసులపల్లి గ్రామం పంచసూత్రాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందనడంలో సందేహం లేదు' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో బుధవారం ఆమె పర్యటించారు. పెద్దపల్లి మండలంలోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వగ్రామం కాసులపల్లిలో ఆమె పర్యటించారు. అందంగా అలంకరించిన ప్రతి ఇంటిని ఆసక్తిగా తిలకించారు. మహిళలతో ముచ్చటించారు. ఇంటింటికీ మరుగుదొడ్డి, ఇంకుడు గుంతనిర్మాణంతో పాటు వాడవాడల్లో డ్రైనేజీ ఉన్న ఏకైక గ్రామంగా కాసులపల్లి రికార్డుకు ఎక్కిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అభినందించారు. కలెక్టర్ శ్రీదేవసేన కృషి, పట్టుదలతోనే స్వచ్ఛ జిల్లా అవార్డు దక్కించుకున్నారని తెలిపారు. అన్ని గ్రామాలు కాసులపల్లిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎన్టీపీసీ టౌన్‌షిప్ హాలులో నిర్వహించిన కేరళ యుద్ధ విద్య (కళరిపయట్టు)ను తిలకించారు. స్వదేశీ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. ప్రధానిమోదీ చొరవతోనే ఈ రోజు యోగాకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు.

**కాళేశ్వరం అద్భుతం**

గవర్నర్.. కాళేశ్వరం ప్రాజెక్టులోని 6వ ప్యాకేజీకి సంబంధించిన పనులను పరిశీలించారు. నందిమేడారంలోని నంది ప్రాజెక్టు సర్జిపూల్ విద్యుత్ పనులు, పంపుహౌస్ ద్వారా నీటి విడుదలను అధికారులతో కలసి తిలకించారు. రైతులకు సాగు నీరందించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం అని కితాబిచ్చారు. రైతులకు ఉపయోగపడే విధంగా సాగునీటి ప్రాజెక్టు తక్కువ సమయంలో పూర్తి కావడం అభినందనీయం అని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రయోజనాలను ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు గవర్నర్‌కు వివరించారు.



బతుకమ్మతో గవర్నర్ తమిళిసై, చిత్రంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## వికటించిన మధ్యాహ్న భోజనం

**35 మంది విద్యార్థులకు అస్వస్థత**

**చిన్నశంకరంపేట:** మధ్యాహ్న భోజనం వికటించడంతో 35 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎప్పటిలాగే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. సాయంత్రానికి ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా స్కూలు సిబ్బంది స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. విద్యార్థులు ఇంటికి చేరుకున్న తర్వాత ఆ సంఖ్య మరింత పెరిగింది. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 35మంది విద్యార్థులు మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

### క్లుప్తంగా...

## శ్రీరామ్‌కు 'రంగినేని' సాహిత్య పురస్కారం



**సిరిసిల్ల:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఏటా అందించే 'రంగినేని'సాహిత్య పురస్కారం–2019కి ప్రముఖ కవి శ్రీరామ్ రాసిన 'అద్వంద్వం'కవితా సంపుటి ఎంపికైంది. ఈ విషయాన్ని అవార్డు కమిటీ చైర్మన్ రంగినేని మోహన్‌రావు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రకటించారు. సిరిసిల్ల పట్టణ శివారు రగుడు గ్రామంలోని ట్రస్ట్‌లో 2020 జనవరి మూడో వారంలో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం అందజేస్తామని తెలిపారు. అవార్డు కింద రూ.15 వేల నగదు, జ్ఞాపిక, శాలువా, పురస్కారపత్రం బహూకరిస్తామని అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు.

## రేన్యతండా సర్పంచ్ అరెస్టు

**కొత్తగూడ:** సోషల్ మీడియాలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును అవమాన పరిచే విధంగా ఫొటో పంపినందుకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రేన్యతండా సర్పంచ్ బానోతు రమేశ్ రాథోడ్‌ను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని ఆదివాసీలు ఉద్యమం చేస్తున్నారు. అయితే ఈ ఉద్యమాన్ని నడుపుతున్న సోయంను అవమాన పరిచే విధంగా రమేశ్ పోస్టు చేయడంతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కేసును సైబర్ క్రైం పోలీసులకు బదిలీ చేయడంతో మహబూబాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో నిందితుడిని అరెస్ట్ చేసి ఉట్నూర్ తరలించినట్లు తెలుస్తోంది.

## చెరువులో పడిన కారు

**ప్రమాద సమయంలో కారులో ఆరుగురు**

- చాకచక్యంగా రక్షించిన ఆటో డ్రైవర్, పోలీసులు
- స్వల్పగాయాలతో బయటపడిన క్షతగాత్రులు

**కాల్వశ్రీరాంపూర్:** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ కారు ప్రమాదానికి గురైంది. గ్రామశివారులో అదుపు తప్పిన కారు చెరువులో పడింది. అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రులను బయటకు తీశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేస్తున్న గుర్రాల రాజిరెడ్డి, అతడి భార్య మధులిక, అత్తామామ వజ్రవ్వ, కిషన్‌రెడ్డి, ఇద్దరు పిల్లలతో కలసి మంగళవారం కాళేశ్వరంలో ముక్తీశ్వరుడి దర్శనానికి కారులో వెళ్లారు. రాత్రికి తిరుగు పయనమయ్యారు. కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెరువులో బోల్తా పడింది. క్షతగాత్రుల అరుపులు అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ శంకర్ విన్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఏఆర్‌ఎస్సైలు సురేశ్, ప్రసాద్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు సురేశ్, శ్రీనివాస్, వెంకన్న, పవన్ చెరువులోకి దిగి కారు అద్దాలు పగులగొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. వెంటనే స్పందించి తమ ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్, పోలీసులకు రాజిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



కారును బయటికి తీస్తున్న దృశ్యం

## బ్రేకులు ఫెయిల్

- అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న బస్సు.. ఎనిమిది మందికి గాయాలు
- డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం

**పిట్లం:** ఓ ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిలవడంతో చెట్టును ఢీకొట్టింది. దీంతో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బ్రహ్మణపల్లి గ్రామ శివారులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాన్స్‌వాడ డిపోకు చెందిన (ఏపీ 29 జెడ్ 1620) బస్సు పిట్లం నుంచి బాన్స్‌వాడకు బయలుదేరింది. బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. బ్రహ్మణపల్లి గేటు వద్దకు రాగానే రాంపూర్ వైపు నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న వారు అకస్మాత్తుగా బస్సు ముందు కొంత దూరంలో పడిపోయారు. వారిని తప్పించేందుకు డ్రైవర్ బ్రేకులు వేసేందుకు యత్నించగా.. ఫెయిలయ్యాయి. అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. గాయపడినవారిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.



చెట్టును ఢీకొన్న బస్సు

## దుబాయ్‌లో వలస కూలీ మృతి

**హరీశ్‌రావు చొరవతో స్వగ్రామానికి మృతదేహం**

**సిద్దిపేట రూరల్:** దుబాయ్‌లో పనికోసం వెళ్లిన సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన బుస్స బాలయ్య(37) గతనెల 27న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే బాలయ్య మృతికి సంబంధించిన వివరాలు తెలియకపోవడంతో చేసేదేమీలేక మంత్రి హరీశ్‌రావు చొరవతో మృతదేహాన్ని బుధవారం స్వగ్రామమైన మందపల్లికి తీసుకొచ్చారు. బాలయ్య మృతితో వారి కుటుంబానికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కొమ్ము రాజయ్య కోరారు.

## ఎంఐఎం బాటలో టీఆర్‌ఎస్

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు**



**నల్లగొండ టూటౌన్:** ఎంఐఎం ఆలోచనల మేరకే రాష్ట్రంలో టీఆర్‌ఎస్ నడుస్తోందని, తాము మొదటి నుంచీ చెబుతున్నది ఇప్పుడు రుజువైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు అన్నారు. బుధవారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతూ, నిజాం వారసత్వ రాజకీయాలను ఎంఐఎం నడిపిస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల ఫలితాలతో దక్షిణాదిన కర్ణాటకలో బీజేపీ బలమైన పార్టీగా నిరూపించుకుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు అస్థిత్వం లేదని, ఆ పార్టీ పతన దిశలో ఉందని చెప్పారు. పౌరసత్వ బిల్లు విషయంలో కాంగ్రెస్, ఇతర విపక్షాల దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మతం ఆధారంగా చర్చను ముందుకు తేవడం దుర్మార్గమన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనార్టీలుగా భావించే హిందువులకు భద్రత లేదన్నారు. భారత్‌లో మైనార్టీల జనాభా గణనీయంగా పెరిగిందని, హిందువుల జనాభా తగ్గిందని అన్నారు.

## మాకు న్యాయం చేయండి

**'హక్కుల' బృందం ఎదుట ఎన్‌కౌంటర్ మృతుల తల్లిదండ్రుల మొర**

**నారాయణపేట/మక్తల్:** 'మా బిడ్డలు తప్పు చేశారు.. అందుకు శిక్షించాలని చెప్పాం.. కానీ ఇలా చంపుతారని అనుకోలేదు.. మాకు న్యాయం చేయండి' అంటూ రాష్ట్ర పౌరహక్కుల సంఘం బృందం సభ్యులకు దిశ హత్య కేసులో ఎన్‌కౌంటర్ అయిన నలుగురు నిందితుల తల్లిదండ్రులు మొర పెట్టుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్, గుడిగండ్ల గ్రామాలను బుధవారం పౌరహక్కుల సంఘం బృందం సందర్శించింది. చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ బూటకమని నవీన్ తల్లి లక్ష్మి ఆరోపించింది. కోర్టు తీర్పు రాకముందే తన భర్తను ఎన్‌కౌంటర్ చేసి చంపడం న్యాయమా? అంటూ చెన్నకేశవులు భార్య రేణుక బోరుమంది. తన కోడలు గర్భిణి అని, ఆమెకు న్యాయం చేయాలని చెన్నకేశవులు తండ్రి కుర్మన్న వేడుకున్నాడు. ' మాకు ఎవరూ దిక్కులేరనే కదా ఇలా చేశారు. అదే ఉన్నోళ్లు అయితే ఇలా చేసేవారా'అంటూ శివ తండ్రి రాజప్ప ప్రశ్నించాడు. 'ఉన్న ఒక్క కొడుకును పోగొట్టుకున్నాం.. మా కొడుకును ఇలా చంపుతారని అనుకోలేదు' అని ఆరిఫ్ తల్లిదండ్రులు హుసేన్, మౌలానా బీ బోరుమన్నారు.

## విద్యుత్ కంచెకు చిరుత బలి

- బయటకు పొక్కకుండా దహనం
- ఐదుగురు నిందితుల అరెస్టు



**బజార్‌హత్నూర్:** అడవి పందుల కోసం పంట చేను చుట్టూ అమర్చిన విద్యుత్ కంచెకు తగిలి ఓ చిరుత పులి బలైంది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని డేడ్రా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇచ్చోడ అటవీశాఖ ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్‌ఆర్‌వో అప్పయ్య తెలిపిన వివరాల ప్రకారం.. డేడ్ర అటవీ బీట్‌లో గల ఉమర్డ(బి) గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చౌహాన్ నాందేవ్ తన చేనులో అడవి పందుల కోసం విద్యుత్ తీగలు అమర్చాడు. అటువైపు వచ్చిన చిరుత పులి విద్యుదాఘాతానికి గురైంది. మృతి చెందిన చిరుతను చూసిన చౌహాన్.. గ్రామానికి చెందిన మరో ఆరుగురు చౌహాన్ కృష్ణ, సిడం నాగోరావ్, కొడప కృష్ణ, పెందూర్ నాగేందర్, సోయం నాగేశ్వర్, మడవి సునిల్ సహకారంతో చిరుత కళేబరాన్ని దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్ఆర్‌వో అప్పయ్య, ఎఫ్ఎస్‌వో సుదర్శన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి చిరుత మాంసపు ముద్దను, కాలిన బూడిదను, 9 గోర్లు, 7 మీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు పంపారు. చౌహాన్ కృష్ణ, కొడప కిషన్‌లు ఇద్దరు పరారీలో ఉన్నారు.

# తేమ నుంచి తేటగా..






**సాక్షి, హైదరాబాద్:** సాధారణంగా నదులు, చెరువులు, భూగర్భం నుంచి సేకరించిన నీటిని వివిధ పద్ధతుల్లో శుద్ధిచేసి తాగేందుకు అనుకూలంగా మార్చడం గురించి విన్నాం. కానీ గాలిలోని తేమను స్వచ్ఛమైన జలాలుగా అందజేసే వినూత్న సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. 'మేఘదూత్ వాటర్ ఫ్రమ్ ఎయిర్ కియోస్క్'ను దేశంలోనే తొలిసారిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం ప్రారంభించనున్నారు. 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై దీనిని ఏర్పాటు చేస్తారు. మొదట వెయ్యి లీటర్లతో ప్రారంభించి 5 వేల లీటర్ల వరకు సామర్థ్యాన్ని పెంచనున్నారు. 'ఈ నీరు వంద శాతం స్వచ్ఛం. ఎలాంటి కలుషితాలు ఉండవు. అట్మాస్పెరిక్ వాటర్ జనరేషన్ టెక్నాలజీ ద్వారా గాలిలోని తేమ నుంచి ఈ నీటిని సేకరిస్తారు'అని ఇండియన్ రైల్వేస్టేషన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎస్‌డీసీ) సికింద్రాబాద్ స్టేషన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

### రక్షణ శాఖ తరువాత మన దగ్గరే..

మేఘదూత్ అట్మాస్పెరిక్ వాటర్ జనరేటర్, రెమినరలైజర్ ద్వారా తేమ నుంచి నీటి సేకరణ ప్రక్రియ నిర్వహిస్తారు. నగరానికి చెందిన స్టార్టప్ కంపెనీ మైత్రి ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. రక్షణశాఖలో మాత్రమే ఇప్పటి వరకు గాలిలోని తేమ నుంచి మంచినీటిని సేకరించే వ్యవస్థ ఉంది. కేంద్ర జల్‌శక్తితో పాటు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐపీఈఆర్), ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) వంటి సంస్థలు ఈ నీటిని వంద శాతం శుద్ధ జలాలుగా ఆమోదించాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం రైల్‌నీర్ ద్వారా అందజేస్తున్నట్లుగానే మేఘదూత్ కియోస్క్ నుంచి లభించే నీటినీ లీటరు రూ.8 చొప్పున విక్రయించనున్నారు.

### తేమ నుంచి నీటి సేకరణ ఇలా..

- గాలిలోని తేమలో పుష్కలంగా ఉండే జలాన్ని రిఫ్రిజిరేషన్ టెక్నిక్స్‌ను అనుసరించి మేఘదూత్ అట్మాస్పెరిక్ వాటర్ జనరేటర్ సేకరిస్తుంది.
- బయటి గాలిని లోపలికి లాక్కొని ఒక మార్గంలో చల్లటి కాయిల్స్ ద్వారా పంపించే క్రమంలో తేమ.. నీరుగా మారుతుంది.
- ఇలా వచ్చిన నీటి నుంచి ఘన పదార్థాలు, వాసనలు, బ్యాక్టీరియా కారకాలను ఫిల్టర్లు తొలగిస్తాయి.
- వివిధ రకాలుగా నీటిని శుద్ధి చేశాక వంద శాతం స్వచ్ఛమైన నీటిని నిల్వ చేస్తారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఈ నీరు ఉంటుంది.
- సికింద్రాబాద్ స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై మేఘదూత్ అట్మాస్పెరిక్ వాటర్ జనరేటర్ అండ్ రెమినరలైజర్ ఏర్పాటు చేశారు.

### సికింద్రాబాద్ స్టేషన్‌లో నీటి వినియోగమిలా..

| | |
|---|---|
| సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు | 1.93 లక్షలు |
| రైళ్ల శుభ్రత, ఇతర అవసరాలకు రోజువారీ నీటి వినియోగం | 27 లక్షల లీటర్లు |
| రోజూ స్టేషన్‌లో వినియోగమయ్యే తాగునీరు | 4.9 లక్షల లీటర్లు |
| తేమ నుంచి రోజూ సేకరించే జలాల పరిమాణం | 5,000 లీటర్లు |
| 'మేఘ్‌దూత్ కియోస్క్ 'స్వచ్ఛ జలం లీటరు ధర | రూ.8 |

## నానిగాడు చిత్ర హీరో ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్:** సినిమా విడుదలకు ముందే తన చిత్రాన్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారని ఆరోపిస్తూ ఇందుకు నిరసనగా 'నానిగాడు' సినిమా హీరో దుర్గా ప్రసాద్ బుధవారం ఉదయం ఫిలించాంబర్ ముందు ఆత్యాహత్యాయత్నానికి పాల్పడ్డారు. తనతో పాటు తెచ్చుకున్న పురుగుల మందును మీడియా ఎదుటే తాగేందుకు ప్రయత్నించగా, పోలీసులు అప్రమత్తమై సీసా లాక్కున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాధితుడిని అపోలో ఆస్పత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ హీరోగా నటించిన నానిగాడు సినిమా త్వరలో విడుదల కావాల్సి ఉంది. యూట్యూబ్ నుంచి ఆ చిత్రాన్ని తొలగించి తనకు న్యాయం చేయాలని కోరారు.

### ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో
## అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్లాంట్

**నెలకు రూ.9 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా**



**హైదరాబాద్:** రాష్ట్రంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ పవర్‌ప్లాంట్‌ను జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో నెలకొల్పారు. 2018లో 500 కిలోవాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఈ సంస్థ తాజాగా 350 కిలోవాట్ల సామర్థ్యం గల మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీంతో రెండు కలిపి రాష్ట్రంలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌గా నిలిచాయి. ఈ ప్లాంట్లు నెలకు రూ.9 లక్షల విద్యుత్ బిల్లులను ఆదా చేస్తున్నాయి. మొత్తంగా రూ.3.81 కోట్లు వెచ్చించి ప్లాంట్లు నెలకొల్పగా రూ.95 లక్షల (25 శాతం)ను జాతీయ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ రీయింబర్స్ చేసింది. త్వరలోనే మరో 150 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా 1,000 కిలోవాట్ల (ఒక మెగావాట్) సామర్థ్యం గల ప్లాంట్‌గా మార్చనున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. రూఫ్‌టాప్ సోలార్ నెట్ మీటరింగ్‌లో భాగంగా భవనాలపైగల సోలార్ ప్లాంట్‌ను డిస్కం గ్రిడ్‌కు కనెక్షన్ ఇస్తారు. ఎవరి భవనాలపై ఉత్పత్తయిన విద్యుత్‌ను వారు వినియోగించుకోవడానికి ఆస్కారం ఉండగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించాల్సి ఉంటుంది. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తాయి. ఇలా డిస్కంలు యూనిట్‌కు రూ.4.08 చొప్పున చెల్లిస్తాయి. ఒక వినియోగదారుడికి తాను వాడుకున్న విద్యుత్ నుంచి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా వచ్చిన ఆదాయాన్ని తీసేసి బిల్లు వేస్తారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఈ ప్లాంట్ల ద్వారా భారీగా విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

# ఇల్లరికం ఇష్టం లేక...

- భార్యతో సహా కొడుకునూ హత్య చేసిన అనంతప్ప
- విద్యుత్ వైర్ పట్టుకొని తనూ ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు


అనంతప్ప మహదేవి(ఫైల్) ఆకాశ్ (ఫైల్)

**హైదరాబాద్:** ఇల్లరికం ఇష్టం లేని ఓ వ్యక్తి.. తన భార్య, కొడుకును గొంతు నులిమి హత్య చేసి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కర్ణాటక రాంపూర్ యాద్గిరి జిల్లాకు చెందిన అనంతప్ప (25) అలియాస్ చిన్నాకు తన మేనత్త కూతురు మహాదేవి(22)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. అతడిని ఇల్లరికం తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కొన్నేళ్లు అత్తింటి దగ్గరున్న అనంతప్ప తరచూ హైదరాబాద్‌కు వచ్చి కొద్ది నెలలు పనిచేసి వెళ్లేవాడు. సంవత్సరం క్రితం మహాదేవి, కూతురు అర్చన(3), కొడుకు ఆకాశ్ (18 నెలలు)తో కలసి గౌలిదొడ్డికి వచ్చాడు. పెద్ద కూతురు అనురాధ అమ్మమ్మ వద్ద ఉంటోంది. స్థానికంగా మంచినీటి సరఫరా చేసే ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఇటీవల ఆ పని కూడా పోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్య మహాదేవి ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. ఆ తర్వాత కొడుకు ఆకాశ్‌ను కూడా చంపేశాడు. కానీ కూతురు అర్చనను వదిలేశాడు. ఉదయం 7.30 గంటల సమయంలో బెంగళూర్‌లో ఉండే స్నేహితుడు శ్రీశైలంకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. కేబుల్ వైర్‌తో ఉరి వేసుకోగా అది తెగి కిందపడిపోయాడు. తర్వాత విద్యుత్ వైర్లను ఎడమ చేతి వేళ్లకు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ లోపు శ్రీశైలం విషయాన్ని నానక్‌రాంగూడలో ఉండే అనంతప్ప అన్న కొడుకు చెన్నప్పకు తెలిపాడు. 8 గంటల సమయంలో అతను వచ్చి చూడగా అనంతప్ప అపస్మారక స్థితిలో ఉన్నాడు. అనంతప్ప ఆత్మహత్యాయత్నం చేసిన కొద్ది క్షణాల్లోనే ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బతికాడు. నిందితుడు గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహాదేవి, ఆకాష్ మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**తరచుగా గొడవలు...**

తాను ఆంజనేయ స్వామి భక్తుడినని, అందుకే పిల్లలకు 'అ'అక్షరంతో అనురాధ, అర్చన, ఆకాశ్ అని పిల్లల పేర్లు పెట్టుకున్నానని అనంతప్ప చెప్పాడు. మహాదేవికి వాళ్ల కుల దేవత దేవమ్మ అంటే ఇష్టమని, పూజల విషయంలోనూ ఇద్దరి మధ్య తరచుగా గొడవలు జరిగేవని అన్నాడు. కొద్ది రోజులుగా వనిగిరి రావాలని అత్తింటి వారు ఒత్తిడి చేస్తున్నారని, ఇల్లరికం ఇష్టం లేకనే భార్య, కొడుకును హత్యచేశానని అనంతప్ప చెప్పాడు. వచ్చే వారం అత్తింట్లో కుల దేవత పండగ ఉందని చెప్పడంతో బుధవారం ఉదయం పోదామని భార్యతో చెప్పినట్లు వివరించాడు. మంగళవారం సాయంత్రమే భార్య, కొడుకును చంపి తానూ చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

## సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

**కేటీఆర్‌కు చెక్కు అందజేసిన విద్యార్థులు**



**సాక్షి, హైదరాబాద్:** సమాజ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా విద్యార్థులు, యువత కలసికట్టుగా తమకు తోచిన రీతిలో పనిచేయాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. నలుగురు 12వ తరగతి విద్యార్థులు ఇటీవల 'హాలోవిన్ పార్టీ' సందర్భంగా తమ సహ విద్యార్థుల నుంచి సేకరించిన రూ.లక్షను సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తూ సంబంధిత చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు విద్యార్థులు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని పారిశుధ్యం, గుర్రపు డెక్క తొలగింపు తదితర పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్ల పనితీరును ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంలో తాము స్వచ్ఛందంగా పాల్గొంటామని విద్యార్థులు సంసిద్ధత వ్యక్తం చేశారు. విద్యార్థులు రోహన్‌రెడ్డి, శివానీ తాళ్లూరి, విశ్రుత్ దేవిరెడ్డి, శ్రేయా గోపరాజు రూ.5 లక్షల విరాళాన్ని సేకరించి, రూ.4 లక్షలను ఇంపాక్ట్ కేన్సర్ ఫౌండేషన్‌కు, మరో రూ.లక్ష సీఎం సహాయ నిధికి అందజేశారు.

### మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌కు మోక్షం

**ఫైలుపై సంతకం చేసిన సీఎం: ఉపాధ్యాయ సంఘాలు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌కు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపినట్లు ఉపాధ్యాయ సంఘాలు వెల్లడించాయి. సర్వీసు రూల్స్‌కు సంబంధించిన ఫైలుపై సీఎం బుధవారం సంతకం చేశారని పీఆర్‌టీయూ, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, సీహెచ్ రాములు, చావ రవి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2013–14 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్స్ ప్రారంభం కాగా, వాటిలో టీచర్లను 2013, 2014 సంవత్సరాల్లో విద్యా శాఖ నియమించింది. ప్రస్తుతం మొత్తంగా 194 మోడల్ స్కూళ్లలో 104 మంది ప్రిన్సిపాళ్లు, 1,989 మంది పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 764 మంది ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) పని చేస్తున్నారు. అయితే వారికి ఇప్పటివరకూ సర్వీసు నిబంధనలు రూపొందించలేదు. గతేడాది సెప్టెంబర్ 6న సీఎం సంతకం చేసినా జీవో జారీలో ఆర్థికశాఖ కొన్ని అభ్యం తరాలు వ్యక్తం చేసిందని తెలిపారు. దీంతో వాటిని సవరించి, మళ్లీ సీఎంకు ఫైలును పంపించగా, బుధవారం సంతకం చేశారన్నారు.

### 'అమ్మ రాజ్యం' సినిమా విడుదలకు సెన్సార్ ఓకే

**సాక్షి, హైదరాబాద్:** అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు సినిమాకు బుధవారం సెన్సార్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమా విడుదల విషయంలో సర్టిఫికెట్ జారీ అంశాన్ని సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ విచక్షణకే వదిలిపెడుతున్నట్లు హైకోర్టు ప్రకటించింది. రివైజింగ్ కమిటీ సినిమాను చూసిన తర్వాత ఏ విధమైన సర్టిఫికెట్ జారీ చేయాలో నిర్ణయిస్తుందని, దీంతో విచారణ ముగిసిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. చిత్రం పేరు దగ్గర నుంచి ట్రైలర్‌లోని పలు సన్నివేశాలు రెండు కులాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన ఇంద్రసేనాచౌదరి, మరొకరు దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు మరోసారి విచారించింది. కమ్మ రాజ్యంలో కడప రెడ్లు.. అనే టైటిల్‌ను మార్చామని, సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని చిత్ర దర్శకుడు రాంగోపాల్ వర్మ తరపు న్యాయవాది కె.దుర్గాప్రసాద్ కోరారు. పత్రికల పేర్లు కనపడకుండా, కులం పేరు వినపడకుండా చేశామని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించామని తెలిపారు.









Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com